


www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★



టెల్ అవీవ్‌లో రాత్రంతా లక్షమంది జాగారం 02

భారత్‌కు గొప్ప వైవిధ్యాన్ని ప్రతిబింబించే విద్యా వ్యవస్థ అవసరం 05

రిమాండ్ ఖైదీ మృతి.. బంధువుల ఆందోళన 03



సంపుటి 08, సంచిక: 312 | సోమవారం | 13-10-2025 | కరీంనగర్ Published from: **Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar** పేజీలు: 12+8 | వెల రూ. 5.00




### అమ్మాయిలు రాత్రిపూట బయటకు వెళ్ళొద్దు

పశ్చిమ బెంగాల్ దుర్గాపూర్‌లోని ఒక ప్రైవేట్ మెడికల్ కాలేజీకి చెందిన ఒడిశా విద్యార్థిని శుక్రవారం రాత్రి స్నేహితుడితో కలిసి విందుకు బయటకు వెళ్లినప్పుడు సామూహిక అత్యాచారానికి గురైన విషయం తెలిసిందే. ఈ ఘటనపై ముఖ్యమంత్రి మమతా బెనర్జీ దిగ్భ్రాంతికరమైన వ్యాఖ్యలు చేశారు. 05



### కర్రెగుట్టల్లో సిఆర్‌పిఎఫ్ శిక్షణ పాఠశాల

ఛత్తీస్‌గఢ్-తెలంగాణ సరిహద్దు వెంబడి ఉన్న కర్రెగుట్ట కొండలలో సైనికుల కోసం ఒక కమాండో శిక్షణ పాఠశాలను ఏర్పాటు చేయాలని సిఆర్‌పిఎఫ్ యోచిస్తోంది. ఈ ఏడాది ఏప్రిల్-మే మధ్య ఈ గుట్టలలో 31 మంది మావోయిస్టులను చంపిన అతిపెద్ద నక్సల్ వ్యతిరేక కార్యకలాపాలలో ఒకటి. 05



### పథకం ప్రకారం ఆర్‌టిఐ హననం

మోదీ ప్రభుత్వం దేశంలో సమాచార హక్కు చట్టాన్ని (ఆర్‌టిఐ చట్టం) పథకం ప్రకారం బలహీనపరచి హననానికి పాల్పడు తోందని కాంగ్రెస్‌పార్టీ విమర్శించింది. సమాచార హక్కు దేశంలో చట్టరూపం దాల్చి 20 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కాంగ్రెస్‌పార్టీ ప్రైవిధంగా స్పందించింది. 05

## చీరాల బీచ్‌లో విషాదం

సముద్ర స్నానం చేస్తూ ఐదుగురు గల్లంతు

ఒడ్డుకు కొట్టుకువచ్చిన మూడు మృతదేహాలు

మరో ఇద్దరికోసం గాలిస్తున్న గజ ఈతగాళ్లు

**చీరాల :** చీరాల మండలం వాడరేవులో విషాదం చోటు చేసుకుంది. ఐదుగురు విద్యార్థులు సముద్ర స్నానం కోసం వాడరేవు బీచ్‌కు వెళ్లి గల్లంతయ్యారు. నీటిలో మునిగి సముద్రంలోకి కొట్టుకుపోయారు. కొద్దిసేపటికి ముగ్గురు విద్యార్థుల మృతదేహాలు ఒడ్డుకు కొట్టుకొచ్చాయి. మరో ఇద్దరు విద్యార్థుల కోసం పోలీసులు తీవ్రంగా గాలిస్తున్నారు. సెలవు రోజులు కావడంతో బీచ్‌లో సరదాగా గడిపేందుకు అమరావతిలోని విట్ యూనివర్సిటీకి చెందిన కొందరు విద్యార్థులు వాడరేవు బీచ్‌కు వెళ్లారు. వారిలో సాకేత్, మణిదీప్, సాత్విక్, సోమేష్, గౌతమ్ అలల తాకిడికి సముద్రంలోకి కొట్టుకుపోయారు. దీంతో ఆ ప్రాంతానికి చెందిన మత్స్యకారులు, గజ ఈతగాళ్లు వారిని కాపాడేందుకు ప్రయత్నించారు. అయినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. గల్లంతైన కాసేపటికి సాకేత్, మణిదీప్, సాత్విక్ మృతదేహాలు ఒడ్డుకు కొట్టుకొచ్చాయి. సోమేష్, గౌతమ్‌ల ఆచూకీ ఇప్పటివరకూ లభ్యం కాలేదు. దీంతో ఈ ఇద్దరి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

## ఎస్ఆర్ఎస్‌పి-2 ప్రాజెక్టుకు
# ఆర్‌డిఆర్ పేరు

● 24 గంటల్లో జిఓ జారీ ● పార్టీ కోసం సర్వం ధారపోసిన రాంరెడ్డి దామోదర్‌రెడ్డి కుటుంబానికి రాజకీయంగా అవకాశం ఇస్తాం ● సంతాప సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటన



ప్రజాపక్షం/సూర్యాపేట

నాలుగు దశాబ్దాలుగా ప్రజలు, కాంగ్రెస్ పార్టీ కోసం మాజీ మంత్రి, పార్టీ సీనియర్ నాయకులు రాంరెడ్డి దామోదర్ రెడ్డి చేసిన సేవలు చిరస్మరణీయమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. రైతు బిడ్డగా పుట్టిన దామోదర్ రెడ్డి వారి కష్టసుఖాలను ఎరిగి అన్నదాతల సంక్షేమం కోసం శ్రీరాంసాగర్ రెండవ దశ ప్రాజెక్టు సాధనకు ఆయన చేసిన పోరాట ఫలితంగానే తుంగతుర్తి, సూర్యాపేట, కోదాడ నియోజక వర్గాలకు గోదావరి జలాలు కాల్వల్లో పారుతున్నాయని, దీంతో ఈ ప్రాంతం పచ్చని పంట పొలాలతో నేడు కలకలలాడుతుందన్నారు. నల్లగొండ ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితోపాటు శాసనసభ్యులందరి కోరిక మేరకు ఎస్ఆర్ఎస్‌పి 2 ప్రాజెక్టుకు ఆర్‌డిఆర్ (రాంరెడ్డి దామోదర్ రెడ్డి) పేరుగా తరువాయి 12లో

### దొర అయినా ఏనాడు అలా వ్యవహరించలేదు

కూనంనేని సాంబశివరావు 12



## బిజెపి, బిఆర్ఎస్‌కు బిసిలు అక్కరలేదా?

● 42శాతం రిజర్వేషన్ల కోసం తెలంగాణ ఉద్యమ తరహాలో ఎందుకు కలిసిరావడంలేదు ● సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు నిలదీత ● రిజర్వేషన్ల అమలుపై కేంద్ర ప్రభుత్వం ఎందుకు మాట్లాడదు? బిల్లును ఆమోదించదా? అని ప్రశ్న

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ ఉద్యమం తరహా ' బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల' సాధన కోసం బిజెపి, బిఆర్ఎస్ ఎందుకు కలిసి రావడం లేదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ప్రశ్నించారు. రిజర్వేషన్ల అమలుపైన రాహుల్ గాంధీ మాట్లాడడం లేదని ప్రశ్నిస్తున్న బిజెపి, రాహుల్ గాంధీ మాట్లాడకపోతే కేంద్ర ప్రభుత్వం మాట్లాడదా?, ఆ బిల్లులను ఆమోదించరా? అని నిలదీశారు. 'బిసి హక్కుల సాధన సమితి' రాష్ట్ర కౌన్సిల్ సమావేశం హైదరాబాద్‌లోని మఖ్దూం భవన్‌లో ఆదివారం జరిగింది. ఈ సమావేశానికి కూనంనేని సాంబశివ రావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. 'బిసి హక్కుల సాధన సమితి' అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు, కార్యదర్శి ధూళిపాల ధనుంజయ నాయుడు, గౌరవ అధ్యక్షుడు తాటి వెంకటేశ్వర్లు, నాయకులు పాండురంగాచారి, పల్నాడు యాదయ్య, విజయుడు, ఎల్. శ్రవన్, ప్రమీల, సి.హెచ్.కుమార స్వామి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కూనంనేని సాంబశివరావు ప్రసంగిస్తూ శాసనసభ ఆమోదించిన 'బిసి రిజర్వేషన్ల బిల్లుల'ను కేంద్రంలోని అధికార బిజెపి ఆమోదిస్తే, ప్రస్తుతం తరువాయి 2లో

## కాషాయ పార్టీలో నరనరానా బిసి వ్యతిరేకతే

రెండు పార్టీలు కలిసి డ్రామాలాడుతున్నాయ్

బిసి కోటాపై వెనక్కి తగ్గేది లేదు

42 శాతం రిజర్వేషన్లపై సుప్రీంకోర్టుకు వెళ్తున్నాం

టిపిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్



ప్రజాపక్షం/హైదరాబాద్

బిజెపి నరనరాన బిసి వ్యతిరేక పార్టీ అని టిపిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బిజెపి డ్రామాలో బిఆర్ఎస్ కూడా తోడైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు పార్టీలు కలిసి డ్రామాలు ఆడుతున్నాయని మండిపడ్డారు. గాంధీ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ బిసి రిజర్వేషన్ల కోసం సుప్రీంకోర్టు కువెళ్తామన్నారు. బిసి కోటాపై వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేశారు. ప్రతిపక్షాలు తరువాయి 2లో



# అంతరాలు పెరుగుతున్నాయ్

● విచ్ఛిన్నమవుతున్న కుటుంబ బంధాల సంఖ్య కూడా పైపైకి వెళుతోంది

● అన్యాయాలను ఎదిరించే అంశంలో మౌనంగా ఉండొద్దు

● హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నగేష్ భీమపాక

● ఘనంగా సిఆర్ ఫౌండేషన్ వృద్ధాశ్రమం 26వ వార్షికోత్సవం

ప్రజాపక్షం/హైదరాబాద్

చలి చీమ రెండు ముక్కలైనా కొట్లాడాలనే చూస్తుందని, అలాంటి చిన్న జీవికే అంత చైతన్యం ఉంటే, శక్తివంతమైన మనిషి తన చుట్టూ జరుగుతున్న అన్యాయాలను ఎదిరించే అంశంలో మౌనంగా ఉండకూడదనే ఉద్దేశంతోనే చంద్ర రాజేశ్వర్ రావు (సి.ఆర్) లాంటి ఎంతో మంది మహనీయులు రచయితలుగా, గాయకులుగా, కథనాలతో వివిధ రకాలుగా ప్రజలలో చైతన్యాన్ని నింపేందుకు కృషి చేశారని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నగేష్ భీమపాక అన్నారు. సమాజంలో అంతరాలు పెరిగిపోతున్నాయని, విచ్ఛిన్నమవుతున్న కుటుంబ బంధాల సంఖ్య పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. 'చంద్ర రాజేశ్వర్‌రావు (సి.ఆర్) ఫౌండేషన్ 'వృద్ధాశ్రమం 26వ వార్షికోత్సవం' ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి సిఆర్ ఫౌండేషన్ ఉపాధ్యక్షులు, మాజీ ఎంపి సయ్యద్ అజీజ్ పాషా సభాధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా హైకోర్ట్ న్యాయమూర్తి జస్టిస్ నగేష్ భీమపాక, సిఆర్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి మాజీ ఎంఎల్‌ఎ పల్లా వెంకట రెడ్డి , సి.ఆర్ ఫౌండేషన్ ఉపాధ్యక్షులు కె.అజయ్ కుమార్, కార్యదర్శి పి.జె. చంద్రశేఖర్ రావు, హెల్త్ సెంటర్ డైరక్టర్ డాక్టర్ రజని, సి.ఆర్.ఫౌండేషన్ కార్యవర్గ సభ్యులు కె.రామకృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా చంద్రరాజేశ్వర్ రావు,మహాత్మా గాంధీ చిత్రపటానికి పూల మాల వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం ఇటీవల మరణించిన మాజీ ఎంపి సురవరం సుధాకర్ రెడ్డితో పాటు వృద్ధాశ్రమంలో చనిపోయిన పలువురి మృతికి కొద్దిసేపు మౌనం పాటించి నివాళ్లు అర్పించారు. అంతకుముందు చంద్ర రాజేశ్వర్ రావు విగ్రహానికి పూల మాల తరువాయి 12లో

## బిసి జెఎసి ఆవిర్భావం

చైర్మన్‌గా ఆర్.కృష్ణయ్య, వర్కింగ్ చైర్మన్‌గా జాజుల వైస్ చైర్మన్‌గా నారగోని : 18న రాష్ట్ర బంద్



ప్రజాపక్షం/హైదరాబాద్

రిజర్వేషన్లను సాధించేందుకు వివిధ బిసి సంఘాలు ఏకతాటిపైకి వచ్చాయి. రిజర్వేషన్ల అమలు కోసం ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాలని నిర్ణయించాయి. ఇందులో భాగంగానే వివిధ బిసి సంఘాలతో 'బిసి ఐక్య కార్యాచరణ కమిటీ'(బిసి జెఎసి) ఏర్పడింది. జెఎసి చైర్మన్‌గా ఎంపి ఆర్.కృష్ణయ్య, వైస్ చైర్మన్‌గా విజిఆర్ నారగోని, వర్కింగ్‌చైర్మన్‌గా జాజుల శ్రీనివాస్‌గౌడ్, కో చైర్మన్లుగా దాసు సురేశ్, రాజారాం యాదవ్ ఎన్నికయ్యారు. ఈ నెల 13న తలపెట్టిన జాతీయ రహదారుల దిగ్బంధనం, 14న రాష్ట్ర బంద్ వాయిదా వేసి, ఈనెల 18వ తేదిన 'బంద్ ఫర్ జస్టిస్' పేరుతో రాష్ట్ర బంద్ చేపట్టాలని జెఎసి నిర్ణయించింది. బిసి జన సభ అధ్యక్షులు రాజారామ్ అధ్యక్షతన హైదరాబాద్ లక్డీకాపూల్ లోని అశోక్ హోటల్‌లో వివిధ తరువాయి 2లో

## చెరిసగం

● బిజెపి, జెడియులు చెరో 101 స్థానాల్లో పోటీ

● బిహార్‌లో సీట్ల పంపకాలు పూర్తి చేసిన ఎన్‌డిఎ

**న్యూఢిల్లీ :** బిహార్‌లో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనుండగా, వివిధ పార్టీల్లో సీట్ల కేటాయింపుపై తర్జనభర్జనలు జరుగుతున్నాయి. తాజాగా ఎన్‌డిఎలో సీట్ల పంపకంపై నెలకొన్న ప్రతిష్టంభనకు తెరపడింది. సీట్ల భాగస్వామ్యం ఖరారు చేసింది. మొత్తం 243 సీట్లపై ఒప్పందం కుదిరింది. బిజెపి, జెడియులు చెరో 101 స్థానాల్లో పోటీ చేయనున్నాయి. కేంద్రమంత్రి చిరాగ్ పాసవాన్ నేతృత్వంలోని లోక్ జన్‌శక్తి పార్టీ (రాంవిలాస్) 29 స్థానాల్లో బరిలో దిగనుంది. కేంద్ర మంత్రి జీతన్ రామ్ మాంఝీకి చెందిన హిందుస్థానీ అవామ్ మోర్చా (హెచ్‌ఎఎం)కు, కేంద్ర మాజీ మంత్రి ఉపేంద్ర కుశ్వాహా సారథ్యంలోని తరువాయి 2లో

### ట్రేడ్ వార్ ప్రారంభిస్తే
## పోరాడేందుకు సిద్ధం

**అమెరికాకు చైనా హెచ్చరిక**

● వాణిజ్య యుద్ధం విషయంలో మా వైఖరి స్థిరంగా, చెక్కుచెదరకుండా ఉంది

● యుద్ధ పరిస్థితులు రావాలని కోరుకోవడం లేదు



**బీజింగ్:** వాణిజ్య యుద్ధాన్ని తాము కోరుకోవడంలేదని, కానీ అమెరికా గనుక వాణిజ్య యుద్ధం ప్రారంభిస్తే ఎదుర్కొని పోరాడేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, భయపడేది లేదని చైనా హెచ్చరించింది. ఈ విషయంలో చైనా వైఖరి చాలా స్థిరంగా చెక్కుచెదరకుండా ఉందని, వాణిజ్య యుద్ధ పరిస్థితి రావాలని కోరుకోవడంలేదని ఆ దేశ వాణిజ్య మంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి ఒకరు ఆదివారం బీజింగ్‌లో స్పష్టం చేశారు. చైనా చట్టాలు, ఎగుమతి నిబంధనలకు అనుగుణంగా సాధారణ ప్రక్రియగా ఈ నియంత్రణలు విధించామని, ఒక బాధ్యతగల అతిపెద్ద దేశంగా, వాణిజ్య ఎగుమతుల దేశంగా చైనా ఎల్లప్పుడూ అంతిమంగా తమదేశ భద్రతను దృష్టిలో పెట్టుకునే చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. దేశీయ భద్రత, తరువాయి 2లో

# పాకిస్థాన్‌పై అఫ్గాన్ ప్రతీకార దాడి

ఆర్మీ కాల్పుల్లో 58 మంది పాక్ సైనికులు హతం

భారత్ ప్రోత్సాహంతోనే దాడులని పాక్ నిందలు : ఖండించిన కేంద్రం



**కాబూల్:** అఫ్గానిస్థాన్‌–పాకిస్థాన్ సరిహద్దుల్లో శనివారం రాత్రి పొద్దుపోయాక సైనికులమధ్య కాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో 58 మంది పాకిస్థానీ సైనికులను హతమార్చినట్లు అఫ్గానిస్థాన్ తాలిబన్ ప్రభుత్వం ఆదివారం ప్రకటించింది. అఫ్గానిస్థాన్ విదేశాంగమంత్రి న్యూఢిల్లీ పర్యటన పూర్వరంగంలో జరిగిన దాడులతో భారత ప్రభుత్వంపై పాకిస్థాన్ నిందలు వేసింది. ఈ వారం ఆరంభంలో పాకిస్థాన్ సైన్యం తమ గగనతలాన్ని ఉల్లంఘించి దాడులకు పాల్పడిందని, ఇందుకు ప్రతీకార దాడులు చేశామని, ఈ దాడుల్లో మరో 30 మంది పాకిస్థాన్ సైనికులు గాయపడ్డారని తాలిబన్ ప్రభుత్వం ప్రకటించింది. పాకిస్థాన్ కూడా ఆలస్యంగా ఒక ప్రకటన చేస్తూ, సరిహద్దుల్లో తాలిబన్ సైన్యం దాడుల్లో 23 మంది సైనికులు అమరులయ్యారని, అఫ్గానిస్థాన్‌వైపు సైనికులతోపాటు 200 ఉగ్రవాదులు మరణించారని పేర్కొంది. సరిహద్దుల్లో పాకిస్థానీ సైనిక కేంద్రాలపై అఫ్గానిస్థాన్ సైన్యం దాడులు చేసినట్లు రెండుదేశాల సైనికవర్గాలు ఒకేవిధమైన ప్రకటన చేశాయి. ఆదివారం ఉదయంనాటికి కాల్పులు ఆగిపోయినట్లు పాకిస్థాన్ పేర్కొంది. ఐతే ఖుర్రం ప్రాంతంలో ఇంకా అడపాదడపా కాల్పులు జరుగుతూనే ఉన్నాయని స్థానిక అధికారులు చెప్పారు. కానీ తమ సరిహద్దు కాల్పుల ఆపరేషన్ ఆదివారం తెల్లారకముందే ముగిసిందని తాలిబన్ ప్రభుత్వం పేర్కొంది. అఫ్గానిస్థాన్ గగనతలాన్ని పాకిస్థాన్ సైన్యం ఉల్లంఘించిందని, దీనికి ప్రతీకారంగా ఈ దాడులు చేశామని అఫ్గానిస్థాన్ రక్షణశాఖ అధికార ప్రతినిధి ఎనయతుల్లా ఖోవారజ్మీ చెప్పారు. తమ గగనతలాన్ని ఎవరైనా ఉల్లంఘిస్తే దానిని రక్షించుకోవడానికి సైన్యం సిద్ధంగా ఉంటుందని ఆయన చెప్పారు. అఫ్గానిస్థాన్‌లోని ఏ ప్రాంతంలో ఉన్న భూభాగానికీ కూడా తరువాయి 2లో



# ప్రపంచం
WORLD NEWS

## ఈజిప్టులో నేడు శిఖరాగ్ర సదస్సు

### గాజా శాంతి ఒప్పందంపై సంతకాలు

**షర్మ్–ఎల్–షేక్:** గాజాలో శాంతి ఒప్పందాన్ని ఖరారు చేసేందుకు వీలుగా 20 దేశాల నాయకులతో ఈజిప్టు ప్రభుత్వం సోమవారం ఒక శిఖరాగ్ర సదస్సు నిర్వహిస్తోంది. ఈ సదస్సులో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ కూడా పాల్గొంటున్నారు. ఈజిప్టు దేశాధ్యక్షుడు అబ్దెల్ ఫతా అల్–సిసి అధికార ప్రతినిధి ఈ విషయం చెప్పారు. గాజాలో శాంతి స్థాపనకు ఇజ్రాయెల్–హమాస్‌మధ్య ఒప్పందం కుదిరితే తుది పత్రాలపై సంతకాలు చేయడానికి తమ దేశానికి రావాలని ట్రంప్‌కు ఈజిప్టు అధ్యక్షుడు గతవారంలోనే ఆహ్వానం పలికారు. సోమవారం సదస్సులో శాంతి ఒప్పందం తుది ప్రతిపై నాయకులు సంతకాలు చేస్తారు. బ్రిటన్, స్పెయిన్, ఇటలీ, ఫ్రాన్స్‌దేశాల ప్రధాన నాయకులు హాజరవుతారు. జర్మనీ, ఫ్రాన్స్, బ్రిటన్, ఇటలీ, ఖతార్, యునైటెడ్ అరబ్ నేషన్స్, జోర్డాన్, టర్కీ, సౌదీ అరేబియా, పాకిస్థాన్, ఇండోనేసియా దేశాలకు చెందిన విదేశాంగమంత్రులు సోమవారం శిఖరాగ్ర సదస్సులో పాల్గొంటున్నారు.



## మడగాస్కర్‌లో అధికార పోరు

**ఆంటనానరివో:** ఆగ్నేయ ఆఫ్రికాతీరప్రాంత ద్వీపదేశం మడగాస్కర్‌లో సైన్యంలోని చీలికవర్గం దేశాధికారాన్ని స్వాధీనం చేసుకుంటామని ప్రకటించింది. దీంతో ఆ దేశంలో సంక్షోభం తారాస్థాయికి చేరింది. దేశాధ్యక్షుడు ఆండ్రీ రాజోలినా ప్రభుత్వాన్ని కూల్చివేసేందుకు గుర్తుతెలియని శక్తులు కుట్ర చేస్తున్నాయని అధ్యక్ష భవనం ప్రకటన చేసిన కొద్ది గంటలకే సైన్యంలోని చీలికవర్గం దేశాధికారాన్ని స్వాధీనం చేసుకుంటామని ప్రకటించింది. ఒకప్పుడు దేశాధ్యక్షుణ్ణి అధికారంలో నిలబెట్టేందుకు సహకరించిన సైన్యం ఇప్పుడు దేశంలో నిరసన ప్రదర్శకులతో చేతులు కలపడంతో చీలికవర్గం ఈ ప్రకటన చేసింది. సైన్యంలో త్రివిధ దళాలు తమ చెప్పుచేతల్లో ఉన్నాయని తెలిపింది. 2009లో కుట్రద్వారా రాజోలినాను సైన్యం అధికారంలో కూర్చోబెట్టింది. ఇప్పుడు ఆయనకు ఎదురు తిరిగింది. 2023లో రాజోలినా ఎన్నిక వివాదాస్పదమైనప్పటి నుండీ దేశంలో ప్రజాందోళన చెలరేగింది. కొద్దిరోజులుగా దేశంలో ప్రజలు ముఖ్యంగా యువకులు తమ ఆందోళనను ఉద్ధృతం చేశారు.

## ఆర్‌టిఐను చిత్తశుద్ధితో అమలు చేయాలి

**ప్రజాపక్షం / ఖైరతాబాద్ :** సమాచార హక్కు చట్టం (ఆర్‌టిఐ) అమలులో ప్రభుత్వ అధికారులు చిత్తశుద్ధితో వ్యవహరించాలని పలువురు వక్తలు కోరారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సమాచార హక్కు పరిరక్షణ సమితి, ఎలక్షన్ వాచ్ కమిటీ జాతీయ చైర్మన్ డా.బొమ్మర బోయిన కేశవులు ముదిరాజ్ అధ్యక్షతన సమాచార హక్కు చట్టం దినోత్సవం జరిగింది. దీనికి ముఖ్యఅతిథులుగా రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డా.జి.చిన్నారెడ్డి, మానవ హక్కుల కమిషన్ మాజీ చైర్మన్ డా.జి.చంద్రయ్య, టిజెఎస్ రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరామ్ హాజరై, మాట్లాడారు. సమాచార హక్కు చట్టాన్ని దుర్వినియోగం కాకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉన్నదని పేర్కొన్నారు.

## చెరిసగం

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రీయ లోక్‌మోర్చా (ఆర్‌ఎల్‌ఎం)కు ఆరు చొప్పున సీట్లు కేటాయించారు. ప్రధాని నరేంద్ర మోదీ, ఇతర సీనియర్ నాయకులు ఉన్న బిజెపి కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశం తర్వాత సీట్ల కేటాయింపు విషయాన్ని కేంద్రమంత్రి, బిజెపి సీనియర్ నేత ధర్మేంద్ర ప్రధాన్ ఖరారు చేశారు. జెడియు వర్కింగ్ ప్రెసిడెంట్ సంజయ్ కుమార్ ఝా, ఉప ముఖ్యమంత్రి, బిజెపి నాయకుడు సామ్రాట్ చౌదరి, కేంద్ర మంత్రి చిరాగ్ పాసవాన్ కూడా పోస్టులు పెట్టారు. లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్) 29 సీట్లలో పోటీ చేయనుంది. కనీసం 15 సీట్లు కావాలని పట్టుబట్టిన జితన్ రామ్ మాంఝీకి చెందిన హిందుస్తానీ అవామ్ మోర్చాకు ఆరు నియోజకవర్గాలు మాత్రమే దక్కాయి. మిగిలిన ఆరు అసెంబ్లీ విభాగాలు రాజ్యసభ ఎంపి ఉపేంద్ర కుష్వాహాకు చెందిన రాష్ట్రీయ లోక్ మోర్చాకు వెళ్లాయి. గత కొన్ని రోజులుగా దేశ రాజధానిలో నాయకులంతా ఈ ఒప్పందం స్నేహపూర్వక వాతావరణంలో కుదిరిందని ఏకగ్రీవంగా ప్రకటించారు. గత ఎన్నికల్లో జెడియు 115 సీట్లలో పోటీ చేసింది. ఆ తర్వాత బిజెపి 110 నియోజకవర్గాల్లో అభ్యర్థులను నిలబెట్టింది. హిందుస్తానీ అవామ్ మోర్చా ఏడు స్థానాల్లో బరిలో దిగనుంది. అప్పుడు లోక్ జనశక్తి పార్టీకి నాయకత్వం వహిస్తున్న పాస్‌వాన్ విడిగా పోటీ చేసి 135 సీట్లలో అభ్యర్థులను నిలబెట్టారు. 2020లో మరో ఎన్‌డిఎ భాగస్వామి, మాజీ రాష్ట్ర మంత్రి ముకేశ్ సహానీకి చెందిన వికాస్శీల్ ఇన్సాన్ పార్టీ, ప్రస్తుతం ఇండియా బ్లాక్‌లో ఉంది, నాలుగు సీట్లలో పోటీ చేసింది.

## బిసి వ్యతిరేకతే

(మొదటి పేజీ తరువాయి)

చేస్తున్నకుట్రలకు తాము భయపడమని తేల్చిచెప్పారు. బిసి రిజర్వేషన్‌ల పెంపుపై తమ చిత్తశుద్ధి ప్రజలకు తెలుసు అన్నారు. బిల్లులు గవర్నర్ దగ్గర పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ప్రధాని దగ్గరికి వెళ్లి బిజెపి నాయకులు ఎందుకు అడగడం లేదని ప్రశ్నించారు. బిసి సంఘాలు బంద్‌కు పిలుపునిస్తే మద్దతు ఇస్తామని మహేశ్ కుమార్ గౌడ్ ప్రకటించారు. బిసి సంఘాలు ధర్నా చేసినప్పుడు కేంద్ర మంత్రి బండి సంజయ్, ఈటల రాజేందర్ ఎక్కడ దాక్కున్నారని నిలదీశారు.

### ఆర్‌టిఐ చట్టానికి తూట్లు..

కేంద్రంలో కాంగ్రెస్ తీసుకొచ్చిన గొప్ప చట్టాలకు ఎన్‌డిఎ ప్రభుత్వం తూట్లు పొడిచిందని మహేశ్ కుమార్ గౌడ్ మండిపడ్డారు. యుపిఎ హయాంలో చారిత్రాత్మక చట్టాలు అమల్లోకి వచ్చాయన్నారు. దూరదృష్టితో యుపిఎ ప్రభుత్వం సమాచార హక్కు చట్టం తీసుకొచ్చిందన్నారు. ప్రతి పౌరుడు ప్రశ్నించే హక్కును కల్పించిన ఘనత కాంగ్రెస్‌కే దక్కిందన్నారు. కీలక చట్టాలను బిజెపి నిర్వీర్యం చేసిందని విమర్శించారు. అంబానీ, అదానీ కోసం ఆర్‌టిఐ చట్టానికి తూట్లు పొడుస్తోందని దుయ్యబట్టారు. ఆర్‌టిఐ చట్టానికి సవరణలు చేసి, దాని స్వతంత్రతను బలహీన పరిచారని విమర్శించారు. ఆర్‌టిఐని నీరు గార్చేందుకు కమిషనర్ పోస్టులను భర్తీ చేయడం లేదన్నారు. కేంద్రంలో 11 మంది ఆర్‌టిఐ కమిషనర్లు ఉండాల్సిన చోట ఇద్దరే ఉన్నారని తెలిపారు. ఆర్‌టిఐ తీసుకొచ్చి 25 ఏళ్లయిన సందర్భంగా దాని గొప్పతనం తెలియచేయాలని మహేశ్ కుమార్ గౌడ్ కోరా రు. కేంద్రంలోని బిజెపి సర్కార్ ప్రజలను వంచిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశా రు. కేంద్రంలోని ఫాసిస్టు బిజెపి ప్రభుత్వ అవినీతిని బహిర్గతం చేసే వ్యక్తులు రక్షణ లేకుండా దాడులు, వేధిం పులకు గురవుతున్నారని మహేశకుమార్ గౌడ్ అన్నారు.

# టెల్ అవీవ్‌లో రాత్రంతా లక్షమంది జాగారం

### ర్యాలీలో ట్రంప్ భజన చేసిన విట్‌కాఫ్
### గాజాలోకి వందల లారీల్లో మానవతా సహాయం




**కైరో:** గాజాలో శాంతిస్థాపన చర్యలు కీలకదశకు చేరుకున్నాయి. సోమ,మంగళవారాలలో జరిగే పరిణామాలు సజావుగా కొనసాగుతాయా? లేదా? అనే ఉత్కంఠతో ప్రపంచదేశాలు మధ్యప్రాచ్యంవైపే చూస్తున్నాయి. సోమవారం ఉదయం 4 గంటల నుండీ 6 గంటలలోపు బందీల విడుదల, గాజా స్ట్రిప్‌లో మానవతా సహాయ పంపిణీ ప్రారంభమవుతుందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించడంతో అందరూ అటే దృష్టిసారించారు. గాజా స్ట్రిప్‌లోకి ఆదివారం నుండీ ఇక ప్రతిరోజూ 600 ట్రక్కుల్లో ఆహారం, దుప్పట్లు, దుస్తులు, తాత్కాలిక డేరాలు, చమురు ఇతర మానవతా సహాయ వస్తువులు ప్రవేశించడం ప్రారంభమైంది. రఫా సరిహద్దులను కూడా రాకపోకలకు తెరిచారు. పాలస్తినా ప్రజలు గాజాలోకి తరలి రావడానికి వీలుగా తాత్కాలికంగా శిథిలాలను బుల్‌డోజర్లతో తొలగించారు. ఆదివారంనాడు గాజాకు 400 లారీల్లో మానవతా సహాయం, ఆహారం పంపినట్లు ఈజిప్టు ప్రభుత్వం ప్రకటించింది. వందల లారీలు ఈజిప్టు నుండి రఫా క్రాసింగ్‌లోకి రావడం వీడియోలలో కనిపించింది. గాజాలోకి 1.70 లక్షల మెట్రిక్ టన్నుల మానవతా సహాయం లారీల్లో ప్రవేశించేందుకు ఐక్యరాజ్యసమితికి ఇజ్రాయెల్ ప్రభుత్వం ఇప్పటికే తన సమ్మతి తెలియజేసింది. మరోవైపు బందీల విడుదలకు ముందే ఇజ్రాయెల్ రాజధాని టెల్‌అవీవ్‌లో హోస్టేజెస్ స్క్వేర్ వద్ద భారీ ర్యాలీలో లక్షమంది ప్రజలు పాల్గొన్నారు. నోబెల్ ప్రెసిడెంట్ ట్రంప్'' అంటూ హోస్టేజ్ స్క్వేర్ వద్ద పెద్ద పెద్దబ్యానర్లు ప్రదర్శించారు.

బందీల బంధువులు, స్నేహితులు,మిత్రులు ఈ హోస్టేజెస్ స్క్వేర్ వద్దనే ఆదివారం రాత్రంతా ఎదురుచూస్తూ జాగారం చేస్తామని ప్రకటించారు. రాత్రంతా అసాధారణమైన రీతిలో ఉత్సవాలు చేసుకుంటామని బంధువులు, మిత్రులు ప్రకటించారు. షర్మ్–ఎల్–షేక్‌లో గడచినవారంలో జరిగిన చర్చల్లో అమెరికా తరపున కీలకపాత్ర వహించిన మధ్యప్రాచ్య ప్రత్యేకదూత స్టీవ్ విట్‌కాఫ్, ట్రంప్ అల్లుడు కుషెర్న్ ఇజ్రాయెల్‌కు చేరుకుని ఈ భారీ ర్యాలీలో పాల్గొన్నారు. శాంతి, ఐక్యతలను ఆకాంక్షిస్తూ, తమ ప్రియతమ బంధువులు ఇంటికి తిరిగి వస్తున్నారన్న సంతోషంతో తాము ఈ ర్యాలీలో పాల్గొంటున్నామని, తమ గుండె ఉత్కంఠతో కొట్టుకుంటోందని ర్యాలీలో ప్రసంగించిన స్టీవ్ విట్‌కాఫ్ చెప్పారు. ఈ ఒప్పందం చేయడంలో అమెరికా కీలకపాత్ర వహించిందన్న విషయాన్ని ఇజ్రాయెల్ ప్రజలకు హత్తుకునేలా చెప్పి ప్రచారం చేయడంకోసమే విట్‌కాఫ్, కుష్నెర్ వచ్చారన్నట్టుగా ప్రవర్తించారు. పదే పదే వారు ట్రంప్ పేరు ప్రస్తావించారు. చర్చలకు సహకరించిన అరబ్ దేశాల నాయకులకు, సంఘీభావం ప్రకటించిన దేశాలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ట్రంప్ పేరు చెప్పినప్పుడల్లా ర్యాలీలో ప్రజలు నినాదాలతో హోరెత్తించారు. ఈ రాత్రి ఈ పరిణామంకోసం నేను ఎంతోకాలంగా ఎదురుచూశా, ఇది ఎంతో శక్తిమంతమైన సమయం, ఈ ర్యాలీలో లక్షమంది పాల్గొన్నారు అంటూ విట్‌కాఫ్ పదే పదే ట్రంప్‌ను ప్రశంసించారు. యూదులు, క్రైస్తవులు, ముస్లింలు ఐక్యంగా ఈ రాత్రంతా ఇక్కడే శాంతికోసం జపిస్తూ ఉంటున్నామన్నారు. బందీలు సురక్షితంగా ఇళ్ళకు తిరిగి రావాలని, దేవుడు వారిని ఆశీర్వదించాలంటూ విట్‌కాఫ్ తన ప్రసంగం ముగించారు.

ఇదిలా ఉండగా గాజాలో చాలామంది బందీల మృతదేహాలు లభ్యంకాలేదు. వారి జాడ తెలుసుకోవడానికి నాలుగు దేశాలతో ఒక అంతర్జాతీయ టాస్క్ ఫోర్స్‌ను కూడా ఏర్పాటు చేసి గాలింపు చేస్తున్నారు. సోమవారం నుండీ 20 మంది సజీవులైన బందీలను, 28 మంది నిర్జీవులైన బందీలను అప్పగించే ప్రక్రియ హమాస్ ప్రారంభించాలి. ఇందుకు ప్రతిగా ఇజ్రాయెల్ కూడా జీవితఖైదీలుగా ఉన్న 250 మంది పాలస్తీనియన్ల తోపాటు 2000 మంది ఖైదీలను విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. వీరిలో అతితీవ్రమైన నేరాలకు పాల్పడిన ఖైదీలను విడుదల చేసేందుకు నెతన్యాహూ ఇష్టపడలేదు.రెండేళ్ళ యుద్ధంలో 90 శాతం గాజా ప్రజలు నిరాశ్రయులయ్యారు. మరో 67వేలమంది పాలస్తీనియన్లు మరణించారు.

# కామెరూన్ అధ్యక్ష ఎన్నికలు



**యావుండే:** సెంట్రల్ ఆఫ్రికాలో నైజీరియా పొరుగు దేశం కామెరూన్‌లో అధ్యక్ష ఎన్నికలకు ఆదివారం పోలింగ్ ప్రక్రియ మొదలైంది. ఆ దేశంలో మొత్తం 80 లక్షలమంది ఓటర్లు ఉన్నారు. ప్రజలకు సన్నిహితంగా ఉండే దేశ నాయకులు తమకు కావాలని, తమ సమస్యలు విని పరిష్కరించే నాయకులు కావాలని పోలింగ్ కేంద్రాలవద్ద ఓటర్లు అంతర్జాతీయ మీడియా ప్రతినిధులకు చెప్పారు. ఐతే దేశంలో ఇంగ్లీషు మాట్లాడే ప్రాంతాలలో వేర్పాటువాదులు ఎన్నికల్లో పాల్గొనకుండా లాక్ డౌన్ ప్రకటించారు. ఈ ఎన్నికల్లో మొత్తం 11 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. 92 సంవత్సరాలు వయసుగల దేశాధ్యక్షుడు పాల్ బియా తిరిగి విజయం సాధించేందుకు ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడేందుకు 15 రోజులు పట్టే అవకాశం ఉంది. అధ్యక్షుడు గెలిస్తే ఏడుసంవత్సరాలపాటు అధికారంలో కొనసాగుతారు. 92 ఏళ్ళ వృద్ధుడైన దేశాధ్యక్షుడు పాల్ బియా 1980వ దశకం నుండీ అధికారంలో కొనసాగుతున్నారు. మరోసారి గెలిచేందుకు తహతహలాడుతున్నారు.

# 50.70 లక్షలమంది కస్టమర్ల డేటా లీక్

### ఆస్ట్రేలియా ఎయిర్‌లైన్ ప్రకటన



**సిడ్నీ:** ఈ ఏడాదిలో ఇప్పటివరకూ 50.70 లక్షలమంది కస్టమర్ల డేటాను అతిపెద్ద సైబర్‌దాడుల్లో చోరీ చేశారని, ఈ డేటాను ఆన్‌లైన్‌లో షేర్ చేశారని ఆస్ట్రేలియా ఎయిర్‌లైన్స్ 'క్వాంటాస్' ఆదివారం ప్రకటించింది. డజన్లకొద్దీ సంస్థలను ప్రభావితం చేయడం కోసమే ఈ డేటా చోరీ లీకేజీ జరిగిందని తెలిపింది. డిస్నీ, గూగుల్, ఐకియా, టయోటా, మెక్‌డోనాల్డ్స్‌తోపాటు తోటి విమానయాన సంస్థలు ఫ్రాన్స్ ఎయిర్‌వేస్‌లకు చెందిన డేటాను సాఫ్ట్‌వేర్ సంస్థ సేల్స్‌ఫోర్స్‌ను లక్ష్యంగా చేసుకుని చోరీ చేసినట్లు పేర్కొంది.తమ కస్టమర్ల డేటా కేంద్రాలపై సైబర్ నేరగాళ్ళు కన్నువేశారని గడచిన జులైనెలలోనే క్వాంటాస్ సంస్థ ధృవీకరించింది. కస్టమర్ల ఈమెయిల్స్, సెల్‌ఫోన్ నెంబర్లు, పుట్టినరోజు తేదీలు వంటి కీలక సమాచారాన్ని సైబర్ నేరగాళ్ళు చోరీ చేశారని పేర్కొంది.

# ఆపరేషన్ బ్లూస్టార్ పెద్ద తప్పిదం

### ఇందిరాగాంధీ తన జీవితాన్ని మూల్యంగా చెల్లించారు
### భింద్రన్‌వాలేను ఇందిర సృష్టించలేదు
### కాంగ్రెస్ నేత చిదంబరం వెల్లడి



**సిమ్లా:** స్వర్ణదేవాలయంలో దాక్కున్న ఉగ్రవాదులను పట్టుకునేందుకు అనుసరించిన 'ఆపరేషన్ బ్లూ స్టార్' సరైన విధానం కాదని, ఈ కారణంగా 1984లో ఆనాటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ తన జీవితాన్నే మూల్యంగా చెల్లించారని కాంగ్రెస్ నాయకుడు పి.చిదంబరం అన్నారు. ''స్వర్ణదేవాలయంలో దాక్కుని ఉన్న ఉగ్రవాదులందరినీ పట్టుకునేందుకు,దార్లోకి తీసుకువచ్చేందుకు మార్గం ఉంది, కానీ 'ఆపరేషన్ బ్లూ స్టార్' చేపట్టడం ఒక తప్పుడు మార్గం, నేను అంగీకరిస్తున్నా, ఆ తప్పు చేయడంవల్ల ఇందిరాగాంధీ తన జీవితాన్ని పణంగా పెట్టాల్సి వచ్చింది, ఈ విషయంలో ఒక్క ఇందిరాగాంధీని మాత్రమే మనం తప్పుపట్టలేం, సైన్యం, ఇంటిలిజన్స్, పోలీసులు, పౌర రక్షణ వర్గాలు... ఇలా అందరూ కలిసి తీసుకున్న సంచిత నిర్ణయ ప్రభావం ఈ తప్పుకు దారితీసింది, ఈ తప్పు చేయడంవల్ల ఇందిరాగాంధీ తన జీవితాన్ని మూల్యంగా చెల్లించారు'' అని కేంద్ర మాజీ హోంమంత్రి చిదంబరం అన్నారు. హిమాచల్ ప్రదేశ్‌లోని కసౌలీలో శనివారం జరిగిన కుష్వంత్‌సింగ్ సాహిత్యోత్సవం సందర్భంగా పై విషయాన్ని ప్రముఖంగా ప్రస్తావించారు. ప్రముఖ మహిళా జర్నలిస్టు, రామ్‌నాథ్ గోయంకా అవార్డు, ప్రభదత్ అవార్డు వంటి ప్రతిష్ఠాత్మకమైన పురస్కారాలు అందుకున్న హరిందర్ బవేజా రాసిన ''దే విల్ షూట్ యు మేడమ్ః మై లైఫ్ త్రూ కాన్‌ఫ్లిక్ట్' అనే పుస్తకం ఆవిష్కరణలో జరిగిన చర్చ సందర్భంగా చిదంబరం ఆపరేషన్ బ్లూస్టార్ గురించి ప్రస్తావించారు. ఆపరేషన్ బ్లూస్టార్ సైనిక చర్య 1984 జూన్ ఒకటో తేదీ నుండి పదో తేదీ మధ్యకాలంలో జరిగింది. దందమీ తక్సల్ నాయకుడు జర్నెల్‌సింగ్ భింద్రన్‌వాలే, అతడి సహచర ఉగ్రవాదులు అమృత్‌సర్‌లోని సిక్కుల పవిత్ర దేవాలయం స్వర్ణదేవాలయంలో దాక్కున్నారు. వారిని అంతం చేసేందుకు ఇందిరాగాంధీ ప్రభుత్వం ఆనాడు ఆపరేషన్ బ్లూస్టార్ సైనిక చర్య చేపట్టింది. అదే సంవత్సరం అక్టోబరు 31వ తేదీన ఇందిరాగాంధీ హత్యకు గురయ్యారు. ఏ సేవలపట్లగానీ, సైనిక అధికారులపట్లగానీ తనకు ఎలాంటి అగౌరవం లేదని, కానీ ఆపరేషన్ బ్లూస్టార్ సైనిక చర్య చేపట్టడం మాత్రం పెద్ద తప్పిదని, అది సరైన చర్య కాదని ఉగ్రవాదులను పట్టుకోవడానికి, వారిని దార్లోకి తీసుకురావడానికి మార్గం ఉందని అన్నారు. తర్వాత మూడు నాలుగేళ్ళకు సూర్జిత్‌సింగ్ బర్నాలా ముఖ్యమంత్రిగా ఉండగా ఆపరేషన్ బ్లాక్ థండర్ ద్వారా సైన్యాన్ని తాము సరైన మార్గంలో నడిపించామన్నారు. 1986లో ఒకసారి, 1988లో మరోసారి ఉగ్రవాదులను స్వర్ణదేవాలయం నుండి బయటకు తీసుకురావడానికి చేపట్టారు. ఈ సందర్భంగా పుస్తక రచయిత్రి బవేజా మాట్లాడుతూ, ఆపరేషన్ బ్లూస్టార్ కారణంగా పంజాబ్‌లో తదుపరి హింసాత్మక అధ్యాయానికి దారితీసిందన్నారు. ఇందిరాగాంధీ రాజకీయాలను, మతాన్ని ఏకం చేశారని, అకాలీలను అదుపు చేసేందుకు భింద్రన్‌వాలే సహాయం తీసుకున్నారని అన్నారు. ఇది అత్యున్నతమైన తప్పుడు ఆలోచనగా అభివర్ణించారు. ఐతే భింద్రన్‌వాలే పాత్రను ఇందిరాగాంధీయే సృష్టించారన్న రచయిత్రి, జర్నలిస్టు హరిందర్‌బవేజా అభిప్రాయాలను పి.చిదంబరం తీవ్రంగా వ్యతిరేకించారు. అదేవిధంగా కశ్మీరు సమస్యపై కూడా ఈ సందర్భంగా సుదీర్ఘంగా చర్చించారు. ఒక జర్నలిస్టుగా హరిందర్ బవేజా పంజాబ్‌లో, జమ్మూకశ్మీరులో పని చేసి అనేక వివాదాలకు సంబంధించిన వార్తలను సేకరించిన అనుభవజ్ఞురాలు. ఆమె తన అనుభవాలను అనేక పుస్తకాలలో నిక్షిప్తం చేశారు. ''కశ్మీరీ ప్రజలను పాకిస్థాన్ తన ప్రయోజనాలకోసం ఉపయోగించుకుందని మనం తొందరగానే అర్థం చేసుకున్నాం, కానీ కేంద్ర ప్రభుత్వం మాత్రం కశ్మీరులోయ ప్రజలలో ఉన్న అవిశ్వాసాన్ని తగ్గించేందుకు ఉన్న అవకాశాన్ని ఏనాడూ అందిపుచ్చుకోలేదు'' అని హరిందర్ బవేజా విమర్శించారు. దేశ ప్రజలపై సంఘర్షణలు చేసిన గాయాల గురించి మనం మాట్లాడుతున్నామన్నారు. ప్రతి సాయంత్రం టెలివిజన్‌లో కశ్మీరీ వార్తలను చూస్తామని, కానీ అందుకు భిన్నమైన కథ కశ్మీరులో ఉందని చిదంబరం అన్నారు.

## బిసిలు అక్కరలేదా?

(మొదటి పేజీ తరువాయి)

రిజర్వేషన్ల సమస్య ఉత్పన్నమయ్యేదే కాదు కదా? అని ప్రశ్నించారు. రిజర్వేషన్ల విషయంలో బిజెపి తన వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఒకవైపు అసెంబ్లీలో బిసి రిజర్వేషన్ల బిల్లుకు బిజెపి మద్దతు పలుకుతూనే, ఆ బిల్లు ఎలా పెండింగ్‌లో ఉండాలని ఆలోచిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వమే దేశ వ్యాప్తంగా కులగనణ చేపట్టి, వాటి ఆధారంగా రిజర్వేషన్లు అమలు చేయాలి కదా?, మిగతా రాష్ట్రాలలో కూడా బిసిలు ఓట్లు వేస్తేనే బిజెపి అధికారంలోనికి వచ్చిందని అన్నారు. బిపి మండల కమిషన్‌కు వ్యతిరేకంగా అప్పటి బిజెపి సీనియర్ నాయకుడు అద్వాని కమండల్ యాత్రను నిర్వహించారని కూనంనేని గుర్తుచేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కూడా సాధ్యం కాదని అనేక మంది చెప్పారని, కానీ అందరూ కలిసి ఉద్యమించారని, తద్వారానే రాష్ట్ర ఏర్పాటు జరిగింది, రిజర్వేషన్లు కూడా అలాగే చేస్తే సాధ్యమవుతుందని వివిధ రాజకీయ పార్టీలకు కూనంనేని సూచించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఖమ్మంలో ఉద్యమం లేదని చెబుతున్న సమయంలోనే తాను ఎంఎల్‌ఏగా పాదయాత్ర చేపట్టానని గుర్తుచేశారు. ఏ నినాదం వెనకాల ఎవరి ప్రయోజనాలు ఉంటాయో అర్థం చేసుకోవాలని, ఏ రాజకీయ పార్టీ నిర్ణయం ఎలా ఉన్నదోకూడా లోతుగా పరిశీలించాలని ఆయన సూచించారు. బిసి రిజర్వేషన్ల విషయంలో బిజెపి, బిఆర్‌ఎస్ కేవలం ఆరోపణలకే పరిమితం కాకుండా చిత్తశుద్ధితో కలిసి ముందుకు రావాలని కూనంనేని సూచించారు. వర్గ ప్రయోజనాలను కాపాడుకుంటూనే, వెనుకబాటుతనంలో ఉన్న కులాలను బయటికి తీసుకురావాలని 'బిసి హక్కుల సాధన సమితి' నాయకులకు సూచించారు. రిజర్వేషన్ల సాధన కోసం ఉద్యమించాలన్నారు. బిసి రిజర్వేషన్లను సాధించే దిశగా ఉద్యమ కార్యా చరణను రూపొందించాలని పిలుపు నిచ్చారు.

## పోరాడేందుకు సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

అంతర్జాతీయ ఉమ్మడి భద్రత సర్వసాధారణమైన, న్యాయబద్ధమైన సూత్రబద్ధ వైఖరి అని తేల్చి చెప్పారు. దేశీయ భద్రతపై దీర్ఘకాలంగా అమెరికా ఆధిపత్య భావజాలం ప్రదర్శిస్తోందని, ఎగుమతి నియంత్రణలను దుర్వినియోగం చేస్తోందని సెమీ కండక్టర్లు, చిప్‌లు సహా వివిధ రకాల ఉత్పత్తులపై చైనాకు వ్యతిరేకంగా ఏకపక్ష టారిఫ్‌లతో వివక్షపూరిత చర్యలకు పాల్పడుతోందని విమర్శించారు. గడచిన సెప్టెంబరునెలలో మాడ్రిడ్‌లో చైనా–అమెరికా మధ్య వాణిజ్య,ఆర్థిక చర్చలు ముగిసిన 20 రోజుల తర్వాత నుండీ చైనాపై అనేక నియంత్రణలను ట్రంప్ అమలు చేయడం ప్రారంభించారు. ఈ తప్పుడు విధానాలను సరిదిద్దుకోవాలని చైనా అనేకసార్లు విజ్ఞప్తి చేసింది. కార్లు, సెల్‌ఫోన్‌ల తయారీలో ఉపయోగించే అరుదైన ఖనిజాలను ప్రపంచదేశాలకు సరఫరా చేయడంలో ఆధిపత్యస్థానంలో ఉన్న చైనా ఈ ఖనిజాల ఎగుమతులపై అక్టోబరు 9వ తేదీన తాజాగా విధించిన నియంత్రణలను సమర్థించుకుంది. అరుదైన ఖనిజాల ఎగుమతి చేయడంపై చైనా కొత్త నియంత్రణలు విధించడంతో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చైనాపై 100 శాతం అదనపు సుంకాలు విధిస్తున్నట్లు అక్టోబరు 10న ప్రకటించారు. చైనా అధ్యక్షుడితో ఈనెలలో దక్షిణ కొరియాలో జరిగే శిఖరాగ్ర సమావేశం జరుగుతుందన్న హామీ లేదని కూడా ట్రంప్ ప్రకటించారు. కానీ అరుదైన మూలకాలపై నియంత్రణలను సమర్థించుకున్న చైనా, డోనాల్డ్ ట్రంప్ టారిఫ్‌లపై ద్వంద్వ ప్రమాణాలు అనుసరిస్తున్నారని విమర్శించింది. చైనాతో వాణిజ్య కార్యకలాపాలు నిర్వహించేటప్పుడు ఉద్దేశపూర్వకంగా భారీస్థాయిలో సుంకాలను విధించడం సరైన చర్యలు కావని, వ్యాపారానికి ఇది సరైన మార్గం కాదని కూడా హితవు చెప్పింది. గడచిన ఏప్రిల్ తర్వాత ట్రంప్ సుంకాలపై పేచీ మొదలుపెట్టడంతో మరోసారి స్టాక్‌మార్కెట్లు పతనమయ్యాయి. అమెరికాకు దిగుమతయ్యే కీలకమైన చైనా సాఫ్ట్‌వేర్‌లపై నియంత్రణలు నవంబరు 1వ తేదీ నుండీ అమలులోకి వస్తాయన్నారు. ''చైనా శత్రుత్వం ప్రదర్శిస్తోంది, ప్రపంచాన్ని బందీగా ఉంచాలని ప్రయత్నం చేస్తోంది'' అని సోషల్ మీడియాలో ట్రంప్ విమర్శించగా, రక్షణవాదం, గుత్తాధిపత్యం పోవాలని, బహుళపక్ష వాణిజ్యం, స్వేచ్ఛా వాణిజ్యాన్ని అన్నిదేశాలూ ప్రోత్సహించాలని దక్షిణాఫ్రికాలో జరిగిన జి–20 వాణిజ్య పెట్టుబడి మంత్రుల సమావేశంలో చైనా ప్రతినిధి పిలుపు ఇచ్చారు. హరిత పారిశ్రామికీకరణ, స్థిరమైన అభివృద్ధిని సాధించాలంటే బహుళపక్ష వాణిజ్యవ్యవస్థ అమలులోకి రావాలన్నారు.

## జెఎసి ఆవిర్భావం

(మొదటి పేజీ తరువాయి)

బిసి సంఘాల సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా రిజర్వేషన్ల అమలు, ఉద్యమ ఉధృతం, భవిష్యత్ కార్యాచరణ తదితర అంశాలపైచర్చించారు. అనంతరం బిసి రిజర్వేషన్ల సాధనకు ఐక్య ఉద్యమాల నిమ్మితం ఈ సమావేశంలో 'బిసి ఐక్య కార్యాచరణ కమిటీ'(బిసి జెఎసి) ఏర్ప టు చేశారు. జెఎసి ఛైర్మన్‌గా ఎంపి ఆర్.కృష్ణయ్య, వైస్ చైర్మన్‌గా విజిఆర్ నారగోని, వర్కింగ్ చైర్మన్‌గా జాజుల శ్రీనివాస్‌గౌడ్, కో చైర్మన్లుగా దాసు సురేశ్, రాజారామ్ యాదవ్, మీడియా కోఆర్డినేటర్‌గా గుజ్జ కృష్ణ ఎన్నికయ్యారు. అనంతరం ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ బిసిల్లోని ప్రతి కుల సంఘం నుంచి ఒక కమిటీని ఏర్పాటు చేస్తామన్నారు. బిసి ఉద్యమం ఇంతటితో ఆగదని, బిసిలను చట్టసభల్లో కూర్చోబెట్టేవరకు పోరాడుతామని స్పష్టం చేశారు. రాష్ట్ర బంద్ విజయవంతం చేసేందుకు అన్ని రాజకీయ పార్టీలను కలుపుకొని తమ వాటా దక్కే వరకు పోరాడుతామని చెప్పారు.జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ బిసిలకు రావాల్సిన నోటి కాడిముద్దను పిడికెడు శాతం లేని, రిజర్వేషన్ల వ్యతిరేకులు అడ్డుకున్నారని మండిపడ్డారు. రిజర్వేషన్ వ్యతిరేకులకు, కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు సెగ పుట్టించేందుకు ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో బిసి నేతలు గుజ్జ సత్యం, నీలం వెంకటేశ్, అనంతయ్య, నందగోపాల్, కుందారం గణేశ్‌చారి, కుల్కచర్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## అఫ్గాన్ ప్రతీకార దాడి

(మొదటి పేజీ తరువాయి)

ఎలాంటి ముప్పూ లేదని పరిపాలనావిభాగం అధికార ప్రతినిధి జబిహుల్లా ముజహిద్ చెప్పారు. పాకిస్థాన్ ఒక ప్రకటన చేస్తూ తాలిబన్ దాడులకు ప్రతిగా దాడులు చేశామని, ఆ దేశ సరిహద్దుల్లో ఉన్న 19 సైనిక కేంద్రాలను స్వాధీనం చేసుకున్నామని ప్రకటించింది. ఎలాంటి కవ్వింపు చర్యలూ లేకుండా అఫ్గానిస్థాన్ సైనికులు కాల్పులకు తెగబడ్డారని, వారి దుస్సాహసాన్ని విఫలం చేశామని, ఆ దేశ సైనిక కేంద్రాలను ధ్వంసం చేశామని, పలు సైనిక పోస్టులను స్వాధీనం చేసుకున్నామని పాకిస్థాన్ హోంమంత్రి మొహిసిన్ నక్వీ ప్రకటించారు. తాలిబన్ ప్రభుత్వ సైన్యం తమ పౌరులపై కాల్పులు జరిపారన్నారు. అఫ్గానిస్థాన్‌కు చెందిన 19 సరిహద్దు సైనిక పోస్టులను స్వాధీనం చేసుకున్నట్లు పాకిస్థాన్ పిటీవీ న్యూస్ ఆదివారం మధ్యాహ్నం ప్రకటించింది. పాకిస్థాన్ సైన్యం విడుదల చేసిన వీడియో ఫూటేజీలను చూస్తే సరిహద్దుల్లో తుపాకీ కాల్పులు, రాత్రివేళ ఆకాశంలో మంటలను ప్రతిబింబించాయి. తమదేశంలో దాడులు చేస్తున్న తాలిబన్‌కు చెందిన అఫ్గానిస్థాన్ అధ్యక్షుడు ఈ సరిహద్దు కేంద్రాలపై జరిగిన దాడుల్లో మరణించగా, మిగిలిన ఉగ్రవాదులు ప్రాణభయంతో పారిపోయారని పాకిస్థాన్ ప్రకటించింది. మనోజ్‌బా క్యాంప్ బెటాలియన్ కేంద్ర కార్యాలయాన్ని పూర్తిగా ధ్వంసం చేశామని, జాన్‌దుస్తర్ పోస్ట్‌ను, తుర్క్‌మెంజై క్యాంప్,ఖార్‌జై ఫోర్ట్‌ను ధ్వంసం చేసినట్లు పాకిస్థాన్ భద్రతా దళాలను ఉటంకిస్తూ రేడియో పాకిస్థాన్ ప్రకటించింది. ఈ రెండు దేశాలమధ్యా 2,600 కి.మీ '(1600 మైళ్ళు) నిడివిగల సరిహద్దు ప్రాంతం ఉంది. ఈ దాడుల ఘటనకు కారణం, సైనికుల మరణాలపై తాలిబన్ ప్రకటనను ఖండిస్తూ పాకిస్థాన్ రక్షణశాఖ ఎలాంటి ప్రకటన చేయలేదు. అఫ్గానిస్థాన్ గగనతలాన్ని ఉల్లంఘించిన విషయాన్ని కూడా పాకిస్థాన్ ధృవీకరించలేదు. ఐతే పాకిస్థాన్ మాత్రం భారతదేశం ప్రోత్సాహంతోనే ఇదంతా జరుగుతోందని, పాకిస్థానీ తాలిబన్లకు అఫ్గానిస్థాన్ తన భూభాగంలో స్థావరం ఇచ్చి మద్దతు ఇస్తోందని, ఈ తాలిబన్లు పాకిస్థాన్‌పై దాడులు చేస్తున్నారని, ఇందులో భారత్ ప్రోత్సాహం ఉందని పాకిస్థాన్ ప్రభుత్వం ఆరోపించింది. తాలిబన్ తాత్కాలిక ప్రభుత్వ హయాంలో ఆ దేశ భూభాగం నుండి భారతదేశ మద్దతుతో పనిచేస్తున్న ఖావరిజ్ ఉగ్రవాదులు తరచు తమ దేశంపై దాడులు చేస్తున్నారని ఆసిఫ్ అలీ జర్దారీ ఆరోపించారు. అఫ్గానిస్థాన్ భూభాగం నుండి ఉగ్రవాద దాడులు జరుగుతున్నాయని ఐక్యరాజ్యసమితి నివేదిక కూడా రుజువుచేసిందని ఆయన ఆరోపించారు. ఈ ఉగ్రవాద ముప్పు భారతదేశం ప్రోత్సహించినదేనన్నారు. పాకిస్థాన్ వ్యతిరేక ఉగ్రవాదులను అరికట్టేందుకు తనిఖీ చర్యలు తీసుకోవాలని కూడా ఆయన తాలిబన్ ప్రభుత్వాన్ని కోరారు. ఐతే ఈ ఆరోపణలను భారత ప్రభుత్వం ఖండించింది. పాకిస్థాన్ దేశ సార్వభౌమాధికారంతో రాజీపడే ప్రశ్నేలేదని అఫ్గానిస్థాన్‌తో సరిహద్దులను మూసివేశామని, అధ్యక్షుడు అసిఫ్ అలీ జర్దారీ, ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ వెల్లడించినట్లు ఆ దేశ పత్రికలు ప్రకటించాయి. తెహ్రీక్ ఎ తాలిబన్ ఉగ్రవాద సంస్థ నాయకుడు నూర్‌వాలీ మెహ్‌సూద్ స్థావరాన్ని ధ్వంసం చేసేలక్ష్యంతో పాకిస్థాన్ విమానాలు గగనతల ఉల్లంఘనకు పాల్పడిందన్నది పత్రికలు చెబుతున్న కథనం. సరిహద్దుల్లో కవ్వింపు చర్యలను షరీఫ్ ఖండించారనీ, ఫీల్డ్ మార్షల్ అసిఫ్ మునీర్ నాయకత్వంలో పాకిస్థాన్ సైన్యం అఫ్గానిస్థాన్‌కు బలమైన ప్రతిఘటన ఇవ్వడమే కాకుండా ఆ దేశానికి చెందిన అనేక సైనిక పోస్టులను కూడా ధ్వంసం చేసిందని షెహబాజ్ షరీఫ్ చెప్పారని పేర్కొన్నాయి.



# జనరల్
STATE & REGIONAL NEWS



ఆఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఎఐసిసి) అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదివారం న్యూఢిల్లీలో పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

## గురుకుల ఉద్యోగుల సేవల పునరుద్ధరణకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్

**ఉద్యోగుల కష్టాన్ని గుర్తించిన ప్రజా ప్రభుత్వం : మంత్రి అడ్లూరి**

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గురుకుల విద్యాసంస్థల్లో పనిచేస్తున్న 4,092 మంది ఉద్యోగుల సేవల కొనసాగింపునకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల ఎస్‌సి, ఎస్‌టి, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కలకు కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి మాట్లాడుతూ గురుకుల విద్యా వ్యవస్థ పట్ల ప్రభుత్వం చూపిన చిత్తశుద్ధి ప్రశంసనీయమైందన్నారు. ఉద్యోగుల సేవలను గుర్తించి, వారికీ న్యాయం చేయాలనే మానవతా దృక్పథం ఈ ప్రభుత్వానికి ఉందన్నారు. ప్రభుత్వం తాజాగా జారీ చేసిన జి.ఓ. నెం.1533 ప్రకారం, తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్ట్యూషన్స్ సొసైటీ (టిజిఎస్‌డబ్ల్యూఆర్‌ఈఎస్) పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ పద్ధతిలో 2 మంది, అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో 1,545 మంది, పార్ట్‌టైమ్ విధానంలో 2,102 మంది, హానరేరియం పద్ధతిలో 443 మంది, మొత్తం 4,092 మంది ఉద్యోగుల సేవలు మరో ఏడాది పాటు కొనసాగనున్నాయన్నారు. ఈ నిర్ణయం 2025 ఏప్రిల్ 1 నుండి 2026 మార్చి 31 వరకు అమల్లో ఉండనుందని మంత్రి తెలిపారు. గత కొన్నినెలలుగా కంటిన్యూషన్ ఆర్డర్లు లేకపోవడంతో వేతనాల చెల్లింపులో ఆటంకాలు ఏర్పడి, అనేక కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. ఈ పరిస్థితిని గమనించిన ప్రస్తుత ప్రజా ప్రభుత్వం ఉద్యోగుల సేవాభావాన్ని గుర్తించి జి.ఓ. 1533 జారీ చేయడం ద్వారా మానవతా దృక్పథాన్ని ప్రదర్శించిందన్నారు. ఉద్యోగులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తమ సేవలను కొనసాగించాలన్నారు. గురుకుల విద్యాసంస్థల్లో ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది సమాజ అభ్యున్నతికి అంకితభావంతో పనిచేస్తున్నారన్నారు. వారి సేవలు విద్యా వ్యవస్థను ముందుకు తీసుకెళ్లేందుకు భరోసానిస్తాయని మంత్రి అన్నారు. ప్రభుత్వం విద్యా వ్యవస్థ అభివృద్ధి, గురుకుల సంక్షేమాన్ని ప్రధాన లక్ష్యంగా పెట్టుకొని ముందుకు సాగుతోందన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించి, వారి భవిష్యత్తును వెలిగించడమే ప్రజా ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఇది కేవలం పరిపాలనా నిర్ణయం కాదని, ఉద్యోగుల జీవితాల్లో వెలుగు నింపే ప్రజా సంకల్పమని అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా మంత్రి టిజిఎస్‌డబ్ల్యూఆర్‌ఈఎస్ ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం మరింత నిబద్ధతతో పనిచేయాలని సూచించారు.

## కార్మిక శ్రమ దోపిడీకి పాల్పడుతున్న కేంద్రం




**శ్రమదోపిడీకి వ్యతిరేకంగా ఐక్యంగా పోరాడాలి**

**ఎఐటియుసి ఆధ్వర్యంలో ఉద్యమాలు నిర్మించాలి**

**సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి పిలుపు**

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దేశంలోని శ్రామిక వర్గాన్ని విస్మరించి, వారి శ్రమను దోచి బడా కుబేరులకు అప్పగించే విధానాలు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్నదని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి విమర్శించారు. హైదరాబాద్ హిమాయత్ నగర్‌లోని సత్యనారాయణ రెడ్డి భవన్ ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం పల్లా వెంకట్ రెడ్డి సిపిఐ జాతీయ కార్యదర్శిగా ఎంపికైన సందర్భంగా ఎఐటియుసి కార్యవర్గం ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా పల్లా వెంకటరెడ్డి మాట్లాడుతూ కార్మికుల హక్కుల సాధన కోసం ఎన్నో సంవత్సరాలుగా పోరాడుతున్నప్పటికీ అధికారంలో ఉన్న పార్టీలు వారి విన్నపాలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న కొత్త కార్మిక చట్టాలు బడా కుబేరుల ప్రయోజనాలకే అనుకూలంగా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనేక పరిశ్రమలలో కనీస వేతనాలు అమలు కావడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసి, ప్రైవేట్ కంపెనీలకు అప్పగించాలనే కుట్ర సాగుతోందని పల్లా వెంకట్ రెడ్డి విమర్శించారు. 'హైరెండ్ ఫైర్' విధానం ద్వారా కార్మిక హక్కులను హరించే ప్రయత్నం జరుగుతోందని మండిపడ్డారు. దీన్ని అడ్డుకోవాలంటే కార్మిక వర్గం చైతన్యంతో ఐక్యంగా పోరాడాలన్నారు. మతం పేరుతో రాజకీయాలు చేస్తున్న బిజెపి, శ్రమదోపిడికి గురవుతున్న కార్మికులలో ఎక్కువమంది హిందువులేనన్న వాస్తవాన్ని ఎందుకు వెలుగులోకి తీసుకురావడం లేదని పల్లా వెంకట్ రెడ్డి ప్రశ్నించారు. పెట్టుబడిదారులు, అధికార పార్టీ కలిసి పేద కార్మిక వర్గాన్ని మతం పేరుతో మోసగిస్తున్నారని దుయ్యబట్టారు. ఎఐటియుసి ఆధ్వర్యంలో జరగబోయే అన్ని పోరాటాలకు సిపిఐ పూర్తి సంఘీభావం ప్రకటిస్తుందని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు ఎం.డి. యూసుఫ్, ప్రధాన కార్యదర్శి ఎస్. బాల్ రాజ్, ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ, ఉపాధ్యక్షుడు కె.ఏసురత్నం, కార్యదర్శులు బి.వెంకటేశం, ఎస్.విలాస్ సింగ్, నరసింహ రావు, పల్లా దేవేందర్‌రెడ్డి, ఓరుగంటి యాదయ్య, వై. భూమయ్య, మేకల శ్రీనివాస్, ఎం.డి.ఇమాన్ పాల్గొన్నారు.

## నాలుగు రోజులు వర్షాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో పలు జిల్లాల్లో నాలుగు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. దక్షిణ కోస్తాంధ్ర, పరిసర ప్రాంతాల్లో ఉపరితల ఆవర్తనం సగటు సముద్రమట్టానికి 3.1 కిలోమీటర్ల వరకు విస్తరించిందన్నారు. ఆదివారం జయశంకర్, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. సోమవారం పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, నాగర్‌కర్నూల్, వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పారు. మంగళవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, నాగర్ కర్నూల్ వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురుస్తాయన్నారు. బుధవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పారు.

## ఎన్నికల కమిషన్ రద్దుకు పోరాడాలి

**ఆర్థికవేత్త డా.పరకాల ప్రభాకర్**




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కేంద్రప్రభుత్వ చేతిలో కీలుబొమ్మగా మారిన ఎన్నికల కమిషన్ రద్దుకు పోరాడాలని ఆర్థికవేత్త, ప్రఖ్యాత రాజకీయ విశ్లేషకులు డాక్టర్ పరకాల ప్రభాకర్ పిలుపునిచ్చారు. ఓటు చోరీ ఆరోపణలు జరుగుతున్న నేపథ్యంలో ఎంపిలంతా తమ పదవులుకు రాజీనామా చేసి, నిష్పక్షిపాత ఓటరు జాబితాతో కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు కొత్తగా ఎన్నికల్లో నిలబడాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం జాగో నవ తెలంగాణ ఆధ్వర్యంలో జస్టిస్ చంద్రకుమార్ అధ్యక్షతన జరిగిన 'స్వేచ్ఛాయుత ఎన్నికలు – ఎన్నికల కమిషన్ పాత్ర' అనే అంశంపై సదస్సుకు ముఖ్యఅతిథిగా ఆయన విచ్చేసి, మాట్లాడారు. రాజకీయ పార్టీలు ప్రజాస్వామ్యంపై నమ్మకం కల్పించడం లేదని విమర్శించారు. గత ఎన్నికల్లో 5 కోట్ల ఓట్లు అదనంగా పడ్డాయని ఓ సర్వేలో తేలిందన్నారు. 234 స్థానాలు ఎన్‌డిఎకు, 313 స్థానాలు వ్యతిరేక శక్తులకు రావాల్సి ఉండగా, ఓట్ల తారుమారుతో అనుకోని ఫలితాలు వెల్లడయ్యాయన్నారు. మొత్తం మీద 15 రాష్ట్రాల్లో 79స్థానాల్లో అక్రమ ఓటింగ్ జరిగిందని ఆరోపించారు. పక్షపాతి ఓటరు జాబితాలో ఒకే ఇంట్లో 60 ఓట్లు, 103 ఏళ్ల వృద్ధులు, భర్తల పేర్ల స్థానంలో ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా అంటూ నమోదు బహిర్గతం కావడం ఆశ్చర్యానికి గురిచేసిందన్నారు. 2019 ఓట్ల పోలింగ్‌లో అత్యల్ప వ్యత్యాసం ఉన్న ప్రాంతాల్లో బిజెపి ఎన్‌డిఎకు అత్యధిక సీట్లు వచ్చాయన్నారు. నిష్పక్షిపాతంగా ఎన్నికలు జరిగితేనే ప్రజాస్వామ్యం బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ బిజెపి మత విద్వేషాలు రెచ్చగొడుతుందన్నారు. దేశవ్యాప్తంగా 6లక్షల మంది రైతులు ఆత్మహత్య చేసుకొంటే కేంద్రప్రభుత్వానికి స్పందించకపోవడం దారుణమన్నారు. సమావేశంలో సిపిఐ సీనియర్ నేత కందిమల్ల ప్రతాపరెడ్డి, ఆప్ రాష్ట్ర కన్వీనర్ డా.దిడ్డి సుధాకర్, వివిధ సంఘాల నేతలు అఫ్జల్ అజీజ్, ప్రొఫెసర్ వెంకటదాసు, ఏలేశ్వరం తదితరులు పాల్గొన్నారు.

## పెరిగిన ఇళ్ల రిజిస్ట్రేషన్లు

**మంత్రి శ్రీధర్‌బాబు**

**ప్రజాపక్షం/హైదరాబాద్:** గత నెల సెప్టెంబర్‌లో తెలంగాణ రాష్ట్రంలో ఇళ్ల రిజిస్ట్రేషన్‌లో 35 శాతం పెరుగుదల ఉందని ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్(నారెడ్కో) తెలంగాణ శాఖ ఆధ్వర్యంలో హైటెక్స్‌లో నిర్వహిస్తున్న '15వ నారెడ్కో తెలంగాణ ప్రాపర్టీ షో'లో ఆయన ఆదివారం పాల్గొని మాట్లాడుతూ.. '2024–25లో రియల్ ఎస్టేట్, వృత్తిపరమైన సేవల రంగం 15.4 శాతం వృద్ధి రేటును నమోదు చేసింది. 11.97 శాతం వృద్ధి రేటుతో నిర్మాణ రంగం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు రూ.80వేల కోట్లకు పైగా సమకూర్చింది. స్టేట్ సర్వీసెస్ జీఎస్ డీపీలో ఈ రెండు రంగాల వాటానే 24.9 శాతంగా ఉంది' అని శ్రీధర్ బాబు పేర్కొన్నారు. 'హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ – మల్కాజ్‌గిరి జిల్లాల పరిధిలో 2024 సెప్టెంబర్‌లో రూ.2820 కోట్ల విలువైన 4903 ఇళ్ల రిజిస్ట్రేషన్ జరిగింది. ఈ ఏడాది సెప్టెంబర్‌లో రూ.4804 కోట్ల విలువైన 6612 ఇళ్ల రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయి. ఇది 35 శాతం అధికం. విలువలో వార్షిక వృద్ధి 70 శాతంగా నమోదయ్యింది. ఇవి కేవలం గణాంకాలు కాదు... రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ కుదేలయ్యిందంటూ మాపై దుష్ప్రచారం చేస్తున్న వారికి ధీటైన సమాధానాలు' అని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. 'ఈ సెప్టెంబర్‌లో రూ.కోటిపైన విలువైన ఆస్తుల రిజిస్ట్రేషన్లలో 151 శాతం పెరుగుదల ఉంది. మొత్తం విక్రయాల్లో విలువ పరంగా వీటి వాటానే 53 శాతం' అని చెప్పారు. 'భారత్‌లో వ్యవసాయం తర్వాత ఎక్కువ మంది రియల్ ఎస్టేట్ రంగంలోనే ఉపాధి పొందుతున్నారు. అయితే... అభివృద్ధి చెందిన దేశాల జీడీపీలో స్థిరాస్తి రంగ వాటా సగటున 10 శాతం 15 శాతం కాగా... చైనాలో అత్యధికంగా 23 శాతం నుంచి 25 శాతం వరకుంది. మన దేశంలో ఇది 6 శాతం నుంచి 8 శాతమే. ఇది మరింత పెరగాల్సిన అవసరముంది' అని అభిప్రాయపడ్డారు. 'ఎలివేటెడ్ కారిడార్లు, మెట్రో ఫేజ్ – 2, భారత్ ఫ్యూచర్ సిటీ, మూసీ సుందరీకరణ, రీజినల్ రింగ్ రోడ్డు తదితర ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులతో తెలంగాణ రూపురేఖలు మారిపోనున్నాయి. డిసెంబర్ నాటికి 'ఫ్యూచర్ సిటీ'లో జోనలైజేషన్ ప్రక్రియను పట్టలెక్కించాలనే పట్టుదలతో ఉన్నాం. అక్కడే 200 ఎకరాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయనున్న ఏఐ సిటీకి రెండు, మూడు నెలల్లోనే భూమి పూజ చేయబోతున్నాం' అని వివరించారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తున్న రియల్ ఎస్టేట్ రంగానికి ప్రభుత్వం తరఫున అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నారెడ్కో తెలంగాణ ప్రతినిధులు విజయసాయి మేక, కాళీప్రసాద్ దామెర, డా.లయన్ కిరణ్, కె.శ్రీధర్ రెడ్డి, ఆర్.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.




## క్వారీ దక్కితే కోట్లే



**కాసులు కురిపిస్తున్న ఇసుక దందాల గుప్పెట్లో అధికారులు**

**వ్యాపారులంతా బడాబాబులే**

**పేరుకే గిరిజన సొసైటీలు**

**దళారులదే రాజ్యం**

**ప్రజాపక్షం/ఖమ్మం :** ఇసుక వ్యాపారం ఇప్పుడు కోట్లను తెచ్చిపెడుతుంది. ఒకప్పుడు ఇసుక గురించి పట్టించుకున్న వారు లేరు. రెండు దశాబ్దాలుగా రాష్ట్రంలోనే అతి పెద్ద వ్యాపారంగా ఇసుక మారిపోయింది. గోదావరి పరివాహక ప్రాంతంతో పాటు అనేక నదులు, ఏరుల వద్ద ఇసుక లభ్యతను బట్టి క్వారీలను ఏర్పాటు చేశారు. ఏజెన్సీలోనైతే ఇసుక క్వారీలను గిరిజన సొసైటీలకు అప్పగించారు. మైదాన ప్రాంతంలో దండుకున్న వాడికి దండుకున్నంతా ఈ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతుండడంతో రాజకీయ నాయకులు మొదలు హైదరాబాద్‌తో పాటు ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చి ఇసుక వ్యాపారంపై కన్నేశారు. తెలంగాణ రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ రాష్ట్రంలోని వివిధ నదుల్లో ఇసుక లభ్యతను గుర్తించి అక్కడ ఇసుక తరలింపుకు అనుమతినిస్తుంది. ఎన్ని క్యూబిక్ మీటర్ల ఇసుక లభ్యత ఉంది. ఒక్కో క్యూబిక్ మీటర్ ఖరీదు ఎంత అనే విషయాన్ని కూడా ఖనిజాభివృద్ధి సంస్థ నిర్ణయిస్తుంది. ఇసుక అవసరమైనటువంటి వారు ఖనిజాభివృద్ధి సంస్థ నుంచి ఆన్‌లైన్ ద్వారా తమకు కావాల్సిన ఇసుకకు సంబంధించి నగదు చెల్లించి రశీదు పొందవచ్చు. ఏ క్వారీ నుంచి ఇసుక కోరుకుంటున్నారో ఆ క్వారీ ద్వారా ఇసుక తరలించుకోవచ్చు. ఇక్కడే ఒక పెద్ద అక్రమం చోటు చేసుకుంటుంది. ట్రాక్టర్‌కు ఇన్ని క్యూబిక్ మీటర్లు, లారీ స్థాయిని బట్టి ఎన్ని క్యూబిక్ మీటర్లు తరలించవచ్చో అంతకు అనుమతి ఇవ్వాల్సి ఉంది. కానీ అనుమతి తీసుకున్న దాని కంటే ఎక్కువ ఇసుకను తరలించుకుపోతున్నారు. ఈ విషయంలో ప్రభుత్వానికి భారీ నష్టం వస్తుండగా క్వారీ నిర్వాహకులకు మాత్రం భారీ లాభాలను తెచ్చిపెడుతుంది. ఖనిజాభివృద్ధి సంస్థ అధికారులు ఈ భారీ అక్రమం గురించి తెలిసినా ఆవైపు కన్నెత్తి చూడడం లేదు. కొన్ని చోట్ల నకిలీ డిడిలతో ఇసుకను తరలించుకుపోతున్నారన్న ఆరోపణలు వినవస్తున్నాయి. అధికార యంత్రాంగానికి యధాశక్తి ముట్టజెప్పుతుండడంతో యధాశక్తి సహకరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**పేరుకే గిరిజన సొసైటీలు :**

ఏజెన్సీ ప్రాంతంలో ఇసుక రీచ్‌లను గిరిజన సొసైటీలకు అప్పగిస్తున్నారు. కానీ ఇది కేవలం పేపర్ మీద జరిగే చర్య మాత్రమే. వ్యాపారం చేసేదంతా గిరిజనేతరులు, గిరిజనులలో కోట్లకు పడగలెత్తిన వారే. గడిచిన ఐదారేండ్లలో ఇసుక రీచ్‌ల ద్వారా కోట్లకు పడగలెత్తారంటే ఇసుక వ్యాపారం ఏ స్థాయిలో లాభాలు కురిపిస్తుందో అవగతమవుతుంది. కొంతమంది ఏజెన్సీ చట్టాలకు తూట్లు పొడుస్తుంటే మరికొంతమంది ఏజెన్సీ చట్టాల మాటున దోచుకుంటున్నారు. గిరిజన సొసైటీలకు, గిరిజన ప్రజలకు ఒరిగింది ఏమి లేదు.

**రాజకీయ నాయకుల కన్ను :**

ఇప్పుడు ఇసుక వ్యాపారంపై రాజకీయ నాయకులు, బడా వ్యాపారుల కన్నుపడింది. ప్రత్యక్షంగానో, పరోక్షంగానో రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు ఉంటున్నారు. వారి అనుచరులకు ఇసుక క్వారీలను అప్పగించడమో లేదా క్వారీలపై తమ అనుచరుల పెత్తనానికో పట్టుబడుతున్నారు. ఇది రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద చర్చనీయాంశంగా మారింది. రాజకీయ నాయకుల ప్రోద్బలంతోనే ఇసుక క్వారీలలో అక్రమాలు జరుగుతున్నాయని తద్వారా ప్రభుత్వ ఆదాయానికి తూట్లు పడుతున్నాయన్న ఆరోపణలు వినవస్తున్నాయి. రక్తం మరిగిన పులిలా కొందరు ఇసుక లాభాలకు అలవాటు పడి దందాలు చేయడం, బెదిరింపులకు పాల్పడడటం అవసరమైతే ఏ స్థాయికి వెళ్లేందుకైనా వెనుకాడడం లేదన్న ప్రచారం జరుగుతుంది. ప్రభుత్వమే ఇసుక వ్యాపారాన్ని నిర్వహిస్తున్నా అక్రమార్కులకు కోట్ల రూపాయలు పోగుపడుతున్నాయంటే పరిస్థితి ఏవిధంగా ఉందో ఆలోచించుకోవచ్చు. అటు గిరిజన ప్రాంతాల్లో గిరిజనుల సొసైటీలకు దక్కుతున్నది ఏమి లేదు. ఇక్కడ, అక్కడ ఎక్కడైనా అంతా దళారులదే. రాష్ట్ర ప్రభుత్వం ఇసుక అక్రమ వ్యాపారులపైన దృష్టి సారించాల్సి ఉంది. మొత్తం ఇసుక వ్యాపారానికి సంబంధించి ప్రత్యామ్నాయ పద్ధతిని ఆలోచించకపోతే భవిష్యత్తులో మరిన్ని ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉంది.

## రిమాండ్ ఖైదీ మృతి.. బంధువుల ఆందోళన



**ప్రజాపక్షం/జనగామ :** జనగామ జిల్లా కేంద్రంలోని జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న మల్లేష్ అనే వ్యక్తి మృతి చెందడంతో బంధువులు డిసిపి, కోర్టు ముందు ఆందోళనకు దిగారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పూర్తి వివరాలు పరిశీలిస్తే జనగామ జిల్లా దేవరుప్పుల మండలంలోని సింగరాజుపల్లి గ్రామానికి చెందిన మల్లేష్ అనే వ్యక్తి జనగామ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. కాగా ఈ నెల 8న బ్లీచింగ్ పౌడర్ సేవించి ఆత్మహత్యాయత్నించగా వరంగల్‌లోని ఎంజిఎంకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. బ్లీచింగ్ పౌడర్ సేవించి ఆత్మహత్యాయత్నానికి పలు కారణాలు ఉన్నట్లు బంధువులు ఆరోపించారు. సబ్ జైల్‌లో ఇద్దరి మధ్య ఘర్షణ జరిగిన నేపథ్యంలో మల్లేష్ బ్లీచింగ్ పౌడర్ సేవించినట్లు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో సరియైన వైద్యం అందించకపోవడం, ఖైదీల గొడవ విషయంలో జాగ్రత్తలు తీసుకోకపోవడం వలనే ఇది జరిగిందని ఆరోపించారు. అయితే ఈ విషయంలో డిసిపికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని కుటుంబీకులు ఆరోపించారు. ముందుగా డిసిపి కార్యాలయం ముందు ఆందోళన చేసి అనంతరం సబ్ జైల్ ముందు ఆందోళన చేశారు. విచారణ జరిపిస్తామని పోలీసులు హామీ ఇవ్వడంతో విరమించారు. కాగా ఈ సంఘటన గుట్టు చప్పుడు కాకుండా ముగుస్తుందని జైల్ అధికారులు ఆలోచించగా కుటుంబీకులు బయటకు వచ్చి ఆందోళన చేయడంతో జైల్ అధికారులు నిర్లక్ష్యం వలనే మల్లేష్ చనిపోయినట్లుగా తెలుస్తుంది. జైలులో భద్రంగా ఉంచాల్సిన బ్లీచింగ్ పౌడర్‌ను ఎందుకు బయట పెట్టారన్నది తెలియాల్సి ఉంది.

## మద్యం షాపులకు 5,663 దరఖాస్తులు

**మిగిలింది వారం రోజులే..**



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణలో కొత్త మద్యం దుకాణ కోసం 5663 దరఖాస్తులు వచ్చాయని ఎక్సైజ్ కమిషనర్ హరికిరణ్ వెల్లడించారు. ఇంకా వారం రోజులు గడువు ఉందని చివరి రోజుల్లో భారీగా దరఖాస్తులు వస్తాయని అంచనా వేస్తున్నామని ఆయన తెలిపారు. తెలంగాణలోని 2620 మద్యం షాపులకు దరఖాస్తుల జోష్ కొనసాగుతుందన్నారు. శనివారం నాటికి తెలంగాణలో 5663 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఈనెల 18తో దరఖాస్తుల స్వీకరణ అంకం పూర్తి కానుంది. చివరి మూడు రోజుల్లో భారీగా దరఖాస్తులు వచ్చే అంచనాలు ఉన్నాయని తెలిపారు. మద్యం షాపులకు రెండేళ్లకోసారి దరఖాస్తుల ఆహ్వానం ఎక్సైజ్ శాఖ ఆహ్వానిస్తుందని తెలిపారు. గత రెండేళ్ల క్రితం కూడా చివరి రెండు రోజుల్లో 45 వేల నుంచి 50వేల దరఖాస్తులు వచ్చాయని గుర్తు చేశారు. ఇప్పుడు కూడా చివరి మూడు రోజుల్లో దరఖాస్తులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉంటాయని ఎక్సైజ్ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నెల 13నుంచి 18 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఈ వారం రోజుల్లో 13న సోమవారం సప్తమి మంచి రోజు, 15 న నవమి 16న దశమి 17న ఏకాదశి 18న ద్వాదశి ఈ ఐదు రోజుల్లో భారీగా దరఖాస్తులు వచ్చే అవకాశం ఉంది. 14వ తేదీ అష్టమి కావడంతో కొంత దరఖాస్తులు తగ్గే అవకాశాలు ఉంటాయని ఎక్సైజ్ అధికారులు అంచనాలు వేస్తున్నారు.

చివరి రోజుల్లో భారీగా దరఖాస్తులు వచ్చే అంచనాలు ఉండడంతో ఎక్సైజ్ డివిజన్ల వారిగా, రంగారెడ్డి, హైదరాబాద్ డివిజన్లలోను, ఉమ్మడి జిల్లాల వారీగా అదనపు కౌంటర్లు ఏర్పాటుతో పాటు దరఖాస్తుదారులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఎక్సైజ్ కమిషనర్ సి. హరికిరణ్ ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేపడుతున్నారు. గత రెండేళ్ల క్రితం మద్యం షాపులకు 1.32 లక్షల దరఖాస్తులు వచ్చాయి.

ఈసారి దరఖాస్తులు గతంలో కంటే మరింతగా పెరిగే అవకాశాలు ఉన్నాయని ఎక్సైజ్ శాఖ అంచనాలు వేస్తున్నారు.

గతంలో లాగా ఈసారి కూడా ఏపీ, కర్ణాటక, మహారాష్ట్ర ఇతర రాష్ట్రాల నుంచి దరఖాస్తులు వేయడానికి మద్యం వ్యాపారులు ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తుంది.

ఇప్పటికే పలు రాష్ట్రాల నుంచి దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ శాఖ అధికారులు గుర్తించారు.

మరోపక్క మద్యం షాపులకు కేటాయించిన రిజర్వేషన్లు గౌడ్, ఎస్సీ, ఎస్టీ మద్యం షాపులకు కూడా దరఖాస్తులు పోటాపోటీగా పడుతున్నాయి.

గౌడ షాపులకు 671 దరఖాస్తులు, ఎస్సి రిజర్వేషన్లు 202, ఎస్టి రిజర్వేషన్లు 84, జనరల్‌లో 4686 దరఖాస్తులు వచ్చాయి.

ఇదే రీతిలో ఉమ్మడి జిల్లాలోని అదిలాబాద్‌లో 142, హైదరాబాదులో 746, కరీంనగర్లో 392, ఖమ్మంలో 260, మహబూబ్ నగర్ లో 278, నల్లగొండలో 568, మెదక్‌లో 411, నిజామాబాదులో 255, రంగారెడ్డిలో 2353, వరంగల్లో 258 దరఖాస్తులు వచ్చాయి.

## ఆలిండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేద ఏర్పాటుకు కేంద్రం సానుకూలం

**దామోదర రాజనర్సింహకు రాసిన లేఖను విడుదల చేసిన కేంద్ర మంత్రి**

**ప్రజాపక్షం/కరీంనగర్ :** ఆయుర్వేదం ఏర్పాటులో కేంద్రం వెనుకంజ వేస్తోందని, దక్షిణాది రాష్ట్రాలను నిర్లక్ష్యం చేస్తోందంటూ మీడియా వస్తున్న కథనాలను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఖండించారు. ఇందులో ఏ మాత్రం వాస్తవం లేదని స్పష్టం చేశారు. కొంతమంది ఉద్దేశ్యపూర్వకంగా ఇలాంటి సమాచారం లీకులిస్తూ కేంద్రంపై బురద చల్లేందుకు యత్నిస్తున్నారని పేర్కొన్నారు. ప్రధాని మోదీ ఆద్వర్యంలోని కేంద్ర ప్రభుత్వానికి అన్ని రాష్ట్రాలూ, ప్రాంతాలు సమానమేనని స్పష్టం చేశారు. ఎయిమ్స్ తరహాలో తెలంగాణలోనూ ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేదను స్థాపించాలని కోరుతూ ఇప్పటికే తాను కేంద్రానికి లేఖ రాసినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం సైతం సానుకూలంగా ఉందని, త్వరలోనే మంజూరయ్యే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ మేరకు కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆదివారం మీడియాకు ఒక ప్రకటనను విడుదల చేశారు. రాష్ట్ర వైద్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు సైతం సమాచారమిచ్చినట్లు పేర్కొన్నారు. ఆయుర్వేద ఇన్సిట్యూట్ ఏర్పాటుకు సంబంధించి కేంద్ర ఆయుష్ మంత్రి ప్రతాప్ రాజ్ జాదవ్‌కు రాసిన లేఖను ఈ సంధర్భంగా మీడియాకు విడుదల చేశారు. అదే విధంగా కరీంనగర్‌లో అత్యాధునిక ఇంటిగ్రేటెడ్ ఆయుష్ ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని కోరుతూ దామోదర రాజనర్సింహకు తాను 4 నెలల క్రితమే లేఖ రాశానని, కానీ ఇప్పటి వరకు దీనిపై నిర్ణయం తీసుకోకపోవడం బాధాకరమని తెలిపారు. ఇప్పటికీ రాష్ట్ర మంత్రి పేషీలోనే పెండింగ్‌లో ఉందని పేర్కొన్నారు. తెలంగాణలో సాంప్రదాయ ఆయుష్ వైద్యసేవలు, విద్యా అవకాశాలను పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రాష్ట్రాభివృద్ధి కోసం కేంద్రం అన్ని విధాలా సహకరిస్తోందని, ఈ తరుణంలో తప్పుడు సమచారాన్ని వ్యాప్తి చేస్తూ గందరగోళం సృష్టించవద్దని కోరారు.

## ఆర్థిక సహాయం అందజేత



**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** మండల కేంద్రంలో గత వారం రోజుల క్రితం అనారోగ్యంతో బాధపడుతూ ఏనుగు భరతమ్మ మృతి చెందారు. సామాజిక సేవలో ముందుండే కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు వల్ల మల్ల కృష్ణారెడ్డి భరతమ్మ కుటుంబానికి రూ.10,000 ఆర్థిక సహాయం చేశారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ సమాజంలో అట్టడుగు వర్గాల అభ్యున్నతికి తోడ్పడడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ఆర్థిక సహాయం కుటుంబానికి తాత్కాలిక ఊరటనిస్తుందని, భవిష్యత్తులో మరింతగా సహకరించేదుకు తాను సిద్ధంగా ఉన్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మాజీ ఎంపిటీసీ రాస మల్ల యాదయ్య, చిలువేరు నరసింహ, బైకని నరేందర్, మినుగు గోపాల్, చింతల లింగస్వామి, ఏనుగు మోహన్, లాలు, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరం



**ప్రజాపక్షం/అర్వపల్లి :** హెల్పింగ్ హాస్పటల్ సూర్యాపేట వారి 4వ వార్షికోత్సవ సందర్భంగా ఉచిత ఆరోగ్య సేవలు ఆదివారం జాజిరెడ్డిగూడెం గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా హాస్పటల్ యజమాన్యం మత కాల వలపతిరావు మాట్లాడుతూ హాస్పటల్‌లో అనేక క్లిష్టమైన శస్త్రచికిత్సలు నిర్వహించి విజయవంతం చేయడం జరిగిందన్నారు. పేద ప్రజలకు 24 గంటలు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు వివరించారు. దీర్ఘకాలిక వ్యాధులతోపాటు వెన్నుపూసనొప్పి, నరముల బలహీనత, కిడ్నికి సంబంధించిన వ్యాధులు, షుగర్, బిపి, ఈసిజి టెస్టులతో పాటు బాడీ పెయిన్స్‌కి సంబంధించిన డాక్టర్లు అందుబాటులో ఉన్నారని తెలిపారు. రాజీవ్ ఆరోగ్యశ్రీతోపాటు అన్ని రకముల ఇన్సూరెన్స్ సౌకర్యం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పోతిబోయిన కిరణ్, వల్లాల రమేష్, గట్టిగొర్ల లింగముల్లు, బట్టమేకల లింగస్వామి పాల్గొన్నారు.




## తహసీల్దార్ కార్యాలయం ప్రహరీ గోడ నిర్మాణం పూర్తి

ప్రజాపక్షం ఎఫెక్ట్

**ప్రజాపక్షం/వేములపల్లి:** మండల తహశీల్దార్ కార్యాలయానికి ప్రహరీ గోడ నిర్మాణం పూర్తయింది జూలై నెలలో 14 ఏళ్లు గడిచిన ప్రహరీ గోడ నోచుకోని తహశీల్దార్ కార్యాలయం, అనే శీర్షికతో వచ్చిన వార్తకు స్పందించిన ప్రభుత్వ అధికారులు తహశీల్దార్ కార్యాలయానికి ప్రహరీ గోడ నిర్మాణం పూర్తి చేశారు. దాంతో కార్యాలయానికి అందమైన రూపురేఖలను తీర్చిదిద్దారు ప్రభుత్వ కార్యాలయం అంటే ఇలా ఉండాలి అనే విధంగా అధికారులు స్పందనను చూసి పలువురు అభినందిస్తున్నారు.ప్రభుత్వ కార్యాలయం అంటే ప్రజలందరికీ కోరికలు తీర్చే దేవాలయం అని అక్కడికి కార్యాలయానికి వెళ్ళిన వెంటనే తమ సమస్యలు పూర్తయితాయని ప్రశాంత వాతావరణం ఉంటే బాగుండు అని ఆశించిన వారి కోరిక ఇప్పటికి నెరవేరింది ఏదేమైనా తహసిల్దార్ కార్యాలయం అందంగా దర్శనమిస్తుంది.

## యథావిధిగా ప్రజావాణి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ఎంపిటిసి, జెడ్పిటిసి, గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంగా అమలులోకి వచ్చిన ఎన్నికల ప్రవర్తనా నియమావళిని రాష్ట్ర హై కోర్ట్ ఆదేశాల మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం నిలిపివేసినందున ఈనెల 13 (సోమవారం) ప్రజావాణి కార్యక్రమాన్ని యథావిధిగా నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు.అందువల్ల సమస్యల పరిష్కారం నిమిత్తం ప్రజావాణిలో దరఖాస్తులు సమర్పించదల్చుకున్న వారు సోమవారం వారి దరఖాస్తులను నల్లగొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఉదయం 10.30 గంటలనుండి మధ్యాహ్నం 2 గంటల వరకు సమర్పించవచ్చని ఆమె స్పష్టం చేశారు.జిల్లా ప్రజలు ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

## డిసిసి పదవి 'గుమ్మల'కే ఇవ్వాలి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** డిసిసి అధ్యక్ష పీఠాన్ని గుమ్ముల మోహన్ రెడ్డికే ఇవ్వాలని పార్టీ శ్రేణులు ముకుమ్మడిగా ఏఐసీసీ మాజీ జనరల్ సెక్రటరీ బిశ్వరంజన్ మహంతికి వినతి పత్రాలు అందజేశారు. ఆదివారం బ్లాక్ కాంగ్రెస్, పట్టణ కాంగ్రెస్ నాయకులతో హ్మాణ్యం ఇంద్రకరణ్ రెడ్డిలు ముఖాముఖి అభిప్రాయ సేకరణతో పాటు వ్యక్తిగతంగా అభిప్రాయం తీసుకున్నారు.అభిప్రాయ సేకరణకు వచ్చిన నాయకులు మొదటి పేరుతో పాటు మరికొంతమంది పేర్లు చెప్పాలని సూచించగా పార్టీ శ్రేణులు మరో పేరు చెప్పడానికి ఇష్టపడలేదు.గుమ్ముల మోహన్ రెడ్డితో పాటు సెకండ్ ఆప్షన్, థర్డ్ ఆప్షన్ గా పేర్లు చెప్పాలని అబ్జర్వర్లు సూచించినప్పటికీ ప్రతి ఒక్కరూ మరో ఆప్షన్ లేదని గుమ్ముల మోహన్ రెడ్డికే ఇవ్వాలని కోరారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నా లేకున్నా పార్టీ విధేయుడుగా, కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటున్నాడని పార్టీ శ్రేణులు తెలిపారు.అనంతరం మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో మాజీ కౌన్సిలర్లంతా డిసిసి పదవి గుమ్ములకే ఇవ్వాలని అబ్జర్వర్లకు వినతి పత్రాలు అందజేశారు. ఈ అభిప్రాయ సేకరణ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి వంగూరి లక్ష్మయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, ఆర్టిఏ డైరెక్టర్ కుసుకుంట్ల రాజిరెడ్డి, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు దుబ్బ రూప, మాజీ కౌన్సిలర్లు ఖయ్యూం బేగ్,ఇబ్రహీం పాల్గొన్నారు.

## రెండు రాష్ట్రాల మధ్య వివాదానికి కేంద్రం కుట్ర

### బనకచర్లకు సహకరించాలని కేంద్రం లేఖ పట్ల ఖండన

### సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** రెండు రాష్ట్రాల మధ్య వివాదాన్ని సృష్టించి రాజకీయంగా మోడి ప్రభుత్వం లబ్ధి పొందాలని చూస్తుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ ఆరోపించారు. ఆదివారం పట్టణంలోని బృందావన్‌గార్డెన్‌లో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్ సతీమణి సుమిత్రా భాయ్ సంతాప సభలో ఆయన పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండి.అబ్బాస్, సీనియర్ నాయకులు డీజే నర్సింగరావుతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడుతూ బనకచర్ల విషయంలో ఏపీ ప్రభుత్వానికి సహకరించాలని తెలంగాణ ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వం లేఖ రాయడం పట్ల తీవ్రంగా ఖండించారు. ఆల్మట్టి డ్యామ్ ఎత్తు పెంచి బనకచర్ల నిర్మించడం వల్ల తెలంగాణాకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. 42శాతం బీసీ రిజర్వేషన్ అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం ఆర్డినెన్స్, బిల్లు, జీవో రద్దుకు ప్రయత్నించిందని అన్నారు. బీసీ బిల్లుకు అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని, దీని కోసం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. హన్మకొండలో నకిలి రైతులు భూమి లేకుండా ధాన్యం అమ్మకపోయిన ప్రభుత్వ సొమ్ము రూ.1.869కోట్లు కాజేశారని, ఈ ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, డబ్బికార్ మల్లేష్, కందాల ప్రమీల, సయ్యద్‌హాసం, వీరేపల్లి వెంకటేశ్వర్లు, మల్లు గౌతంరెడ్డి, బావండ్ల పాండు, రవినాయక్, వినోద్‌నాయక్, శశిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# అమరవీరుల కుటుంబాలను ఆదుకుంటాం

### రజాకార్ల చేతిలో అమరులైన కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేసిన వి. హనుమంతరావు



**ప్రజాపక్షం/నల్లగొండ(శాలిగౌరారం) :** 1948 సంవత్సరంలో రజాకార్ల కాల్పుల్లో అసువులు బాసిన పదిమంది అమరవీరుల కుటుంబాలను అన్ని విధాల ఆదుకుంటామని ఉమ్మడి రాష్ట్ర పిసిసి మాజీ అధ్యక్షులు,మాజీ రాజ్యసభ సభ్యులు వి హనుమంతరావు అన్నారు.1948 సంవత్సరంలో జిల్లా శాలిగౌరారం మండలం వల్లాల గ్రామంలో జాతీయ జెండాను ఎగరవేశారనే నెపంతో పదిమంది విద్యార్థులను రజాకార్లు కాల్చి చంపారు. వల్లాల అమరవీరుల చరిత్రను తెలుసుకున్న హనుమంతరావు ఆయన సొంత ఖర్చులతో అమరవీరుల స్మారకార్థం స్థూపాన్ని నిర్మించి గత నెలలో స్తూప ఆవిష్కరణ సభ నిర్వహించిన విషయం విధితమే. ఆ సభ సందర్భంగా మాజీ మంత్రి కాంగ్రెస్ సీనియర్ జానారెడ్డి ఇచ్చిన మాట ప్రకారం పదిమంది అమరవీరుల కుటుంబాలకు తల 50 వేల రూపాయల చొప్పున పంపించిన 5 లక్షల రూపాయలను ఆదివారం గ్రామంలో అమరవీరుల కుటుంబాలకు అందించారు.ఈ సందర్భంగా హనుమంతరావు మాట్లాడుతూ భవిష్యత్తులో అమరవీరుల కుటుంబాలకు అన్ని అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మందుల సామేల్ మాట్లాడుతూ వల్లాల అమరవీరుల గుర్తుకు చిహ్నంగా అత్యున్నతమైన సదుపాయాలతో గవర్నమెంట్ పాఠశాలను మంజూరు చేయించేలా కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు ఎమ్మెల్సీ శంకర్ నాయక్,ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్,మాజీ శాసనసభ్యులు గోనె ప్రకాశరావు,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కందాల సమరం రెడ్డి,వల్లాల మాజీ సర్పంచులు ఎస్‌కె ఇంతియాజ్,భూపతి వెంకన్న,దండ అశోక్, నరిగే నర్సింహా,మాధగోని రామలింగయ్య,నోముల జనార్ధన్, వేముల గోపీనాథ్,బోడ అరుణ్ కుమార్,గుండ్ల పల్లి సైదులు, నోముల రవి,గుండ్లపల్లి శంకర్,గుండ్ల పల్లి నాగరాజు,కుర్ర లింగయ్య పాల్గొన్నారు.

# సిజెఐపై దాడి హేయమైన చర్య : గన్నా




**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) బిఆర్ గవాయ్ పైన ఓ మతోన్మాద న్యాయవాది బూటు విసిరే ప్రయత్నం చేయడం హేయమైన చర్య అని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ధర్మబిక్షం భవన్‌లో ముఖ్య నాయకుల సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ సనాతన ధర్మం పేరిట ప్రధాన న్యాయమూర్తిపై బూటు విసిరివేసే ప్రయత్నం న్యాయవ్యవస్థ తమకు తాను అనుకూలంగా వ్యవహరించాలని బెదిరింపు ధోరణి అరాచకత్వానికి నిదర్శమన్నారు. ఇది కేవలం న్యాయవాది చేసిన దాడిగానే చూడవద్దని గత కొన్నేండ్లుగా దేశంలో మతం, మితవాదం శక్తుల ఆదిపత్య వైఖరి చివరకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పై దాడికి దారి తీయడం ప్రజాస్వామ్య విలువను పతనానికి పరాకార్ష్ఠమన్నారు. రాజ్యాంగాన్ని నిలబెట్టడానికి సామాజిక అడ్డంకులను బద్దలు కొట్టిన వ్యక్తిని బెదిరించటానికి, అవమానించటానికి జరిగిన ప్రయత్నమే ఈ దాడియత్నం సంఘటన ప్రతిబింబిస్తుందన్నారు. గత శతాబ్ధంలో దేశంలో మతోన్మాదం, మతతత్వం మన సమాజాన్ని ఎలా ముంచేత్తేస్తున్న అనేది ఇలాంటి బుద్ధిహీనమైన చర్య చూపిస్తుందని గన్న చంద్రశేఖర్ వెల్లడించారు. భారత కమ్యూనిస్టు పార్టీ తరపున మేము ఈ చర్యను తీవ్రంగా ఖండిస్తున్నామని మన న్యాయ వ్యవస్థకు సురక్షితం భద్రత ప్రధానమైనది అన్నారు. కుల మతోన్మాదానికి వ్యతిరేకంగా లౌకిక శక్తులన్నీ సామాజిక న్యాయం కోరే దోపిడి వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాట శక్తులన్నీ ఐక్యంగా నిలబడి పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవా డ వెంకటేశ్వర్లు, జిల్లా కార్యవర్గ సభ్యులు మండ వ వెంకటేశ్వర్లు, బూర వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# అంతరాలు లేని విద్య అందించాలి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** సమాజంలో సమూల మార్పు వచ్చేదాకా విద్యారంగంలో అసమానతలు,అంతరాలు లేని విద్యా సమాజాన్ని నిర్మించుకోవాలని టిపిఎస్‌వి రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ శాసనమండలి సభ్యులు అలుగుబెల్లి నర్సిరెడ్డి పిలుపునిచ్చారు.ఆదివారం పట్టణంలోని యుటిఎఫ్ భవనంలో తెలంగాణ పౌర స్పందన వేదిక రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో విద్యలో అంతరాలు తొలగిపోయేదేట్లా అనే అంశంపై జిల్లా అధ్యక్షులు పాల్వాయి అంజిరెడ్డి అధ్యక్షతన కవి సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ పాల్గొని మాట్లాడుతూ సమాజంలో అసమానతలు లేని విద్యను అందించేందుకు కవులు, రచయితలు తమ రచనల ద్వారా సమాజాన్ని చైతన్యం చేయాలని పిలుపునిచ్చారు. వివిధ సాహిత్య ప్రక్రియల్లో రచనలు చేసి ప్రజలను ఆలోచింపజేయాలనే ఉద్దేశంతో ఈ కవి సమ్మేళనం నిర్వహిస్తున్నామని తెలిపారు. కవులు సమాజ నిర్దేశకులని వారి ద్వారానే సమాజంలో మార్పు సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు. ఆరు దశాబ్దాల క్రితం కొఠారి కమిషన్ చెప్పిన కామన్ స్కూల్ విధానాన్ని ప్రవేశపెడితేనే విద్యారంగంలోని అసమానతలు రూపుమాపబడతాయని అన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాధే శ్యామ్ మాట్లాడుతూ సమాజంలో అనేక అంతరాలు ఉన్నప్పటికీ,విద్యారంగంలో ఈ అసమానతలు ఉండటం వల్ల విలువలు పతనమ వుతున్నాయని వాటిని కాపాడుకుంటూనే సమాన విద్య కోసం కవులు,రచయితలు తమ రచనలతో సామాజిక చైతన్యం తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కవులు డాక్టర్ సాగర్ల సత్తయ్య , మాజీ రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చొల్లేటి ప్రభాకర్, బైరెడ్డి కృష్ణారెడ్డి,డాక్టర్ పగడాల నాగేందర్,మునాసు వెంకట్,పెరుమాళ్ళ ఆనంద్,భూతం ముత్యాలు, శ్యాంసుందర్,పగిడిపాటి నరసింహ,లింగమూర్తి, భీష్మా చారి, బండారు శంకర్ తదితరులు పాల్గొన్నారు.




## ఆలేరులో పడకేసిన పారిశుద్ధ్యం

### పారిశుద్ధ్య పనులు చేయించడంలో మున్సిపల్ అధికారులు విఫలం

### సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెక్క వెంకటేష్

**ప్రజాపక్షం/ఆలేరు :** ఆలేరు పట్టణంలో పారిశుద్ధ్య పనులు చేయించడంలో మున్సిపల్ అధికారులు పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. దీనివల్ల ప్రజలు విష జ్వరాలతో విలవిల లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మురికి కాలువల నుండి వేదజల్లే దుర్గంతో ప్రజలు అవస్థలకు గురవుతున్నారని అన్నారు. అలాగే పట్టణంలో వెంటనే శానిటేషన్ పనులు ప్రారంభించి మురుగు కాలువలు శుభ్రం చేయాలన్నారు. లేనియెడల సిపిఐ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామన్నారు. పారిశుద్ధ్య నిర్వహణ, అక్రమ నిర్మాణాల కట్టడాల నివారణలో కమిషనర్ ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారని ఆయన ఆరోపించారు. ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ పథకం కింద పంపిణి చేసిన ఇళ్లలో మురికి కాలువలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని శాశ్వత పరిష్కారం కోసం వెంటనే మురికి కాలువ నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. మున్సిపాలిటీలో విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు సకాలంలో వేతనాలు, అలవెన్సులు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు బొడ్డు ఆంజనేయులు, ఎండి అభి, గిరిరాజు అంజయ్య, ఎండి జాంగిర్, కందుల మధు, సిపిఐ టౌన్ కార్యదర్శి గొట్టిపావుల శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

## కుమ్మర్ల హక్కులు సాధించుకుందాం



**ప్రజాపక్షం/తుర్కపల్లి :** నేటి ఆధునిక సమాజంలో కుమ్మరులు అన్ని రంగాల్లో అన్ని విధాలుగా ఐక్యమత్యంతో హక్కులు సాధించుకుందామని కుమ్మరసంఘం యాదాద్రి భువనగిరి జిల్లా ఉపాధ్యక్షుడు దేవరుప్పుల మల్లేష్,ఆలేరు నియోజకవర్గ కన్వీనర్ జివిలికపల్లి ఆంజనేయులు అన్నారు. ఆదివారం తుర్కపల్లి మండల కేంద్రంలో కుమ్మర సంఘం మండల ప్రధాన కార్యదర్శి నాగాయపల్లి శివరాములు, కోశాధికారి జాగిళ్లపురం సత్తయ్య, ప్రచార కార్యదర్శి కొలనుపాక కొండల్, మీడియా కోఆర్డినేటర్ జివిలికపల్లి మహేష్ ఆధ్వర్యంలో కుమ్మర సంఘం గ్రామ కమిటీ ఎన్నిక నిర్వహించారు. ఈ కమిటీలో తుర్కపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడిగా జివిలికపల్లి రాములు, ఉపాధ్యక్షులుగా జివిలికపల్లి బాలరాజు, గంగాదరి నర్సింహులు, ప్రధాన కార్యదర్శిగా జివిలికపల్లి భాస్కర్, సహాయ కార్యదర్శిగా జీవిలికపల్లి గోపాల్, ప్రచార కార్యదర్శిగా జీవిలికపల్లి రాజు, కోశాధికారిగా జివిలికపల్లి మహేష్, గౌరవ అధ్యక్షులు జివిలికపల్లి శ్రీనివాస్, బాల నరసయ్య, గంగాధరి నరసింహులు, గౌరవ సలహాదారులు జివిలికపల్లి సత్తయ్య, జివిలికపల్లి బాల నర్సయ్య, జివిలికపల్లి రాములు, జివిలికపల్లి నర్సింలు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు జివిలికపల్లి నాగరాజు, శ్రవణ్, వినయ్, చంద్రకాంత్, శివ, మణికంఠ, రాము తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వాలి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** నిరుపేదలకు ప్రభుత్వం ఇండ్లు, ఇండ్ల స్థలాలు అందించాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని తాళ్లగడ్డ ఇందిరమ్మ కాలనీలో ఆయన పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకోని మాట్లాడారు. తాళ్లగడ్డలో డ్రైనేజీ, రోడ్లు నిర్మించి, వీదిదీపాలు ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరించాలన్నారు. తాళ్లగడ్డలోని మల్లెతోట ప్రభుత్వ స్థలాన్ని కొందరు ఆక్రమించుకోని నిరుపేదలకు అమ్మారని, ఇట్టి భూమిని అని ఇప్పుడు ప్రభుత్వం, అధికారులు పేదలను ఖాళీ చేయించాలని చూస్తుండడం సరికాదన్నారు. పేదల పక్షాన నిలబడి వారికి పట్టాలు వచ్చేంతవరకు పోరాటాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో మల్లు గౌతంరెడ్డి, రాగిరెడ్డి మంగారెడ్డి, కోడిరెక్క మల్లయ్య, అరుణ, కరీం, జహంగీర్, రామారావు, వెంకటేశ్వర్లు, వీరేందర్ పాల్గొన్నారు.



## సర్వోత్తమ్‌రెడ్డికి పార్టీ పగ్గాలు ఇవ్వాలి

### సిఎం చేతిలో చెయ్యి వేయించి చెప్పిన విహెచ్

**ప్రజాపక్షం/సూర్యాపేట :** సూర్యాపేట నియోజక వర్గ పార్టీ పగ్గాలు దివంగత నేత మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి తనయుడు సర్వోత్తమ్ రెడ్డికి ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ రాజ్యసభ సభ్యులు వి హనుమంతరావు డిమాండ్ చేశారు. ఆదివారం తుంగతుర్తి నియోజక వర్గ కేంద్రంలో నిర్వహించిన దామోదర్ రెడ్డి సంతాప సభకు హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సర్వోత్తమ్‌రెడ్డిని ఓదార్చి అక్కడికి హాజరైన కాంగ్రెస్ శ్రేణులనుద్దేశించి మాట్లాడారు. పార్టీ కోసం నాలుగు దశాబ్ధాలుగా రాంరెడ్డి దామోదర్ రెడ్డి కుటుంబం సర్వేం కోల్పోయి కమ్యూనిస్టు గడ్డపై మూడు రంగుల జెండాను రెపరెపలాడించిన విషయాన్ని గుర్తు చేశారు. ఆయన ఉమ్మడి నల్లగొండ జిల్లాకు నాయకుడు కాదని... యావత్ తెలంగాణ రాష్ట్రానికి మహానాయకుడని చెప్పారు. సర్వోత్తమ్ రెడ్డికి సూర్యాపేట నియోజక వర్గ పార్టీ ఇంచార్జి బాధ్యతలను అప్పగించడం వల్లే ఆయనకు నిజమైన నివాళులర్పించిన వారమవుతామని స్పష్టం చేశారు. ఇదే డిమాండ్ పార్టీ శ్రేణుల నుండి వస్తుందని చెప్పారు. ఆయన ప్రసంగింస్తునప్పుడు వేదికపై సిఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలతోపాటు పార్టీ ఎమ్మెల్యేలు కూడా ఉన్నారు. అక్కడే ఉన్న దామోదర్ రెడ్డి తనయుడు సర్వోత్తమ్ రెడ్డిని సిఎం వద్దకు తీసుకవెళ్ళి ఆయన చేతిలో చెయ్యి వేయించి పట్టుకున్నారు. ఈ బంధం ఇలాగే కొనసాగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ దృశ్యాన్ని చూసిన దామన్న అభిమానులు కేరింతలు కొట్టారు.

## సాగర్‌లో పర్యాటకుల సందడి



**ప్రజాపక్షం/నందికొండ:** సాగర్‌లో పర్యాటకుల సందడి నెలకొంది. వరుసగా రెండు రోజులు సెలవులు రావడంతో ఆహ్లాదకరమైన వాతావరణంలో సేద తీరెందుకు ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్‌లో శుక్రవారం పర్యాటకులు పోటెత్తారు. ఆదివారం రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు సాగర్ అందాలను తిలకించడానికి వచ్చారు. అందులో సాగర్ ప్రాజెక్టు గేట్లు తెరిచి ఉంచడంతో విద్యార్థులు పర్యాటకులు తరలి క్రస్ట్ గేట్ల ద్వారా జాలు వారుతున్న కృష్ణమ్మ అందాలను తిలకించారు. ఆ తరువాత లాంచీలో నాగార్జునకొండకు వెళ్లి అక్కడి మ్యూజియంలోని విశేషాలు, బుద్ధుని అవశేషాలు, మాన్యుమెంట్స్ తదితర ప్రాంతాలను సందర్శించారు. అక్కడినుంచి సాయంత్రం వేళలో ఎత్తిపోతల జలపాతం, బుద్ధవనం తదితర ప్రాంతాలను సందర్శించారు. తెలంగాణ పర్యాటకశాఖ ఆదివారం నాగార్జున కొండకు లాంచీలను రెండు ట్రిప్పులు నడపగా ఇంకా పర్యాటకుల రద్దీ తగ్గకపోవడంతో పర్యాటకుల అభ్యర్థన మేరకు రిజర్వాయర్ లో ఒక జాలి ట్రిప్పు నడిపారు.

## నిరుపేదలకు అండ జనయేత్రి జెండా




**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** నిరుపేదలకు అండగా జనయేత్రి ఎజెండా ఎల్లవేళలా ముందుంటుందని ఫౌండేషన్ వ్యవస్థాపకులు, వైద్యులు, సామాజికవేత్త మునీర్ అన్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నల్లగొండ పట్టణం పెద్దబండ ప్రాంతానికి చెందిన జక్కల మల్లేష్ కుటుంబానికి జనయేత్రి ఫౌండేషన వ్యవస్థాపకులు డాక్టర్ మునీర్ అహ్మద్‌షరీఫ్ ఆదివారం 25కిలోల బియ్యం, రూ.10వేల నగదు అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనయేత్రి ఫౌండేషన్ నిరుపేద కుటుంబాలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ ఆదుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు ఎండి.సలీం, గాదె నరసింహా, జాజాల కృష్ణ, పోగుల సందీప్, కోట సైదులు, అవురెండ్ల సందీప్, అమీర్‌అలీ, జక్కల పృధ్వీ, బొజ్జ సైదులు, పాక పరమేష్ తదితరులు పాల్గొన్నారు.



## పూర్వ విద్యార్థుల సమ్మేళనం

**ప్రజాపక్షం/ రామన్నపేట:** మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1989/90 సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం వలెల ప్రతాపరెడ్డి ఫంక్షన్‌హాల్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ప్రతి ఒక్కరి జీవితంలో గుర్తుండే తీపి జ్ఞాపకాలను చిన్నతంలోనే ఉంటాయని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు మొక్కలు నాటి ప్రభుత్వ దవాఖానాలో పండ్లు పంపిణి చేశారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు నకిరేకంటి మొగిలయ్య, రామిరి రమేష్, పాల్వంచ హరికిషన్, ఆకారపు నర్సింమా, గోదాసు రమేష్, ఆనంద్, పొట్లపల్లి శ్రీధర్, బావండ్లపల్లి సత్యం, తిరుగుడు కృష్ణ, ముజీబ్, పాతూరి కృష్ణారావు, తిరుగుడు కృష్ణ, భారీ, శ్రీను, మోయిన్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



# జాతీయం


NATIONAL & GENERAL NEWS

## జెడియు అభ్యర్థులు ఖరారు.. నలుగురు ఎమ్మెల్యేలకు ఉద్వాసన

**పాట్నా :** బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అన్ని స్థానాల్లోనూ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ జనతాదళ్ (యునైటెడ్) అభ్యర్థులను ఖరారు చేసిందని, అయితే నలుగురు సిట్టింగ్ ఎమ్మెల్యేలను తొలగించే అవకాశం ఉందని పార్టీ సీనియర్ నేత తెలిపారు. పోటీ చేయబోయే స్థానాలను జెడియు గుర్తించిందని, అభ్యర్థులను కూడా ఖరారు చేసిందని, పనితీరు సరిగా లేని నలుగురు సిట్టింగ్ ఎమ్మెల్యేల స్థానాల్లో కొత్త ముఖాలతో భర్తీ చేస్తారని ఆయన పేర్కొన్నారు. గత వారం తమ పార్టీ ఎమ్మెల్యే సంజీవ్ కుమార్ ఆర్‌జెడిలో చేరిన ఖగారియాలోని పర్బట్టా స్థానంలో కూడా కొత్త అభ్యర్థిని పోటీకి దింపుతామన్నారు. ఎన్నికల్లో పనితీరు సరిగా లేని ఎమ్మెల్యేలు తిరిగి పోటీ చేయకూడదని తమ కేంద్ర నాయకత్వం ఇప్పటికే స్పష్టం చేసిందన్నారు.

# రెండు, మూడు రోజుల్లో 'మహాఘట్బంధన్' అభ్యర్థుల ప్రకటన

## ఈ వారంలోనే సంయుక్త మేనిఫెస్టో విడుదల



**న్యూఢిల్లీ :** బీహార్‌లోని ప్రతిపక్ష 'మహాఘట్బంధన్' కూటమి ఒకటి రెండు రోజుల్లో సీట్ల పంపకాన్ని ఖరారు చేసే అవకాశం ఉంది. ఈ వారంలో ఉమ్మడి మేనిఫెస్టోతో పాటు అభ్యర్థులను ప్రకటించనుంది. ఆర్‌జెడి,కాంగ్రెస్ మధ్య చర్చలు జరుగుతున్నాయని, ఆర్‌జెడికి చెందిన లాలూ ప్రసాద్, తేజస్వి యాదవ్ దేశ రాజధానిలోనే ఉన్నందున రెండు పార్టీలు సోమవారం సమావేశం కావచ్చని వర్గాలు తెలిపాయి. బీహార్‌లోని అన్ని సంకీర్ణ భాగస్వాములతో కాంగ్రెస్ అధ్యక్షుడు మాట్లాడుతున్నారని, కాంగ్రెస్, కొన్ని ఇతర పార్టీలు తాము బలంగా ఉన్నారని భావిస్తున్న కొన్ని స్థానాల్లో అభ్యర్థులను నిర్ణయించడం కోసం తుది చర్చ జరుగుతోందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ తెలిపారు. ఆర్‌జెడి, కాంగ్రెస్ నాయకత్వాల మధ్య చర్చలు కూడా జరుగుతున్నాయని, సోమవారం నాటికి రెండు ప్రధాన పార్టీల నాయకులు కూడా సమావేశం కావచ్చని ఆయన అన్నారు. సీట్ల పంపకాల ప్రకటన ఆలస్యం కావడంపై రమేష్ మాట్లాడుతూ 'మహాఘట్బంధన్'లో కొంతమంది కొత్త భాగస్వాములను సర్దుబాటు చేసుకోవాల్సి ఉందని, సీట్ల పంపకంలో వారికి స్థానం కల్పించాల్సి ఉందన్నారు. రెండు, మూడు రోజుల్లో సీట్లను ఖరారు చేసి ప్రస్తామని ఆశిస్తున్నానన్నారు. కాంగ్రెస్ ఈసారి ఎన్ని సీట్లలో పోటీ చేస్తుందనే ప్రశ్నకు 50 నుంచి 100 మధ్య ఎన్నినా కావచ్చన్నారు. అయితే, కాంగ్రెస్ గతసారి బీహార్ ఎన్నికల్లో పోటీ చేసిన 50 కంటే ఎక్కువ కానీ 70 కంటే తక్కువ సీట్లలో పోటీ చేయవచ్చని వర్గాలు తెలిపాయి. బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో మరికొన్ని స్థానాల్లో అభ్యర్థులను ఖరారు చేయడానికి సోమవారం పార్టీ ప్రధాన కార్యాలయంలో అగ్ర కాంగ్రెస్ నాయకులు సమావేశం కానున్నారని వారు తెలిపారు. కాంగ్రెస్ గౌరవప్రదమైన, ఆమోదయోగ్యమైన సంఖ్యలో సీట్లు పొందే అవకాశం ఉందని రమేష్ అన్నారు. బీహార్‌లో ప్రతిపక్ష 'మహాఘట్బంధన్' ఎన్నికల అవకాశాల గురించి రమేష్ మాట్లాడుతూ బీహార్‌లో మార్పు కావాలని ప్రజల్లో బలంగా ఉందని, విడుదల చేసిన ఛార్జ్‌షీట్‌కు చాలా మంచి స్పందన వస్తుందన్నారు. ఆర్‌జెడి పాలనకు వ్యతిరేకంగా బిజెపి చేస్తున్న 'జంగల్‌రాజ్' కథనంపై, 'ప్రజలు నేటి గురించి ఆందోళన చెందుతున్నారని, 20 సంవత్సరాల క్రితం ఏమి జరిగిందో అనే దానిపై కాదన్నారు. నితీష్ కుమార్ నియంత్రణలో లేరని, ఆయన ఇప్పుడు ఒక ముఖం మాత్రమేనని ప్రజలు గ్రహించి తెలుసుకుంటున్నారన్నారు. ఆయన తిరిగి ముఖ్యమంత్రిగా కాబోరని, 20 సంవత్సరాల క్రితం ఉన్న వ్యక్తిలా లేరని కాంగ్రెస్ నాయకుడు అన్నారు. బీహార్‌లో కూడా బిజెపి విభజన రాజకీయాలకు పాల్పడుతోందని ఆరోపించారు. ప్రస్తుతం బీహార్ ప్రభుత్వాన్ని అధికార యంత్రాంగం నడుపుతోందని, నితీష్ కుమార్ ఉన్నారు కానీ ఆయన నియంత్రణలో లేరనే బలమైన భావన ఉందని ఆయన అన్నారు. ఓటు చోరీ ప్రచారంతో పాటు, కాంగ్రెస్ చాలా వెనుకబడిన తరగతులపై దృష్టి సారించిందని జైరామ్ రమేష్ చెప్పారు. మైబెహెన్ మాన్ యోజనను ప్రకటించిందని, దీని కింద రూ. 2,500 నిరుపేద మహిళల బ్యాంకు ఖాతాలకు బదిలీ చేయబడుతుందని, మరికొన్ని ప్రతిపాదనలు పనిలో ఉన్నాయని ఆయన అన్నారు.

## అమ్మాయిలు రాత్రిపూట బయటకు వెళ్ళొద్దు

### వైద్య విద్యార్థిని అత్యాచార ఘటనపై సిఎం మమతా బెనర్జీ దిగ్భ్రాంతికర వ్యాఖ్యలు

**కోల్‌కతా :** పశ్చిమ బెంగాల్ దుర్గాపూర్‌లోని ఒక ప్రైవేట్ మెడికల్ కాలేజీకి చెందిన ఒడిశా విద్యార్థిని శుక్రవారం రాత్రి స్నేహితుడితో కలిసి విందుకు బయటకు వెళ్లినప్పుడు సామూహిక అత్యాచారానికి గురైన విషయం తెలిసిందే. ఘటనపై ముఖ్యమంత్రి మమతా బెనర్జీ దిగ్భ్రాంతికరమైన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రం వెలుపల నుండి వచ్చిన మహిళా బోర్డింగ్ విద్యార్థులు హాస్టల్ నియమాలను పాటించాలని, రాత్రి ఆలస్యంగా బయటకు వెళ్లకూడదన్నారు. 'హాస్టళ్లలో ఉండే విద్యార్థులు, ముఖ్యంగా రాష్ట్రం వెలుపల నుండి చదువుకోవడానికి పశ్చిమ బెంగాల్‌కు వచ్చిన విద్యార్థులు హాస్టళ్ల నియమాలను పాటించాలి. వారు ఎక్కడికైనా వెళ్లే ప్రాథమిక హక్కు ఉన్నప్పటికీ, అర్ధరాత్రి బయటకు వెళ్లకుండా ఉండాలి. ప్రతి వ్యక్తి కదలికను పర్యవేక్షించడంలో పోలీసులకు కొన్ని లాజిస్టికల్ పరిమితులు ఉన్నాయి. రాత్రిపూట ఎవరు ఇంటి నుండి బయటకు వెళ్తున్నారో అధికారులకు తెలియదు, ప్రతి ఇంటి వెలుపల కాపలాగా ఉండలేరు' అని ఆమె వ్యాఖ్యానించారు. ప్రకృతి విపత్తుతో అతలాకుతలమైన ఉత్తర బెంగాల్‌కు సహాయ, పునరావాస పనులను సమీక్షించడానికి బయలుదేరే ముందు ఆమె నేతాజీ సుభాష్ చంద్రబోస్ అంతర్జాతీయ విమానాశ్రయంలో విలేకరులతో మాట్లాడారు. వైద్య విద్యార్థిని అత్యాచార ఘటన దిగ్భ్రాంతికరమైనదని, నిందితులను వదిలిపెట్టబోమని చెప్పారు. తమ ప్రభుత్వం ఇటువంటి ఘటనలను సహించదన్నారు. ఆ మహిళ చదువుతున్న విద్యాసంస్థ కూడా ఘటనకు బాధ్యత వహిస్తుందన్నారు. ప్రైవేట్ కళాశాలలు తమ క్యాంపస్‌ల లోపల, చుట్టుపక్కల భద్రతను పటిష్టం చేసుకోవాలన్నారు.

### ముగ్గురు అరెస్టు

అత్యాచారం కేసులో ఆదివారం ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ సంఘటనలో అతని పాత్ర ఉందని అనుమానిస్తున్న మరో వ్యక్తిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అరెస్టు చేసిన ఆ ముగ్గురు నిందితులు ఎవరు అనేది పోలీసులు ఇంకా వెల్లడించలేదు. వారిని ప్రశ్నిస్తున్నామని, ఇది చాలా సున్నితమైన కేసు, త్వరలో మరిన్ని వివరాలను వెల్లడిస్తామని పోలీసుఅధికారిపిటిఐకి తెలిపారు.నిందితుల మొబైల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. ఆదివారం, పరానాగంజ్ కాళీ బారి శ్మశాన వాటికకు ఆనుకుని ఉన్న అడవిలో నేరం జరిగిన ప్రదేశాన్ని స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. దుర్గాపూర్‌లోని ప్రైవేట్ మెడికల్ కాలేజీ, చుట్టుపక్కల గ్రామాల్లో శోధన నిర్వహిస్తున్నామని, ఈ ప్రాంతంలోని అడవుల్లో శోధనలు నిర్వహించడానికి డ్రోన్‌లను కూడా ఉపయోగించామని అధికారి తెలిపారు. కాగా, బాధితురాలు చదువుతున్న ప్రైవేట్ కళాశాల, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నదని, ఆమ్ ఆరోగ్యం 'మెరుగవుతోందని అధికారి తెలిపారు.ఆమె తన వాంగ్మూలాన్ని అధికారులకు అందించింది. కాగా, మొబైల్ ఫోన్ టవర్ డంపింగ్ పద్ధతి ద్వారా ముగ్గురు నిందితులను గుర్తించారు. మరికొంత మంది కూడా ఇందులో పాల్గొనే అవకాశముందని, దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు చెప్పారు. నిందితులు బాధితురాలికి తెలిసిన వారా లేదా కళాశాల వెలుపల వెళ్లిన ఆమె స్నేహితుడికి తెలిసినవారా అని కూడా తెలుసుకోవడానికి ప్రయత్నిస్తున్నామన్నారు.నిందితులను శిక్షించడానికి చర్యలు తీసుకోవాలని బాధితురాలి తండ్రి రాష్ట్ర ప్రభుత్వాన్ని అభ్యర్థించారు.

### అంబులెన్స్‌లకు ఒక ఫ్రేమ్‌వర్క్ తయారీ, అమలుకు ఆదేశాలు జారీ పిటిషన్‌పై..

# కేంద్రం, ఇతరుల స్పందన కోరిన 'సుప్రీం'

### స్వతంత్ర కమిటీ ఏర్పాటుకు ఆదేశాలు జారీ అభ్యర్థన వినడానికి అంగీకారం



**న్యూఢిల్లీ :** అంబులెన్స్‌లలో ఎల్లవేళలా తగినంత లైఫ్ సపోర్టు సౌకర్యాలు నిర్వహించబడుతున్నాయని నిర్ధారించడానికి ఒక ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించి, అమలు చేయడానికి ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ దాఖలు చేసిన ఒక పిటిషన్ విషయంలో సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వం, ఇతరుల స్పందనను కోరింది. గ్రౌండ్ రియాలిటీ, ప్రస్తుత ప్రామాణిక ఆపరేటింగ్ విధానాల మధ్య అంతరాన్ని గుర్తించడానికి అంబులెన్స్‌ల ఆపరేషన్, నిర్వహణ, నియంత్రణ యొక్క ప్రస్తుత వాస్తవ స్థితిని సమీక్షించడానికి, ఒక స్వతంత్ర కమిటీని ఏర్పాటు చేయాలనే ఆదేశాలు జారీచేయాలంటూ దాఖలు చేసిన పిటిషన్‌ను వినడానికి అత్యున్నత న్యాయస్థానం అంగీకరించింది. 'నోటీస్ జారీచేయండి. నాలుగు వారాలలో తిరిగి ఇవ్వబడుతుంది' అని ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్.గవాయ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం తన అక్టోబర్ 10నాటి ఆదేశంలో చెప్పింది. ఆ పిటిషన్‌లో కేంద్ర ప్రభుత్వం, ఆరోగ్య మంత్రిత్వ శాఖ, కుటుంబ సంక్షేమం, రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖను ప్రతివాదులుగా ఉంచింది. సీనియర్ న్యాయవాది పెర్సివల్ బిల్లిమోరియా, న్యాయవాది జాస్మి దామ్‌కేవాలా పిటిషనర్లు సాయిన్నా పనంగిపల్లి, ప్రియా సర్కార్‌ల తరపున వాదించారు. పనంగిపల్లి ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ మాజీ డైరెక్టర్‌గా పనిచేసిన ప్రముఖ కార్డియోథొరాయిక్ సర్జన్ డాక్టర్ పి.వేణుగోపాల్ కుమార్తె. సర్కార్ వేణుగోపాల్ భార్య. 'అంబులెన్స్‌లలో సరిపోను అత్యవసర లైఫ్ సపోర్ట్ సదుపాయాలు లేకపోవడం వల్ల డాక్టర్ పి.వేణుగోపాల్ స్వయంగా పేషెంట్‌ను ఆసుపత్రి అత్యవసర గదికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మరణించాడు. ఆక్సిజన్ అందకపోవడంతో అంబులెన్స్‌లలో అత్యవసర సౌకర్యాల కొరతను పిటిషనర్లు గ్రహించారు' అని పిటిషనర్ పేర్కొన్నారు. పిటిషనర్లు ప్రతికూల వ్యాజ్యాలలో పాల్గొనడానికి ఇష్టపడటం లేదని, అయితే అమలు చేయగల నియంత్రణ లేకపోవడం వల్ల భారతదేశం వ్యాప్తంగా అంబులెన్స్‌లలో తగినంత అత్యవసర వనరులు లేకపోవడం పెద్ద ఆందోళన కలిగిస్తుందని కనుగొన్నారని పిటిషన్ పేర్కొంది. చాలా మంది ప్రాణాలను కాపాడే అవకాశం ఉందని ఆ పిటిషన్ తెలియజేసింది. అవసరమైన ప్రాణాలను రక్షించే సౌకర్యాల కొరత కారణంగా, ఆసుపత్రులలో అత్యవసరమైన సేవలను అంబులెన్స్‌లు అందించలేకపోయినందున అనవసరంగా నష్టపోయారని వివరించింది.'అంబులెన్స్‌లలో అన్ని సమయాలలో తగిన లైఫ్ సపోర్టు సౌకర్యాలు ఉండేలా ఒక ఫ్రేమ్‌వర్క్‌ను అమలు చేయడానికి, అవసరమైన పరికరాలు, సామగ్రి, అత్యవసర మందులతో సహా సౌకర్యాలు ఉండేలాచూడాలి' అని సంబంధిత అధికారులకు ఆదేశాలు కోరింది. ఇతర ప్రార్థనలతో పాటు అంబులెన్స్‌లలో సరిపోని, సరికాని సౌకర్యాలు, అధిక చార్జీలు, ర్యాష్ డ్రైవింగ్, రాకలో ఆలస్యం, ఇతర లోపాలను నివేదించడం వంటి ఫిర్యాదులను ప్రజలు నివేదించడానికి టెలిఫోన్ లేదా ఆన్‌లైన్ హెల్ప్‌లైన్ సౌకర్యాన్ని ఏర్పాటు చేయడానికి లేదా కొనసాగించడానికి అధికారులను ఆదేశించాలని పిటిషన్ సుప్రీంకోర్టును కోరింది.

## భారత్‌కు గొప్ప వైవిధ్యాన్ని ప్రతిబింబించే విద్యా వ్యవస్థ అవసరం



**న్యూఢిల్లీ :** భారతదేశానికి దేశంలోని గొప్ప వైవిధ్యాన్ని ప్రతిబింబించే విద్యా వ్యవస్థ అవసరమని, అది 'కొంతమందికి ప్రత్యేక హక్కు' గా మారకూడదని, అదే స్వేచ్ఛకు పునాది అని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ అన్నారు. భారతదేశం ప్రత్యామ్నాయ తయా రీ వ్యవస్థను నిర్మించాల్సిన అవసరం ఉంద ని, అమెరికా లేదా పెరూతో భాగస్వామ్యం ముందుకు సాగడానికి మార్గం కావచ్చని కూడా లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ అన్నారు. పెరూలోని పోంటిఫికల్ కాథలిక్ విశ్వవిద్యాలయం, చిలీ విశ్వవిద్యాలయంలోని విద్యార్థులతో జరిగిన ముఖాముఖిలో కాంగ్రెస్ నాయకుడు విద్య, ప్రజాస్వామ్యం, భౌగోళిక రాజకీయాలపై దృష్టి సారించిన 'అంతర్ దృష్టితో కూడిన సంభాషణ' నిర్వహించారు. కాంగ్రెస్ తన అధికారిక ఎక్స్ ఖాతాలో గాంధీని ఉటంకిస్తూ, దక్షిణ అమెరికాలోని విద్యార్థులతో ఆయన సంభాషణ వీడియోను షేర్ చేసింది. విద్య విషయానికి వస్తే, అది ఉత్సుకతతో, బహిరంగంగా ఆలోచించే స్వేచ్ఛతో ప్రారంభమవుతుందని, ఎటువంటి భయం లేదా అడ్డంకులు లేకుండా రాజకీయ లేదా సామాజికంగా ప్రశ్నలు అడగాలన్నారు. విద్య కొంతమందికి మాత్రమే ప్రత్యేక హక్కుగా మారకూడదని, ఎందుకంటే అది స్వేచ్ఛకు పునాది అని అన్నారు. భారతదేశానికి శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించే, విమర్శనాత్మక ఆలోచనను ప్రోత్సహించే, మన దేశం గొప్ప వైవిధ్యాన్ని ప్రతిబింబించే విద్యావ్యవస్థఅవసరంఅనిఅన్నారు. రాహుల్‌గాంధీ వారం రోజుల పాటు కొలంబియా, బ్రెజిల్, పెరూ, చిలీ దేశాలకు పర్యటనలో ఉన్నారు.

## మాతృశ్రీకి మరోసారి రాజ్‌థాక్రే

**ముంబయి :** మహారాష్ట్ర నవనిర్మాణ సేన అధ్యక్షుడు రాజ్ థాకరే ఆదివారం తన సోదరుడు, శివసేన (యుబిటి) అధినేత ఉద్ధవ్ థాక్రేను ముంబయిలోని ఆయన నివాసం 'మాతోశ్రీ'లో కలిశారు. వారిద్దరు కలుసుకోవడం ఈ వారంలో ఇది రెండవసారి. ఈ భేటీపై విలేకరులు అడిగిన ప్రశ్నకు, రాజ్ మాట్లాడుతూ 'నా తల్లి నాతో ఉంది' అని, ఇది కుటుంబ సమావేశం అని అన్నారు.రాజ్ భార్యషర్మిలకూడాఈ భేటీకి హాజరయ్యారు. అయితే, బృహన్ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్‌కు అత్యంత ముఖ్యమైన ఎన్నికల్లో సోదరిలిద్దరు కులిసి పోటీ చేస్తారనే ఊహాగానాల మధ్య ఈ భేటీ జరగడం గమనార్హం. జూలై 5న మహారాష్ట్ర ప్రభుత్వం హిందీని 'తప్పనిసరి' చేయడం, 1 5 తరగతుల విద్యార్థులకు మూడు భాషల సూత్రాన్ని అమలు చేయడంపై రెండు వివాదాస్పద జిఆర్‌లను ఉపసంహరించుకున్న నేపథ్యంలో విజయ ర్యాలీని జరుపుకోవడానికి థాక్రేలిద్దరూ ఒకే వేదికపైకి వచ్చారు.

## సీట్ల పంపకాలలో అడ్డంకుల్లేవ్ : ఖేరా

**రాంచి :** బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో సీట్ల పంపకాలలో ఎలాం టి అడ్డంకులు లేవని, మహాఘట్‌బంధన్ భాగస్వాములు కలి సే పోటీ చేస్తారని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పవన్ ఖేరా స్పష్టం చేశారు. ప్రతి పార్టీకి తమ అభిప్రాయాలను వ్యక్తపరిచే హక్కు ఉందన్నారు. బిహార్ ఎన్నికలకు సీట్ల పంపకాలపై అక్టోబర్ 14 నాటికి నిర్ణయం తీసుకోవాలని, లేకుంటే పార్టీ సొంతంగా నిర్ణయం తీసుకుంటుందని జార్ఖండ ముక్తి మోర్చా (జెఎంఎం) ఇండియా కూటమిని కోరిన మరుసటి ఖేరా పై విధంగా స్పందించారు. బిజెపి ఆశించినట్లుగా మహాఘట్‌బంధన్‌లో సీట్ల పంపకాలలో ఎలాంటి అడ్డంకులు లేవని, ప్రతిపార్టీకి తమ అభిప్రాయాలను వ్యక్తపరిచే హక్కు ఉందన్నారు. తాము కలిసి ఎన్నికల్లో పోటీ చేస్తామని కాంగ్రెస్ మీడియా, ప్రచార విభాగ అధిపతి ఖేరా రాంచీలోని బిర్సా ముండా విమానాశ్రయంలో విలేకరులతో అన్నారు. ఖేరాసెయింట్‌జేవియర్స్ కళాశాలలో 'రాజ్యాంగంలో గిరిజన హక్కులు వర్సెస్ గ్రౌండ్ రియాలిటీ' అనే అంశంపై జరిగే చర్చలో పాల్గొనడానికి రాంచికి వచ్చారు. కాగా, ఈ నెల 14 నాటికి ఇండియా కూటమి పార్టీకి గౌరవప్రదమైన సంఖ్యలో సీట్లు కేటాయించకపోతే బిహార్ అసెంబ్లీ ఎన్నికలపై పార్టీ స్వంత నిర్ణయం తీసుకుంటుందని జెఎంఎం కేంద్ర ప్రధాన కార్యదర్శి, ప్రతినిధి సుప్రియో భట్టాచార్య శనివారం హెచ్చరించారు.

# కర్రెగుట్టల్లో సిఆర్‌పిఎఫ్ శిక్షణ పాఠశాల



**న్యూఢిల్లీ/బిజాపూర్ :** ఛత్తీస్‌గఢ్‌-తెలంగాణ సరిహద్దు వెంబడి ఉన్న కర్రెగుట్ట కొండలలో సైనికుల కోసం ఒక కమాండో శిక్షణ పాఠశాలను ఏర్పాటు చేయాలని సిఆర్‌పిఎఫ్ యోచిస్తోంది. ఈ ఏడాది ఏప్రిల్‌-మే మధ్య ఈ గుట్టలలో 31 మంది మావోయిస్టులను చంపిన అతిపెద్ద నక్సల్ వ్యతిరేక కార్యకలాపాలలో ఒకటి. 60 కి.మీ పొడవు, 520 కి.మీ వెడల్పు ఉన్న తేనెటీగలు, గబ్బిలాలు, ఎలుగుబంట్లు వివిధ రకాల కీటకాలతో పాటు గుహలు, బంకర్లతో నిండిన ప్రకృతి దృశ్యంలో తగిన ప్రదేశాన్ని కనుగొనడానికి ఒక సర్వే జరుగుతోందని అధికారిక వర్గాలు పిటిఐకి తెలిపాయి. కరేగుట్ట కొండలు అని కూడా పిలువబడే కొర్గోటలు కొండలు (కెజిహెచ్) వద్ద సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సిఆర్‌పిఎఫ్), దాని జంగిల్ వార్‌ఫేర్ కమాండో యూనిట్ కోబ్రా, ఛత్తీస్‌గఢ్ పోలీసులు మూడు వారాల పాటు 'ఆపరేషన్ బ్లాక్ ఫారెస్ట్'ను చేపట్టి 31 మంది మావోయిస్టులను హతమార్చారు. ఏప్రిల్, మే మధ్య భారీ ఆయుధాలు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. కెజిహెచ్ ఆపరేషన్ ముగిసిన తర్వాత, కొండపై దాచిన ఐఇడిలు (అధునాతన పేలుడు పరికరాలు), బాంబులను తటస్థీకరించడానికి విస్తృతమైన శానిటైజేషన్ ప్రక్రియ జరిగింది. ఆ పని దాదాపు పూర్తయిందని, ఇప్పుడు కొండ ప్రశాంతంగాఉండేలాఇక్కడసిఆర్‌పిఎఫ్‌నిర్వహించే శిక్షణా పాఠశాలను ఏర్పాటు చేయాలని యోచిస్తున్నట్లు ఒక సీనియర్ అధికారి తెలిపారు. పారామిలిటరీ దళం, ఛత్తీస్‌గఢ్ పోలీసుల నుండి తీసుకోబడిన అధికారుల బృందం లాజిస్టిక్స్, మౌలిక సదుపాయాల అంశాలను పరిశీలిస్తోంది. తద్వారా కెజిహెచ్‌లో కమాండోలకు శిక్షణ ఇవ్వడానికి శాశ్వత స్థావరాన్ని సృష్టించవచ్చు అని మరో అధికారి తెలిపారు.వేసవిలో 45 డిగ్రీల సెల్సియస్ కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు,నీరు,విద్యుత్తుకు సంబంధించిన సమస్యలు ఉంటాయని అధికారులన్నారు. ఈ ప్రాథమిక సమస్యలు పరిష్కరించబడిన తర్వాత తుది ప్రణాళిక అమలులోకి వస్తుందన్నారు.ఆపరేషన్ బ్లాక్‌ఫారెస్ట్‌సమయంలో దళాలు కొండల మీదుగా వెళ్లడానికి మార్గాలను సృష్టించాయని, అయితే, భూభాగంచాలా కష్టంగా,సవాలుగా ఉందని చెప్పారు. కెజిహెచ్‌లో కొన్ని ప్రాంతాలను పర్యాటకుల కోసం తెరవడానికి కూడా ప్రణాళిక ఉందని, భద్రతా స్థావరం ఉండటం ఈ ప్రణాళికను ముందుకు తీసుకెళ్లడానికి కూడా సహాయపడుతుందని వారు చెప్పారు. 1,200 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న కెజిహెచ్ అంతటా జరిగిన ఆపరేషన్‌లో సిఆర్‌పిఎఫ్, ఛత్తీస్‌గఢ్ పోలీసుబృందాలు సంయుక్తంగా 450ఐఇడిలు, 35 అధిక నాణ్యత ఆయుధాలు, 2 టన్నుల పేలుడుపదార్థాలను స్వాధీనంచేసుకున్నాయి. 250 గుహ లు, 214 బంకర్లను ధ్వంసం చేశాయి. కమాండోలు దాడి చేయడానికి దాదాపు 2.5 సంవత్సరాల ముందు అత్యంత హింసాత్మకమావోయిస్టుయూనిట్ పిఎల్‌జిఎ బెటాలియన్ నంబర్1, తెలంగాణ రాష్ట్ర కమిటీ (టిఎస్‌సి) టాప్ కమాండర్లతో సహా 350మంది నక్సల్స్, కొన్ని ఇతర విభాగాలు కొండలపై ఉన్నాయని భద్రతా దళాలు తెలిపాయి. కెజిహెచ్‌లో ఆయుధ తయారీ యూనిట్ ప్రధాన కార్యాలయం ఉండగా, మావోయిస్టుల ఆయుధశాలగా పనిచేసింది.


## జమ్ముకశ్మీర్ రాజ్యసభ పోల్స్‌కు కాంగ్రెస్ దూరం

**శ్రీనగర్:** జమ్ముకశ్మీర్‌లోని నాలుగు రాజ్యసభ స్థానాలకు అక్టోబర్ 24న జరగనున్న ఎన్నికలకు దూరంగాఉండాలని కాంగ్రెస్ నిర్ణయించింది. ఈ విషయాన్ని జమ్ముకశ్మీర్ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పిసిసి)అధ్యక్షుడు తారిక్ హమీద్ కర్రా ఆదివారంప్రకటించారు. అలెయెన్స్ అగ్రిమెంట్ ప్రకా రం 'సేఫ్ సీట్' కేటాయించ లేమని నేషనల్ కాన్ఫరెన్స్(ఎన్‌సి) తేల్చిచెప్పడంతో పోటీకి దూరంగా ఉండాలని తమ పార్టీ ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకుందని తెలిపారు. నాలుగు రాజ్యసభ సీట్లలో మొదటి రెండింట్లో ఒక స్థానంలో పోటీ చేయాలని కాంగ్రెస్ ఆశించినప్పటికీ రాజ్యసభకు పోటీ చేసేముగ్గురుఅభ్యర్థుల పేర్లను నేషనల్ కాన్ఫరెన్స్ ఇప్పటికే ప్రకటించింది.నాలుగో సీటుకు తమ అభ్యర్థిని నిలపరాదని కాంగ్రెస్ ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకుందని కర్రా తెలిపారు. తమ భాగస్వామ్య పార్టీకే ఆ సీటునువదలివేస్తున్నట్టు చెప్పారు.కాగా, నేషనల్ కాన్ఫరెన్స్‌అసెంబ్లీలోతమకున్న బలంఆధారంగాభాగస్వామ్యపార్టీలమద్దతు లేకున్నా సునాయాసంగా 3 సీట్లు గెలుచుకోగలుగుతుంది.నాలుగో సీటు గెలుచుకోవాలంటే బిజెపి వ్యతిరేక ఓటును తమవైపు తిప్పుకోవాల్సి ఉంది.

# పథకం ప్రకారం సమాచార హక్కు చట్టం హననం

### రెండేళ్ళుగా కమిషనర్ల పోస్టులు భర్తీ చేయలేదు

### మోదీ ప్రభుత్వంపై కాంగ్రెస్ విమర్శ



**న్యూఢిల్లీ:** మోదీ ప్రభుత్వం దేశంలో సమాచార హక్కు చట్టాన్ని (ఆర్‌టిఐ చట్టం) పథకం ప్రకారం బలహీనపరచి హననానికి పాల్పడుతోందని కాంగ్రెస్‌పార్టీ విమర్శించింది. సమాచార హక్కు దేశంలో చట్టరూపం దాల్చి 20 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కాంగ్రెస్‌పార్టీ పైవిధంగా స్పందించింది. ప్రభుత్వ పాలనలో జవాబుదారీతనాన్ని, బాహాటత్వ పద్ధతులను అమలు చేసే లక్ష్యంతో ఇరవైయేళ్ళక్రితం యుపిఎ ప్రభుత్వం ఈ చట్టాన్ని తీసుకువచ్చిందని, కానీ బిజెపి పాలకులు దేశంలో ఆర్ టి ఐ ని భయపెట్టే హక్కు(రైట్ టూ ఇంటిమిడేట్)గా మార్చేశారని, మృత చట్టంగా మార్చారన్నారు. ఏడుగురు సమాచార కమిషనర్‌ల పోస్టులను దీర్ఘకాలంగా భర్తీ చేయకుండా ఖాళీగా ఉంచేసి కేంద్ర సమాచార కమిషన్‌ను అధికారాలు లేని విగత వ్యవస్థగా చేశారని ఎఐసిసి ప్రధాన కార్యదర్శి (కమ్యూనికేషన్స్) జైరామ్ రమేశ్ విమర్శించారు. సమాచార హక్కు చట్టం 2005 అక్టోబరు 12వ తేదీన దేశవ్యాప్తంగా అమలులోకి వచ్చింది. న్యూఢిల్లీలో ఆదివారం జైరామ్ రమేశ్ పత్రికా గోష్ఠిలో మాట్లాడుతూ, పాలనావ్యవస్థలో దాపరికం లేకుండాచేసే ఈ చట్టం వెనుక ఉన్న విప్లవాత్మకమైన ప్రయోజనాలను బిజెపి పాలకులు నీరుగార్చారని విమర్శించారు. మోదీ ప్రభుత్వం 2019లో సమాచార హక్కు చట్టానికి సవరణలు తీసుకువచ్చి బలహీన పరచిందని, కేంద్ర సమాచార కమిషన్‌ను కోరలులేని వ్యవస్థగా మార్చేసి చాలా సమర్థవంతంగా నాశనం చేసిందన్నారు. ఆర్‌టిఐ చట్టంలోని నిబంధనలను సవరించేందుకు డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ చట్టాన్ని మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిందని, ఆర్‌టిఐని విచ్ఛిన్నం చేయడానికే ఈ చట్టాన్ని తెచ్చిందని అన్నారు. కేంద్ర సమాచార కమిషన్‌ను కేవలం ఇద్దరు సభ్యులతో మాత్రమే నడుపుతున్నారని, వీరిలో ఒకరు ప్రధాన సమాచార కమిషనర్ కాగా, మరో ఏడు ఇతర కమిషనర్ల పోస్టులు రెండు సంవత్సరాలుగా భర్తీచేయకుండా ఖాళీగా పెట్టి ఉంచారన్నారు. కేంద్ర సమాచార కమిషనర్ ప్రధాన కార్యాలయం ఒక భూతాల ఇల్లులా నిర్మానుష్యంగా మారిపోయిందని, మోదీ ప్రభుత్వం ఆర్‌టిఐ పై తీవ్ర వ్యతిరేకత, అసహ్యం పెంచుకుందని విమర్శించారు. ఆర్ టి ఐ చట్టాన్ని బలహీన పరచి, దానిని విగత చట్టంగా మార్చారన్నారు.

### ఆ ఐదు కారణాలవల్లే ఆర్‌టిఐ విగత వ్యవస్థగా మారింది

సమాచార హక్కు చట్టాన్ని ఎందుకూ పనికిరాకుండా చేయడానికి బిజెపికి ఐదు కారణాలున్నాయని జైరామ్ రమేశ్ చెప్పారు. ఇందులో ప్రధానమైనది నరేంద్రమోదీ ఎం.ఎ డిగ్రీలో ''ఆయన రాజనీతి శాస్త్రం' కు సంబంధించిన సమాచారం సమకూర్చాలని ఆర్‌టిఐ ద్వారా అడిగారన్నారు. ఇక రెండో కారణం కూడా దేశంలో కోట్ల సంఖ్యలో నకిలీ రేషన్ కార్డులు ఉన్నాయని ప్రధానమంత్రి చెప్పినప్పుడు ఆయన మాటలు తప్పు అని చెప్పేందుకు ఈ చట్టం ద్వారా సమాచారం సమకూర్చిందన్నారు. మోదీ అన్నీ ఈ విషయంలో అసత్యాలే చెప్పారని ఆర్‌టిఐ చట్టం ద్వారా బహిర్గతమైందన్నారు. ఇక మూడో కారణం కూడా పెద్ద నోట్ల రద్దుపై ఆయన తీసుకున్న నిర్ణయానికి సంబంధించినదేనన్నారు. పెద్ద నోట్ల ఉపసంహరణవల్ల నకిలీ కరెన్సీ నోట్లనుగానీ, లెక్కల్లో చూపించకుండా రహస్యంగా దాచిన బ్లాక్‌మనీని గానీ వెలికి తీయడానికి అవకాశం ఉండదని నరేంద్రమోదీ తన నిర్ణయాన్ని ప్రకటించడానికి నాలుగు గంటల ముందుగానే రిజర్వు బ్యాంకు స్పష్టం చేసిందని, ఈ విషయం ఆర్ టి ఐ చట్టం ద్వారా బహిర్గమైందని చెప్పారు. ఇక నాలుగో కారణం కూడా దేశంలో ఉద్దేశపూర్వకంగా బ్యాంకులకు రుణాలు చెల్లించకుండా ఎగవేసిన 20 మంది ప్రముఖుల పేర్ల జాబితా వెల్లడించాలని ఆర్ టి ఐ చట్టం ద్వారా కొందరు సమాచారం అడిగారని, ఆనాటి రిజర్వుబ్యాంకు గవర్నర్ ఈ జాబితాను ప్రధానమంత్రి కార్యాలయానికి సమర్పించారని కేంద్ర సమాచార కమిషన్ వారికి తెలియజేసిందని రమేశ్ చెప్పారు. విదేశాల్లో దాచిన నల్లధనాన్ని దేశానికి రప్పిస్తానని 2014లో లోక్‌సభ ఎన్నికలకు ముందుగా నరేంద్ర మోదీ ప్రచారం చేశారని, కానీ నల్లధనం దేశానికి తిరిగి రాలేదన్న విషయం ఈ సమాచార హక్కు చట్టం ద్వారానే బహిర్గతమైందన్నది ఐదో అంశమని ఈ ఐదు కారణాలవల్ల నరేంద్రమోదీ ప్రభుత్వం ఆర్ టి ఐని ఎలాంటి అధికార కోరలూ లేని విగతచట్టంగా మార్చేసిందని విమర్శించారు. అదేవిధంగా డిజిటల్ ప్రొటెక్షన్ చటద్టాన్ని ఇప్పుడున్న రూపంలో యథాతథంగా అమలు చేసినట్లయితే సమాచార హక్కు చట్టానికి ఇక అంతిమ ఘడియలు సమీపించాయని రుజువు అవుతుందని జైరామ్ రమేశ్ హెచ్చరించారు. డిజిటల్ ప్రొటెక్షన్ చట్టంలోని 44(3) వ సెక్షన్ కింద ఆర్‌టిఐ చట్టం ద్వారా ఏ వ్యక్తి వ్యక్తిగత సమాచారం కూడా ఎవరికీ అందుబాటులో ఉండే అవకాశం ఉండదని ఆయన హెచ్చరించారు. ప్రభుత్వ, ప్రజా జీవన కార్యకలాపాలలో నిమగ్నమైన వ్యక్తులకు సంబంధించిన వ్యక్తిగత సమాచారం దీనివల్ల లభ్యమయ్యే పరిస్థితులు ఉండవన్నారు. ఈ ముసుగు ఉండటంవల్ల బహిరంగ కార్యకలాపాల్లో నిమగ్నమై తప్పులు చేసే వారిని అరెస్టు చేసే అవకాశం ఉండదన్నారు. ప్రజాజీవితంలో ఉన్నవారికి వ్యక్తిగత జీవితమంటూ ఉండదన్నారు. వ్యక్తిగత సమాచారం పేరుతో ప్రజా జీవితంలో ఉన్నవారి సమాచారాన్ని ఇవ్వడం కుదరదని తిరస్కరించేందుకు అవకాశం ఉంటుందన్నారు. మన్‌మోహన్‌సింగ్ ప్రభుత్వ హయాంలో యుపిఎ ప్రభుత్వం ఎన్నో పరివర్తన పూర్వక చట్టాలను తీసుకువచ్చిందని, అందులో ఆర్‌టిఐ ఒకటి కాగా, 2006లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, 2009లో సమాచార హక్కు చట్టం, 2013లో ఆహార భద్రతా చట్టం, భూసేకరణ చట్టాలున్నాయని గుర్తుచేశారు. ఆర్‌టిఐ చట్టానికి 2019లో చేసిన సవరణలను తాను సుప్రీంకోర్టులో సవాలు చేశానని, ఆరేళ్ళ తర్వాత ఇప్పటికీ ఈ కేసు ఇంకా పెండింగ్‌లోనే ఉండిపోయిందని జైరామ్ రమేశ్ ఆవేదన వ్యక్తం చేశారు.




# 'లైట్ రీడింగ్'పై క్రాస్నాహోర్కాయ్ తిరుగుబాటు

హంగేరియన్ రచయిత లాస్లో క్రాస్నాహోర్కాయ్‌కి నోబెల్ పురస్కారం లభించడాన్ని ఒక సాంస్కృతిక ప్రకటనగా పేర్కోవచ్చు. ఈ బహుమతి ద్వారా అకాడమీ, ఈ శబ్దాల, వేగాల, టెక్నాలజీ మత్తులో మునిగిపోయిన ప్రపంచానికి, నెమ్మదిగా చదవడం కూడా అవసరమేనని ఒక సూచన చేసింది. హడావుడిగా చదివితే అర్థంకాని శైలిలో రచనలు చేస్తాడు కాబట్టి, క్రాస్నాహోర్కాయ్‌ని అర్థం చేసుకోవాలంటే ఎంతో ఓపిక అవసరం. నింపాదిగా చదవడం అనే కొత్త విప్లవానికి అతను పునాదులు వేస్తున్నాడు. నోబెల్ కమిటీ సాధారణంగా మానవ అనుభవంని విస్తృతంగా, కొత్త కోణంలో చూపిన రచయితలకు బహుమతి ఇస్తుంది. ఈ సూత్రానికి విస్తరణగానే క్రాస్నాహోర్కాయ్‌కి లభించిన గౌరవాన్ని చూడాలి. అతని రచనల్లో ఎక్కువగా మానవ సమస్యలు, పెరిగిపోతున్న అసహనం, నిరాశ, ఆత్మపరిశీలన వంటి అంశాలు ప్రముఖంగా కనిపిస్తాయి. అతని పాత్రలు, పాతబడిన సమాజాల చివరి శబ్దాలు. అయితే, నిశితంగా ఆలకిస్తే, ఆ శబ్దాలలోనే వర్తమాన కాల ప్రతిధ్వని కూడా వినిపిస్తుంది. సాహిత్యం అనేది ఆకర్షణీయమైన కథలు చెప్పడమే కాదు,, అది మన అజ్ఞానాన్ని బహిర్గతం చేయడం కూడా అని నిరూపించిన వారిలో క్రాస్నాహోర్కాయ్ ముందు వరుసలో ఉంటాడు. తూర్పు యూరోప్ సాహిత్యం చాలా కాలం పాటు పాశ్చాత్య సాహిత్య వేదికల్లో నిర్లక్ష్యానికి గురై, పక్కన పడిపోయింది. ఇప్పుడు హంగేరియన్‌కు నోబెల్ లభించడం ఆసక్తిని రేపుతున్నది. ఈ పురస్కారంతో, సమాజంలోని లోతైన నిరాశ, నిర్బంధం, దృఢమైన ఆత్మస్థితి యావత్ ప్రపంచానికి బలంగా వినిపించనున్నాయి. అతని గురించి తెలియనివారు కూడా ఇప్పుడు అన్వేషణ ప్రారంభిస్తానరడం అతిశయోక్తి ఎంతమాత్రం కాదు. ఈ నోబెల్ పురస్కారం ఆయనకు వ్యక్తిగతం కంటే, యావత్ తూర్పు ఐరోపా సాహిత్య సంప్రదాయానికి లభించిన ధ్రువపత్రంగానే పేర్కోవాలి. నేటి ప్రపంచంలో చాలా సాహిత్యం ఎక్కువగా 'చదవటానికి సులభం' అనే వ్యాపార సూత్రంపై నడుస్తోంది. క్రాస్నాహోర్కాయ్ ఆ సూత్రాన్ని ధ్వంసం చేస్తాడు. ఆయన వాక్యాలు ఆర్థికంగా లాభదాయకం కావు.. కానీ ఆత్మకు మాత్రం విలువైనవి. నోబెల్ కమిటీ నిర్ణయం ఇది 'లైట్ రీడింగ్' సంస్కృతికి ఒక దెబ్బ. ఎవరూ ఊహించని తిరుగుబాటు. మనిషి మళ్లీ ఆలోచించాలనే ఆలోచనకు ఆహ్వానం. నిరాశను సాహిత్యంగా గుర్తించడం చాలా అరుదు. కానీ, క్రాస్నాహోర్కాయ్‌కి దక్కిన గౌరవం, ఈ అభిప్రాయాన్ని మటుమాయం చేస్తుంది. ఎందుకంటే అతను ప్రపంచాన్ని ఆశావహ దృక్పథంతో చూడడు. నిరాశే అతని రచనలోని సౌందర్యం. జీవితం క్షీణిస్తున్నదనే భావన ప్రతి పేజీలో ఉంది. కానీ ఆ నిరాశలోనే అతను కవిత్వాన్ని కనుగొంటాడు. ఈ రచనా విధానం, నేటి సమాజానికి సంబంధించిన ఒక లోతైన సూచన. అభివృద్ధి, టెక్నాలజీ, సమాచార మత్తులో జోగుతున్న మనిషి లోపలి ఖాళీ అలాగే నిలిచిపోతున్నది. దానిని భర్తీ చేయడానికి సాధనాలు దాదాపుగా లేవు. అలాంటి పరిస్థితుల్లో క్రాస్నాహోర్కాయ్ రచనలు ఆధునిక సాహిత్య ప్రస్థానానికి కొత్త మార్గాన్ని చూపింది. నోబెల్ కమిటీ దీనిని గుర్తించడం ద్వారా, ప్రపంచ నిష్కపట నిరాశను సాహిత్యంగా గౌరవించింది. హంగేరీ ప్రస్తుతం రాజకీయంగా ఒడిదుడుకులను ఎదుర్కొంటున్న నేపథ్యంలో, అభిప్రాయ స్వేచ్ఛ, కళాత్మక స్వతంత్రతపై అనేక చర్చలు జరుగుతున్నాయి. అందుకే, క్రాస్నాహోర్కాయ్ రచనల్లో ఉన్న ప్రతి ఘటన, నిరాకరణ, సామాజిక క్షీణతపై సున్నిత విమర్శ మరింత ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి. ఈ బహుమతి హంగేరీ ప్రభుత్వానికి గర్వకారణం కాకపోవచ్చు, కానీ హంగేరీ సంస్కృతికి మాత్రం గౌరవ చిహ్నం. సాహిత్యానికి 'సులభంగా చదువునేదిలా ఉండాలి' లేదా 'త్వరగా పూర్తయ్యేలా ఉండాలి' అనే పరుధులు గీయడం సమంజసం కాదని నోబెల్ కమిటీ భావిస్తుందనడానికి క్రాస్నాహోర్కాయ్‌కి దక్కిన పురస్కారమే నిదర్శనం. రచనలను సులభత, వేగం, వినోదం తదితర పరిమితుల్లో బంధించకూడదన్న సూత్రాన్ని నోబెల్ కమిటీ చెప్పకనే చెప్పింది. కారణం.. క్రాస్నాహోర్కాయ్ రచన చదవడం అంటే మనసులో నెమ్మదిగా కరిగిపోవడం. అతని వాక్యాలు గజిబిజిగా ఉన్న ప్రపంచాన్ని మన ముందుంచుతాయి, కానీ అదే గజిబిజీలో మన ఆత్మ ప్రతిబింబాన్ని ఆవిష్కరిస్తాయి. అతను మానవ జాతి పతనం గురించి రాసినప్పుడు కూడా, అది నిరాశ కాదని, ఒక రకమైన ధ్యానమని వాటిని చదివినప్పుడు పాఠకుడికి అర్థమవుతుంది.



> మాన్ బుకర్ ఇంటర్నేషనల్ ప్రైజ్ (2015), 'ఫార్మెంటర్ లిటరేజర్ ప్రైజ్' వంటి పలు అవార్డులు, రివార్డులు పొందిన క్రాస్నాహోర్కాయ్ గ్రామీణ సమాజాలను ఎక్కువగా తన రచనల్లో పొందుపరిచా డు. అదే విధంగా మానవ మనస్తత్వాలను నిశితంగా పరిశీలించాడు. మనిషి బాహ్య శక్తుల ద్వారా ఎలా నియంత్రించబడుతాడో, స్వేచ్ఛా ఆశలు ఎంతటి పరిమితులవుతాయో చెప్పాడు. వ్యవస్థలు విరిగిపో తున్నట్టు, బంధాలు ధ్వంసమవుతున్నట్టు అతని రచనలు సాగుతాయి. అనిశ్చితి, విమర్శన, సామాజిక విభేదాల మధ్య జీవిస్తున్న నేటి తరానికి అతని కథలు, వాక్యాల నిర్మాణం కొత్తగా కనిపించవచ్చేమోగానీ, అందులోని అంశాలు కావు. క్రాస్నాహోర్కాయ్ రచనలు సాధారణ పాఠకులకు అవరోధంగా మారవచ్చేమోగా నీ, సాహిత్య ప్రక్రియను ఇష్టపడేవారికి మాత్రం అనంతమైన ఆనందాన్ని, అదనపు సంతృప్తిని ఇస్తా యి. భవిష్యత్తులో అతని రచనలపై భారీగా పరిశోధన లు జరగవచ్చు. సాహిత్య కోర్సుల భాగంగా మారవ చ్చు. అనువాద, సినిమాటిక్ రూపంలో దర్శనమీయవచ్చు.

న, సమాజంలో పేరుకుపోయిన అసహం, అలసిపోయిన జీవితాలు అతని రచనల్లో దర్శనమిస్తాయి. కొన్నిసార్లు ఒకదానికి ఒకటి సంబంధం లేకుండా పేజీలకు పేజీల వివరణలు కనిపిస్తాయి. ఇలాంటి లక్షణాలు ఉన్నాయి కాబట్టే చాలా మంది క్రాస్నాహోర్కాయ్‌ను పోస్ట్‌మోడర్నిస్ట్‌గా పేర్కొంటారు. అతని అత్యధిక రచనల్లో వాక్య నిర్మాణం చాలా విస్తృతంగా ఉంటుంది. ఒక వాక్యం లో అనేక ఉపవాక్యాలు, విభిన్న కాలాలు, భావాల మధ్య తేడిదనం లేకుండా మార్పులు ఉంటాయి. ఇది చదవడం కొందరికి ఆహ్లాదకరంగా ఉంటుంది. సహనం లేకుండా హడావుడిగా చదివే వారికి మాత్రం అత్యంత కష్టమైనదిగా తోస్తుంది. రచనల్లోని అంశాలు కూడా విచిత్రంగానూ, విషమంగానూ ఉంటాయి. సామాజంలో పేరుకుపోయిన నిర్లప్తత, వేళ్లూనుకుంటున్న నిరాశ, పరుగుల కాలంలో ఎదురయ్యే వైఫల్యం, ఆత్మీయులు దూరమయ్యే మానసిక సంక్షోభం, భవిష్యత్తుపై కనిపించని ఆసక్తి వంటి లక్షణాలను అతని రచనలు ప్రతిబింబిస్తాయి. అధునాతన సాంకేతిక పరిజ్ఞానం విస్తరిస్తుండగా, పుస్తకాలు చదవడం గగనంగా మారింది. అలాంటిది సంక్లిష్టమైన శైలిలో రచనలు చేసిన క్రాస్నాహోర్కాయ్ సాహసాన్ని మెచ్చుకొని తీరాలి. సాహిత్యం అంటే విజ్ఞానం పంచేదిగానో... ఆనందానుభూతులను కలిగించేదిగానో ఉండాలన్న సూత్రాలకు అతను ఏనాడూ లొంగలేదు. భావోద్వేగానికి, వాస్తవ పరిస్థితులకు మాత్రమే ప్రాధాన్యతనిచ్చాడు. 'అంతా సవ్యంగానే ఉంది' అంటూ ఆత్మవంచన చేసుకునేవారిపై నిజాల కొరడా ఝుళిపించాడు. అకాల వానల్లాగా అతని రచనలు హఠాత్తుగా వాతావరణాన్ని పూర్తిగా మార్చేస్తాయి. పాతకాలపు తత్త్వం, వాస్తవం, కవిత్వం, తర్కం వంటి లక్షణాలు అతని వాక్యాలలో కలిసిపోతాయి. ఇతర నోబెల్ విజేతలు మానవ అనుభవాన్ని క్రమబద్ధీకరించడంపై దృష్టిపెడితే, క్రాస్నాహోర్కాయ్ మాత్రం దానిని విచ్ఛిన్నం చేయడానికి ప్రాధాన్యం ఇచ్చినట్టు కనిపిస్తుంది. కానీ, లోతుగా గమనిస్తే, ఆ ప్రయత్నం వెనుక రచయిత అంతర్మథనం, సమాజం పట్ల ఉన్న ప్రేమ, ప్రస్తుత పరిస్థితులపై ఆవేదన వంటి అంశాలు అర్థమవుతాయి. క్రాస్నాహోర్కాయ్‌కి నోబెల్ బహుమతి రావడమంటే, ప్రపంచం మళ్లీ నిశ్శబ్దమైన, గాఢమైన ఆలోచనలను వినడం ప్రారంభించడమే. మానవ సహనానికి, పాఠకుడి ఓర్పుకూ, భాష యొక్క అంతులేని లోతుకీ ఇచ్చిన గౌరవమే. కాదనడానికి వీల్లేదు.

హంగేరీలోని 'గులు' అనే చిన్న పల్లెలో, 1954 జనవరి 5న జన్మించిన క్రాస్నాహోర్కాయ్‌ది విద్యావంతుల కుటుంబం. తల్లి జూలియా పలిక్కాస్ సామాజిక భద్రతా విభాగ అధికారిణి. తండ్రి గియరీ ఓ న్యాయవాది. తండ్రి అడుగుజాడల్లో నడుస్తూ తొలుత న్యాయశాస్త్రం చదివాడు. అయితే, సాహిత్యంపై మక్కువ ఉన్న కారణంగా హంగేరియన్ భాషా, సాహిత్య అధ్యయనాలు కూడా చేశాడు. చదువు పూర్తయిన తర్వాత ప్రచురణ సంస్థల్లో 'ఫ్రీలాన్సర్'గా పనిచేసాడు. అనంతరం పూర్తిగా రచయితగా మారాడు. అతని రచనలు చాలా విచిత్రంగా కనిపిస్తాయి. కొత్తవారికి ఓ పట్టాన అర్థంకావు. లోతైన తాత్విక చింతవిలీన సామాజిక వ్యవస్థలు, నిర్బంధం, అదృశ్యమైన శక్తులు నిర్మించిన అసమానతల రాతిగోడల వెనుక మగ్గిపోతున్న జీవితాలు, పెరుగుతున్న నిరాశ, బాధ, ఉదాశీనసతతో కూడిన నిజమైన ప్రపంచాన్ని పాఠకుడికి పరిచయం చేస్తాయి. ఇలాంటి విలక్షణాలు ఉన్నప్పటికీ, క్రాస్నాహోర్కాయ్ రచనలు మానవ సహనాన్ని పరీక్షిస్తాయి. ఎందుకంటే అతని వాక్యాలు, అతని లయ, అతని దృష్టి తదితరాలు సాధారణ రచయితలకన్నా భిన్నమైన ఒక నిరంతర ప్రవాహం సాగుతాయి. అతని వాక్యాలు సగటున పేజీల కొద్దీ సాగుతాయి. ఒక్క వాక్యంలోనే పది, ఇరవై ఉపవాక్యాలు కలిపి రాస్తాడు. కాగితం మీద ఆగకుండా పరుగులు తీసే ఆలోచనల శ్రేణిలా ఉంటాయి. ఈ శైలికి మూలం అతని ప్రపంచ దృష్టి. అతని కథల్లోని పాత్రలు ఎప్పుడూ నిలకడగా ఉండవు. అవి ఆలోచనల తుఫానులో తిరుగుతూనే ఉంటాయి. వాక్య నిర్మాణం కూడా అదే లయలో ఉంటుంది. 'సటాంటాగో' నవలలో ఒక్కో వాక్యం రెండు మూడు పేజీల వరకు సాగుతుంది. వాటిని చదివేసరికి పాఠకుడికి ముచ్చెమటలు పడతాయి. కానీ, ఆ కష్టంలోనే అతని శైలిలో దాగిన సౌందర్యం అర్థమవుతుంది. అతని ఆలోచనల ధారలో సమాధానాల కన్నా ప్రశ్నలే ఎక్కువ. మనిషి మనసులో జరిగే గందరగోళాన్ని నేరుగా రాయడు. బదులుగా, ఆ గందరగోళం ఎలా వాక్యాలలోకి, వాక్యాల మధ్య ఖాళీలలోకి జారిపోతుందో చూపిస్తాడు.

క్రాస్నాహోర్కాయ్ కథల్లో ఏది ప్రధాన సంఘటన అనే స్పష్టత ఉండదు. అన్ని విషయాలు సమాన ప్రాధాన్యంతో, ఒకే వేగంతో ప్రవహిస్తాయి. అతని శైలి పాఠకులను నిరంతరం ఒక అనిశ్చిత స్థితిలో ఉంచుతుంది. ఎక్కడ ప్రారంభమవుతుందో, ఎక్కడ ముగుస్తుందో తెలియని ఆలోచనల వలయంలో చిక్కుకోవడం పాఠకుల వంతు. అతని రచనల్లో వాక్యాలు తరచుగా పునరావృతమవుతాయి. అదే భావం, అదే వాక్య నిర్మాణం కొంచెం మార్పుతో తిరిగి వస్తుంది. మొదటికి ఇది విసుగుగా అనిపిస్తుంది, కానీ కొంత తర్వాత అది ఒక రకమైన మంత్రంలా మారుతుంది. వాస్తవానికి ఈ రచనా శైలి మానవ ఆలోచనల చక్రాన్ని ప్రతిబింబిస్తుంది. మనిషి ఒకే ఆలోచన చుట్టూ ఎలా తిరుగుతుంటాడో, అతని పాత్రలు కూడా అదే విధంగా ఒకే స్వభావాన్ని వ్యక్తీకరిస్తుంటాయి. భాష విషయానికి వస్తే, క్రాస్నాహోర్కాయ్ భాష సజావుగా ఉండదు. ప్రారంభంలో పాఠకుడిని ఏమాత్రం ఆకట్టుకోదు. వాక్యాల నడక మందగిస్తుంది. పాఠకుడి ఊపిరి కూడా ఓ లయగా మారుతుంది. వాక్యాలు మనలో ఓపికను, ఏకాగ్రతను కోరుకుంటాయి. చదువుతున్న కొద్దీ వస్తువులు, గాలి, కాంతి, వర్షం, మట్టి, పశువులు, రోడ్లపై బురద... ఇలా ప్రతిదీ అతని వాక్యాలలో జీవం పొందిన విషయాన్ని పాఠకుడు గ్రహిస్తాడు. వాటిలోని భావ సౌందర్యం, వాస్తవాల ప్రతిబింబాలు అర్థమవుతాయి. అప్పుడే పాఠకుడికి ఏదో ఒక అజ్ఞాత దార్శనికుడితో సంభాషణ జరుగుతున్న భావన కలుగుతుంది. క్రాస్నాహోర్కాయ్ వర్ణన ఒక చలనచిత్ర దర్శకుడు వివరించే దృశ్యంలా ఉంటుంది. ప్రతి అంశాన్ని నిదానంగా, సున్నితంగా వివరిస్తాడు. సమాజం క్షీణిస్తోంది, ఆశలు తరిగిపోతున్నాయి, విలువలు చెదిరిపోతున్నాయి అనే భావం అతని రచనల్లో కనిపిస్తుంది. మనుషుల జీవితాలు నిరాశతో నిండిపోయి ఉంటాయని అతను పదే పదే గుర్తుచేస్తాడు. ఆ కోణంలో జాగ్రత్తగా చూస్తే, నిరాశాజనకమైన ఆ చీకటిలో కూడా ఒక సౌందర్యం అలరిస్తుంది. అది ఒక వికారమైన అందం కావచ్చు. కానీ, మనిషి చివరికి పతనం అవుతున్నాడనే సత్యాన్ని ప్రశాంతంగా అంగీకరించే అందం. క్రాస్నాహోర్కాయ్ రచనల్లో కాలం నేరుగా కదలదు. భూతం, వర్తమానం, భవిష్యత్తు అన్నీ ఒకేసారి ఉన్నట్టుగా అనిపిస్తాయి. స్థలం కూడా అస్పష్టంగా ఉంటుంది. అది ఒక గ్రామమా, ఒక దేశమా, లేక మనస్సు లోపలున్న భ్రమా అనేది చెప్పడం కష్టం. ఈ అస్పష్టతే అతని రచనలకు ఒక మాయాజాల భావనా లేపనాన్ని అద్దుతుంది. మనసును తడిపే నిరాడంబరతే అతని భాషాగమ్యం. క్రాస్నాహోర్కాయ్ అద్భుతమైన వాక్యాలు రాస్తాడుగానీ అవి అలంకారప్రియమైనవి కావు. పెద్ద పదజాలం, అతి శబ్దం, ఆర్భాటం అతనికి ఇష్టం ఉండదు. అతని భాష సున్నితమైనదైనప్పటికీ, గట్టి భావాన్ని కలిగిస్తుంది. అది ఒక విషాద సంగీతంలా ఉంటుంది. చదివే వారికి కొంచెం బాధ.. కొంచెం ప్రశాంతత. స్థూలంగా చెప్పాలంటే, క్రాస్నాహోర్కాయ్ రచన శైలి నిరంతర ప్రవాహం. మానవ దౌర్భాగ్యంపై కురిపించే భావోద్వేగం. ధ్యానంలా అనుభూతి కలిగించే సెలయేటి ప్రవాహం. అతని రచన చదవడం అనేది కథను అనుసరించడంకాదు.. మనసును ఒక అంధకార గుహలోకి తీసుకెళ్లి, అక్కడ మన సొంత ప్రతిబింబాన్ని చూపించే అనుభవాన్ని పొంద డం. క్రాస్నాహోర్కాయ్ వాక్యాల మెలకువలో మునిగిపోయే పాఠకుడు తన ఆలోచనల ఆవరణ నుంచి బయటకు రావడం కష్టం. కానీ అక్కడే అతని మాయ ఉంది. వాక్యాల పొడవు మనలను తిప్పేస్తుంది, కానీ ఆతిరుగులోనే మనం ప్రపంచాన్ని కొంచెం కొత్తగా చూడటం నేర్చుకుంటాడు. అతని భాష.. భావం.. అనుభూతి చాలా విలక్షణమైనవి. ఆ ప్రత్యేక సాహిత్యానికి అనువైన గౌరవం దక్కడం సముచితం.

– సత్యశ్రీ

## కాలాతీత రచన

(అక్టోబర్ 14న జాలాది వర్ధంతి)

జాలాదిగా అభిమానులకు సుపరచితుడైన జాలాది రాజారావు పేరు వినగానే జానపద సాహిత్యం గుర్తుకొస్తుంది. సినిమా పాటల్లోనూ జానపద తత్వాన్ని, విశిష్టను జోడించిన ఘనత జాలాదికి దక్కుతుంది. కొసరాజు మాదిరే జాలాది కూడా జనపాదలకు.. జానపదుల కు ప్రాధాన్యం ఇచ్చాడు. 'ప్రాణం ఖరీదు' సినిమా కోసం జాలాది రాసిన 'యాతమేసి తోడినా ఏరు ఎండదు' పాట అతని కీర్తిని చిరస్థాయిగా నిలిపింది. కాలాతీత రచనగా పేర్కొనదగిన పాట ఇది..

**'యాతమేసి తోడినా ఏరు ఎండదు**
**పొగిలి పొగిలి ఏడ్సినా పొంత నిండదూ**
**దేవుడి గుడిలోదైనా పూరి గుడిశ లోదైనా**
**గాలి ఇసిరి కొడితే... ఆ దీపముండదు**' అంటూ జీవిత సత్యాలను వివరిస్తాడు రచయిత. సన్నివేశ పరంగా పాత్రల కష్టాలను, అక్కడ నెలకొన్న పరిస్థితులను వివరించేదిగా ఉన్నప్పటికీ, వాస్తవ జీవితంలోనూ దీనిని అన్వయించుకోవచ్చు. మహిళల దుస్థితిని చూసినప్పుడు అతనిలో ఆర్తి తర్వాతి చరణాల్లో దర్శనమిస్తుంది.

**'పలుపు తాడు మెడకేస్తే పాడి ఆవురా...**
**పసుపు తాడు ముడులేస్తే ఆడదాయె రా...**
**కుడితి నీళ్ళు పోసినా...అది పాలు కుడుపుతాదీ...**
**కడుపు కోత కోసినా...అది మనిషికే జన్మ ఇత్తాదీ'**

అంటాడు. అంతేకాదు..

**'బొడ్డు పేగు తెగిపడ్డా రోజు తలుసుకో...**
**గొడ్డు కాదు ఆడదనే నిజం తెలుసుకో'** అంటూ మహిలలను బానిసలుగా, ఆట బొమ్మలుగా చూసే వారి చంప ఛళ్లుమనిపిస్తాడు. అదే సమయంలో..



**'అందరూ నడిసొచ్చిన తోవ ఒక్కటే**
**సీము నెత్తురులు పారే తూము ఒక్కటే**
**మేడ మిద్దెలో ఉన్నా... సెట్టునీడ తొంగున్నా**
**నిదర ముదర పడినాకా...**
**పాడె ఒక్కటే వల్లకాడు ఒక్కటే'** అంటూ సర్వమానవ సమానత్వాన్ని కూడా అద్భుతంగా ఆవిష్కరిస్తాడు. ఈ క్రమంలోనే, సమాజంలో నెలకొన్న వర్గ బేధాలను సైతం విడిచిపెట్టలేదు.

**'కూత నేర్సినోడీ కులం కోకిలంట రా..**
**ఆకలేసి అరిసినోళ్ళు కాకులంట రా'** అని ఒక్క సూక్ష్మంగానే, విశ్వమంత విస్తారమైన, నమ్మదాకి మనం ఇష్టపడని అత్యంత నిష్ఠూరమైన నిజాన్ని వివరిస్తాడు. జాలాదిని ఒక శ్రీశ్రీ... ఒక ఆరుద్ర సరసన నిలబెట్టడానికి ఈ పంక్తులు చాలు.


## చదవాల్సిన పుస్తకం

### చారిత్రక నవలా సాహిత్యాన్ని మలుపుతిప్పిన 'ఛంఘిజ్‌ఖాన్'




అక్టోబర్ 16 తెన్నేటి సూరి వర్ధంతి

తెన్నేటి సూరి తలచుకుంటే 'ఛంఘిజ్‌ఖాన్' నవల గుర్తుకొస్తుంది. ఆ పేరుకు మారుపేరుగా నిలుస్తాడు సూరి. ఆయన పండితుడు.. విద్వాంసుడు, అభ్యుదయ రచయిత, కథారచయిత, నవలాకారుడు, నాటకకర్త.. ఒక్క మాటలో చెప్పాలంటే బహుముఖంగా విస్తరించిన ప్రజ్ఞ అతనిది. 'ఛంఘిజ్‌ఖాన్' నవల ఆయనలోని సాహితీకారుడిని, పరిశోధకుడిని పరిచయం చేస్తుంది. ఈ నవల 13వ శతాబ్దం మంగోల్ సామ్రాజ్య నేపథ్యంలో సాగుతుంది. ఈ నవలలో ఛంఘిజ్‌ఖాన్‌ను ఆసియా ఖండ చరిత్రలో గొప్ప విజయవంతుడిగాను, పరిపాలనా శక్తిరీత్యా, రాజకీయ నేర్పరి, నేర్పరి యోధుడిగా చిత్రీకరించాడు. ఛంఘిజ్‌ఖాన్ వ్యక్తిత్వాన్ని, ఆయన నాయకత్వ లక్షణాలను, రెండు పెద్ద సామ్రాజ్యాల మధ్య వచ్చే ఘర్షణలు, వ్యూహాలు, సామాజికరాజకీయ ప్రభావాలను వివరించడంలో తెన్నేటి సూరి అసాధారణ ప్రతిభ కనబరిచారు. స్వయం పరిశోధనతోపాటు, పాశ్చాత్య గ్రంథాల నుంచి ఆధారాలు కూడా సేకరించి, ప్రాచ్య చారిత్రక ఆధారలను పరిశీలించి, కథను సమర్థంగా నడిపించాడు. కథానాయకుడి రాజకీయాధికారం, ఆయుధశక్తి, సమర్థనాయకత్వం, ఆదరణ, ప్రేమ తదితర మానవీయ కోణాలను లోతుగా వివరించాడు. ఇందులో చారిత్రక అంశాలను, ప్రామాణిక ఆధారాలను అద్భుతంగా మేళవిస్తూ, గత శతాబ్దాలలో జరిగిన సంఘటనలను, సామాజిక రాజకీయ మార్పులను ప్రతిబింబించే కథనం ఉంది. రచయిత పాత్రల చిత్రణ, మాటల తీరు, కథాకాలం ప్రకారం సంస్కృతి, సంప్రదాయాలు, యుద్ధ వ్యూహాలు, సామాజిక పరిణామాలు వంటి అంశాలన్నీ నవలలో ఆవిష్కృతమవుతాయి. ఈ నవల తెలుగు చారిత్రక నవలా సాహిత్యంలో పెను సంచలనం సృష్టించింది. ఛంఘిజ్‌ఖాన్ పాత్రను పరిశోధనా ధోరణితో, కళాత్మకతతో మిళితం చేసి, చరిత్రను కథగా పరస్పరంగా మిళితం చేశాడు. కథనం ప్రకారం, పాఠకుడు మంగోల్ సామ్రాజ్య యువరాజు కంటే, సమకాలీన సమాజ మార్పును, ఆధునిక యుద్ధ వ్యూహాలను, రాజ్యంలోని వ్యక్తిగతసామాజిక లక్షణాలను లోతుగా పరిశీలించగలుగుతాడు. సూరి నిశిత పరిశోధనా పటిమ, చారిత్రక విజ్ఞానం, సంప్రదాయక వైవిధ్యం స్పష్టంగా ఈ నవలలో స్పష్టమవుతుంది. చంఘిజ్ఖాన్ వంటి చారిత్రక నవలలో పాశ్చాత్య, ప్రాచ్య, ప్రామాణిక గ్రంథాల అధ్యయనంతో యథార్థతను రచయిత నిక్షిప్తం చేసిన విధానం అనన్య సామాన్యం. చరిత్రను కేవలం వివరించడమే కాకుండా, పాత్రలకు జీవాన్ని చేకూరుస్తూ, రాజకీయ సందర్భాల తుది తాత్త్వికాంశాల వరకూ రచయిత చొచ్చుకుపోతాడు. ఇది చారిత్రక నవల అయినప్పటికీ, సామాన్య పాఠకులకు సైతం అర్థమయ్యే ప్రకృతి, లక్షణాలు కనిపిస్తాయి. సందర్భానుసారంగా గంభీరమైన, అలంకారికమైన వాక్య నిర్మాణం, యుద్ధ, వ్యవస్థాపన, సామాజిక సంక్లిష్టతల చిత్రణలో నైపుణ్యం సమ్మిళితమై ఉంటాయి. పాత్రలు మాట్లాడే పద్ధతి, వారి భావోద్వేగాల విశ్లేషణలో కూడా హృదయాన్ని హత్తుకునే శైలిని అనుసరించారు. ముఖ్యంగా ఆయన వచనంలోని స్వచ్ఛందత, సంఘటనల వర్ణన పాఠకులను ఆకట్టుకుంటుంది. అధ్యయనపరమైన వివరాలు, కథాగతంలోని సోపానవిధానం, కళాత్మకత, సామాజికమైన మానవీయ స్పర్శ, వివిధ ప్రయోగాలు ఈ నవలలో పలుకరిస్తాయి. 'ఛంఘిజ్‌ఖాన్' చదువరులకు గంభీరమైన పాత్రల పరిచయం, యుద్ధ వ్యూహాలు, మానవీయ సంక్షోభాలను వివరిస్తూ, కొన్ని చోట్ల ఆద్యంతం సోపానవిధానాన్ని, మరి కొన్ని సందర్భాల్లో సంఘటిత సంఘటనలను పేర్కొంటూ కథనాన్ని నడిపిస్తాడు సూరి. చరిత్రను నూతన పంథా లో మలచే క్రమంలో, కథలోని త రచూ మారేవారి పాత్రలు, రాజకీయ వ్యూహం, విషా దం, మానవీయ విలయాన్ని కూడా చూపిస్తాడు. ఛంఘిజ్‌ఖాన్ నవలలో శైలి చారిత్రక నవలా ప్రక్రియకు అనువుగా ఉంటుంది. నవలల్లో కథ, పాత్ర లు, సంఘటనలు వాస్తవికత, ఊహ ఆధారంగా నడుస్తాయి. ఆ సంవిధానంలో రచయిత సందర్భానికి అనుగుణంగా తన రచనా శైలిని మార్చడం ఈ నవలకు కొత్త అందాన్ని తెచ్చింది. ఎన్నో ప్రత్యేకతలను సంతరించుకున్న ఛంఘిజ్‌ఖాన్ నవలను తప్పక చదవాల్సిన పుస్తకాల జాబితాలో చేర్చింది.




### నవల పేరు

ఛంఘిజ్‌ఖాన్
రచన: తెన్నేటి సూరి
వెల: రూ. 300

ప్రతులకు: నవచేతన పబ్లిషింగ్ హౌస్ గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్) జీఎస్ఐ (పోస్ట్), హైదరాబాద్: 500068. (నవచేతన బుక్ హౌస్ అబిడ్స్, సుల్తాన్ బజార్, బండ్లగూడ (నాగోల్) హైదరాబాద్, హన్మకొండ, కరీంనగర్, నల్లగొండ, ఖమ్మం శాఖల్లోనూ లభిస్తుంది).

## బర్రె తల్లీ...!

బర్రె తల్లీ...! నీది ఆకాశానిది
బొడ్డు పేగుబంధమేమో
ఎల్లకాలం మందికోసమే మీ తనువు తండ్లాటంతా
నీది తల్లి మనససొంటి మనసు
ఏనాడు ఆకలని నీ కాడికొచ్చినా
లేదనకుంటా నీలోపల ఎంతుంటే అంత
పాలిచ్చి తొలినావ్

నీ పిల్ల మూతి గట్టి పాలన్నీ దోసుకున్నా
ఏనాడు నోరు తెరిచి పల్లెత్తు మాటనలే
కట్టమచ్చి నీ బిడ్డనమ్ముకున్న
కంట నీరు తీసి ఊకున్నవ్ గాని
కసిరిచ్చి దూరంబెట్టలే బర్రె తల్లి

నీవు మా బహుజన గూడెపు చిన్నమ్మవు
మమ్ములెత్తుకుని సాదలేగావచ్చు గానీ
నీ పాలిచ్చి పెద్ద చేసినవ్
అమ్మ పాలకంటే నీ పాలుతాగి పెరిగిందే ఎక్కువ
నీకు గడ్డి పెట్టిన్నో, గరకపెట్టిన్నో
కుడిది బోసిన్నో, కుండల నీళ్లు పోసిన్నో
ఎండకెండి,వానకు తడిసి, సలికి వణికినా

లోపలేమనుకున్నవో ఎరుకలే గానీ
తెల్లారగట్లా నాయినొచ్చి నీ పొదుగు పట్టుకుంటే చాలు



పట పటానీ మమతల పాలన్నీ ఒలుకబోత్తువు తల్లీ...
కామధేనువు కామధేనువు అంటే కథలల్ల ఇన్నదే కానీ
మా బతుకుల్ల అదేనాడు లేదు మా బతుకుల్ల ఇంత
సళ్ళబొట్టేసే నీవే అసలైన కామధేనువు

నీకు నాగలి కడితే మా భూములంతా దున్ని
సేద చేసినవ్ నువు సచ్చినా నా కాలి చెప్పువైనవ్,
నా గుండె డప్పైనవ్ ఇప్పుడు చెప్పు నీవు కదా!
కామధేనువంటే...
నీ రంగు రూపు గెలిచేసేటోళ్ల మెడలు వంచాలంటే
నీ కొమ్ములు తెచ్చి ఈ ఇండియా గేట్ మీద
అలంకరించాలిప్పుడు! నీ రంగును గేలి చేసే జాతికి
తెలిసేలా ఈ దేశానికి నీ తోలు కప్పి ఊరేగింపు
చెయ్యాలి తల్లీ...
ఈ దేశపు మూలవాసుల అసలు రూపు నీవు
నిన్నీదేశ అధికార చిహ్నంగా ప్రకటించాలిపుడు!!

– దిలీప్ వనపాకాల

## బహుముఖ ప్రజ్ఞ 'విశ్వనాథుడి' సొంతం

(అక్టోబర్ 18 విశ్వనాథ వర్ధంతి)



తెలుగు సాహితీ వనాన్ని సుసంపన్నం చేసిన రచయితలు చాలా మందే ఉంటారు. కానీ, దాదాపు అన్ని రకాల సాహితీ ప్రక్రియలు చేసిన వారు చాలా అరుదు. అలాంటి అరుదైన సాహితీవేత్తల్లో అగ్రగణ్యుడు విశ్వనాథ సత్యనారాయణ. 1891 సెప్టెంబర్ 10న జన్మించి, 1976 అక్టోబర్ 18న తుదిశ్వాస విడిచిన విశ్వనాథ అసాధారణ ప్రతిభావంతుడు. రామాయణ కల్పవృక్షం (జ్ఞానపీఠ అవార్డు పొందిన రచన) వంటి గ్రంథాల నుంచి కిన్నెరసాని పాటల వరకూ ఆయన చేపట్టని ప్రక్రియ లేదు. 1916 లో 'విశ్వేశ్వర శతకము'తో ప్రారంభమైన విశ్వనాథ రచనా ప్రస్థానం, అనంత గంగా ఝరిలో పరుగులు తీసింది. 25 పైచిలుకు కావ్యాలు, 6 శతకాలు, 13 గేయకావ్యాలు, 15 నాటకాలు, 58 నవలలు, 10 సంస్కృత నాటకాలు, 10 విమర్శన గ్రంథాలు, మరెన్నో వ్యాసాలు, ఉపన్యాసాలు... ఇలా ఎన్నో రచనలు ఆయనను విలక్షణ సాహితీకారుడిగా నిలిపాయి. ఆయన రచనలను కొన్ని ఇతర భాషలలోకి అనువాదమయ్యాయి. 1920 నాటికే తెలుగులో ప్రసిద్ధ కవిగా గుర్తింపు తెచ్చుకున్న విశ్వనాథ 1961లో కరీంనగర్ ప్రభుత్వ కళాశాలలో ప్రిన్సిపాలుగా పదవీ విరమణ చేసిన తరువాత పూర్తి స్థాయిలో తన సమయాన్ని సాహితీ వ్యాసాంగానికి కేటాయించారు. ప్రముఖ బెంగాలీకవి రవీంద్రనాథ్ ఠాగూర్ మాదిరి తన రచనలను కొన్నింటినైనా ఆంగ్లంలోకి తర్జుమా చేసుకొంటే, అతను అంతర్జాతీయ ఖ్యాతినార్జించి ఉండేవాడని అతను అభిమానులు అంటుంటారు. అయితే విశ్వనాథ రచనలను విశ్లేషించే విమర్శకుడు అతను తాత్విక స్థాయిని అర్థం చేసుకొంటేగాని సహేతుకమైన అనువాదం సృష్టించడం సాధ్యం కాదు. విశ్వనాథ రచనలలో అతని పాండిత్యమే కాక, రచనా శిల్పం, పాత్ర చిత్రణ, చారిత్రక అవగాహన అద్భుతంగా కనిపిస్తుంటాయి. తమిళనాడులోని మదురై ప్రాంతం నేపథ్యంలో వచ్చిన నవల 'ఏకవీర' నవలను పుట్టపర్తి నారాయణాచార్యులు మళయాళంలోనికి, అంబటిపూటి హనుమయ్య తమిళంలోనికి అనువదించారు. ఎన్‌టి రామారావు నాయకుడిగా వచ్చిన 'ఏకవీర' సినిమాకు డాక్టర్ సి. నారాయణరెడ్డి మాటలు, పాటలు సమకూర్చాడు. 'వేయిపడగలు' నవలను భారత మాజీ ప్రధాని పివి నరసింహారావు 'సహస్రఫణ్' పేరుతో హిందీలోకి అనువదించారు. భారత దేశ చరిత్రను వివరిస్తూ ఆయన 'పురాణవైర గ్రంథమాల' కింద 12 నవలలు రాశారు. ప్రతి నవలా ఉత్సుకతతో నిండిన కథ, అనితరమైన అతను శైలి, విశేషమైన పాత్రలతో పాఠకులను ఆకట్టుకొంటాయి. విశిష్టమైన రచయితగా పేరు సంపాదించుకున్న విశ్వనాథను ఎన్నో అవార్డులు, పురస్కారాలు వరించాయి. ఆయనకు గుడివాడలో గజారోహణ సన్మానం జరిగింది. 'వేయిపడగలు' నవలకు ఆంధ్ర విశ్వకళాపరిషత్తు బహుమతి లభించింది. 935 డిసెంబరు 20న బందరు పౌర సన్మానంలో ఆయనకు 'కవిసమ్రాట్' బిరుదు లనించింది. .1956 లో విజయవాడ, గుడివాడ, కరీంనగర్ లలో సాహితీప్రియులు ఆయనకు షష్టి పూర్తి సన్మానం చేసారు. 1957 లో ఢిల్లీ ఆంధ్ర సంఘం సన్మానం, పురస్కారం లభించాయి. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ ఉపాధ్యక్షుడిగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసన మండలి సభ్యుడిగా విశ్వనాథ సేవలు అందించాడు. 1963లో కలకత్తా వంగ సాహిత్య పరిషత్తు కిరీటం పెట్టి సత్కరించింది. 1965లో ఆంధ్ర విశ్వ కళాపరిషత్ 'కళాప్రపూర్ణ' బిరుదుతో సన్మానించింది. ఇలా ఎన్నో సన్మానాలు, పురస్కారాలు, బిరుదులు అందుకున్న విశ్వనాథ ప్రత్యేక తపాలా బిళ్లను 2017 ఏప్రిల్‌లో విడుదలైంది. సాహిత్యంలో ఉన్న దాదాపు అన్ని విభాగాల్లోనూ రచనలు చేసిన ఏకైక వ్యక్తిగా విశ్వనాథ చిరంజీవిగా నిలిచిపోతాడు.

## వైరాలో ఆగని రేషన్ బియ్యం దందా

**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీలో రేషన్ బియ్యం దందాకి హద్దు అదుపు లేకుండా పోయింది. ఈ దందాలో మమ్మల్ని ఆపేది ఎవడు మమ్మల్ని అడ్డుకునేది ఎవడు అనే రేషన్ బియ్యం దాన్ మాటలు ఇప్పుడు వైరాలో హాట్ టాపిక్‌గా మారాయి. మమ్మల్ని ఏమి చేయలేదు అని డాన్ జోరుగా ప్రచారం చేస్తున్నట్లు సమాచారం. అసలు ఆ రేషన్ డాన్‌కి ఎవరు అండగా ఉన్న ఆ అధికారులు, ఆ అధికారుల పేరును పదేపదే ఆ రేషన్ బియ్యం వ్యాపారి ఎందుకు చెబుతున్నారు. ఏదైనా విషయం జరిగిన వెంటనే ఆ కార్యాలయానికి పోయి ఎవరిని కలుస్తున్నాడు. దీని వెనుక నుండి నడిపిస్తుంది ఎవరు? అనేది కూడా ఇప్పుడు ఆలోచించంఆల్సిన అవసరం చాలా ఉంది. రేషన్ షాపుల క్యాంప్‌కి తరలిస్తున్నారు. గత మూడు రోజుల క్రితం రెవిన్యూ అధికారులు అక్రమ రేషన్ బియ్యాన్ని పట్టుకొని తహశీల్దార్ కార్యాలయానికి తీసుకుపోయిన పది నిముషాలకే బయటికి వచ్చి మరల రేషన్ షాపు వద్ద హాల్‌చల్ చేశాడు. దీంతో ఆ షాపు నిర్వాహకులు ఏమిటి పట్టుకున్న పది నిముషాలకు వచ్చాడు. అతను మళ్లీ రేషన్ షాపు ముందుకు రావడంతో సివిల్‌సప్లై అధికారులకు ఫిర్యాదు చేయడం జరిగింది. ఇప్పటికైనా అధికారులు అక్రమ రేషన్ వ్యాపారికి అడ్డుకట్ట వేస్తారు? అండగా నిలబడతారా అని వేచిచూడాల్సిందే.

## మండలంలో సిఎస్‌సి ఉచిత ఆరోగ్య పరీక్షలు

**ప్రజాపక్షం/కూసుమంచి:** మండలంలోని ముత్యాలగూడెం, చేగొమ్మ గ్రామాలలో సిఎస్‌సి(కామన్ హెల్త్ సర్వీస్ సెంటర్) హెల్త్ కేర్ ఆధ్వర్యంలో శని, ఆదివారాలలో లేబర్ కార్డు ఇన్సూరెన్స్ కలిగిన వారికి 25వేల రూపాయల విలువ చేసే ఆరోగ్య పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తున్నారు. ఈ ఆరోగ్య పరీక్షల్లో 58 రకాల ఆరోగ్య పరీక్షలు మూడు నెలల వరకు ఉపయోగపడే విధంగా ఉంటాయని ప్రతి సంవత్సరానికి ఒక సారి నిర్వహించే ఈ వైద్య పరీక్షలను గ్రామీణ ప్రాంతాల్లో నిరుపేదలకు అత్యవసరంగా ఈ పరీక్షల ఫలితాలలో క్యాన్సర్, ఎయిడ్స్ మొదలైన జబ్బులు ఉంటే వారిని వెంటనే గుర్తించి వారికి తగిన చికిత్స చేసే విధంగా సిఎస్‌సి వైద్య పరీక్షలు తోడ్పడుతుందని బాధ్యులు తెలిపారు. ఆన్లైన్‌లో నిర్వహించి సమాచారం అందించడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. సిఎస్‌సి క్యాంప్ కోఆర్డినేటర్ అశోక్, సభ్యులు సాయి తేజ, శ్రీలత, జిలాని, రాజు, మణికంఠ, గణేష్ పాల్గొన్నారు.


## బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** ఇటీవల మృతి చెందిన పలు కుటుంబాలకు రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆర్థిక సహాయం ను పార్టీ నాయకులు అందించారు. మండలంలోని కొత్తకొత్తూరు గ్రామంలో ఇటీవల మృతి చెందిన పలు కుటుంబాలకు రూ.10 వేల చొప్పున ఆర్థిక సహాయం ను ఆదివారం అందించారు. ఈ సందర్భంగా కొత్తకొత్తూరు మాజీ సర్పంచ్ వల్లాల రాధాకృష్ణ మాట్లాడారు. మృతుల కుటుంబాలకు మంత్రి శ్రీనివాసరెడ్డి, మార్కెట్ కమిటి చైర్మన్ వెన్నపూసల సీతారాములు ఆదేశాలు మేరకు ఆర్థిక .సహాయం ను అందించినట్లు తెలిపారు. బాధితులకు మంత్రి శ్రీనివాసరెడ్డి అండగా నిలుస్తున్నారని అన్నారు. ప్రతీ పేదవాడికి అన్నిసంక్షేమ పథకాలు అందించటంతో పాటు, ట్రస్టు ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులు బొల్లగాని వెంకటరామారావు, రావెళ్ల జ్యోతిబస్సు, విజయ్కుమార్, రాగూర్ రాంసింగ్, నీలం నాగేశ్వరరావు, చెరుకూరి సురేష్, కంకణాల శివాజీ, వత్సవాయి సైదులు పాల్గొన్నారు.

## మంత్రి పొంగులేటిని కలిసిన కాంగ్రెస్ నాయకులు

### ఎన్ఎండిసి పునరుద్ధరణకు కృషి



**ప్రజాపక్షం/పాల్వంచ :** పాల్వంచలోని ఎన్ఎండిసి కర్మాగారం పునరుద్ధరణకు కృషి చేస్తానని రెవిన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హామీ ఇచ్చారు. పాల్వంచ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జాలె జానకిరెడ్డి ఆధ్వర్యంలో ఖమ్మంలోని పొంగులేటి క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు మంత్రి శ్రీనివాస్‌రెడ్డిని ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా పలు సమస్యలపై వినతి పత్రం అందజేశారు. 450 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఎన్ఎండిసి కర్మాగారం ఖాయిలా పడటంతో ఉపాధి అవకాశాలు కోల్పోతున్నారని, వెంటనే ప్లాంటును అభివృద్ధి పరచాలని కోరారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ పాల్వంచను పారిశ్రామిక ప్రాంతంగా అభివృద్ధి చేయటానికి తన వంతుగా ప్రయత్నం చేస్తామని అన్నారు. ఎన్ఎండిసి ప్రతినిధులతో మాట్లాడి దాని పునరుద్ధరణకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి ఎర్రంశెట్టి ముత్తయ్య, బానోత్ రాము నాయక్, సక్రు నాయక్, రవి నాయక్ పాల్గొన్నారు.

## నిబద్ధత గల కమ్యునిస్టు వెంకట్రావమ్మ

**ప్రజాపక్షం/చింతకాని :** బ్రతికినంత కాలం నిబద్దత గల కమ్యునిస్టు గా అయ్యదేవర వెంకట్రావమ్మ బ్రతికిందని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి పేర్కొన్నారు. సీపీఐ సినియర్ కార్యకర్త అమరజీవి అయ్యదేవర వెంకట్రావమ్మ(95) ఆదివారం తెల్లవారుజామున మృతిచెందింది. విషయం తెలుసుకున్న సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి కొదుమూరు చేరుకుని వెంకట్రావమ్మ మృతదేహంపై పార్టీ జెండా ఉంచి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జమ్ముల మాట్లాడుతూ కమ్యునిస్టు పార్టీ కోసం వీరమరణం పొందిన అయ్యదేవర పుల్లయ్య మాతృమూర్తి వెంకట్రావమ్మ కావడం గర్వకారణమన్నారు. తనతో పాటు కుమారులందరినీ కమ్యునిస్టు పార్టీ నిబద్దత గల కార్యకర్తలుగా తీర్చిదిద్దడం గొప్పతనమన్నారు. నివాళులర్పించిన వారిలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు కూచిపుడి రవి, జిల్లా సమితి సభ్యులు నారపోగు హేమ నాగార్జున, మాజీ సర్పంచ్ నక్కనబోయిన సుజాత కృష్ణ, శాఖ కార్యదర్శి నీరుడు గోవిందరావు, మాజీ కార్యదర్శి చిట్టిమెదు కొండలరావు,నాయకులు బోయిన రవి, నక్కనబోయిన లింగయ్య, నారపోగు శ్రీను, కుటుంబ సభ్యులు అయ్యదేవర ఎర్రయ్య, రవి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## దవాఖానాలో శుభ్రత ఎక్కడ?



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డు గండగలపాడులోని పల్లె ప్రాంగణం అస్తవ్యస్తంగా ఉంది. ఈ పల్లె దవాఖానాలో వైద్యులు ఆరోగ్య సేవలు అందిస్తున్నారు అందే నమ్మశక్యం కాని విధంగా ఉంది. హాస్పిటల్‌కి వచ్చిన వైద్యులు హాస్పిటల్ పరిస్థితిని కూడా పట్టించుకోవాలి కదా..రోగాల నివారణ కోసం పెట్టిన పల్లె దవాఖానాకి వస్తే రోగాలు వచ్చేటట్లు కనిపిస్తూ ఉంది. రాష్ట్ర ప్రభుత్వం వ్యాధుల నిర్మాణం కోసం పరిసరాల పరిశుభ్రత కోసం ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని చేపడుతూ ఉంటే దానికి విరుద్ధంగా గండగలపాడు పల్లె దవాఖానాలో ఎలాంటి ఫ్రైడే డ్రైడే చేపట్టడం లేదని అర్థమవుతుంది. జిల్లా వైద్యులు ఒక్కసారి గండగలపాడు పల్లె దవాఖానాపై దృష్టి సారించి ప్రజలకు పారిశుద్ధ్యం ద్వారా వ్యాధులు సంభవించకుండా దవాఖానా ప్రాంగణం మొత్తం శుభ్రపరిచి ఆసుపత్రికి వచ్చే రోగులకు ఆరోగ్య వాతావరణం కల్పించే విధంగా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

## ఓట్ చోరీపై సంతకాల సేకరణ



**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఏఐసిసి, టిపిసిసి పిలుపులో భాగంగా ఖమ్మం నగరంలో ఓట్ చోరీపై ఆదివారం సంతకాల సేకరణ చేపట్టారు. ఖమ్మం టూటౌన్ పరిధిలోని 50, 51, 52, 58 డివిజన్లలో సంతకాల సేకరణ కార్యక్రమం జరిగింది. కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు తుమ్మల యుగంధర్ మన ఓట్లను చోరీ చేసి బిజెపి దేశంలో పాలన సాగిస్తుందని ఆరోపించారు. ఓట్ల చోరీని తిప్పికొట్టేందుకు దేశ వ్యాప్తంగా సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టినట్లు యుగంధర్ తెలిపారు. భవిష్యత్తులో బిజెపి రాజకీయాలను ఎండగట్టాలని ఆయన పిలుపునిచ్చారు. స్థానిక కార్పొరేటర్ రాపర్తి శరత్, టూటౌన్ ఇంచార్జి శెట్టి రంగారావు, సిహెచ్ విప్లవ్, సోమిరెడ్డి ఉపేందర్ రెడ్డి, నల్లమల వేణు, బేబి, సుధాకర్, గద్దం వెంకటయ్య పాల్గొన్నారు.

# అభివృద్ధి, సంక్షేమమే సర్కారు ఎజెండా

### మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** పేద ప్రజల అభివృద్ధి, సంక్షేమమే ఎజెండాగా ప్రజా ప్రభుత్వ పాలన కొనసాగుతుందని, రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచారశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఏదులాపురంమున్సిపాలిటీలో కలెక్టర్ అనుదీప్ దూరిశెట్టితో కలిసి విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా చిన్న వెంకటగిరి నుంచి ఖమ్మంకోదాడ ఆర్అండ్‌బిరోడ్డు వయా జిప్లస్2 కాలనీవరకు ప్రతిపాదించిన బీటీరోడ్డు నిర్మాణనులకు కోటి71లక్షలతో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ప్రజా దీవెనలతో ఏర్పడ్డ ఇందరమ్మ ప్రభుత్వం హయాంలో ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలో కోటి53లక్షలతో అంతర్గత సిసిరోడ్లు, 2కోట్ల65లక్షల రూపాయతలో మినీ స్టేడియం నిర్మిస్తున్నామన్నారు. అలాగే మంచి నీటి సరఫరా కోసం సుమారు 10లక్షల రూపాయల ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు. గడిచిన 21నెలల్లో ఈ పరిధిలో 12కోట్ల47 లక్షల రూపాయలతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేశామన్నారు. గత ప్రభుత్వం ఆర్థికంగా నష్టం చేసి భారీగా అప్పులు చేసినప్పటికీ, సాకులు చెప్పకుండా ప్రాధాన్యత క్రమంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామన్నారు. గడిచిన ప్రభుత్వ హయాంలో రెండు పడకల గదుల ఇండ్ల పేరిట ప్రజల చిరకాల కోరికను విస్మరించని అన్నారు. మన ఇందిరమ్మ రాజ్యంలో మొదటి సంవత్సరంలోనే ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 3వేల500వందల చొప్పున మొత్తం 4లక్షల50వేల ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశామన్నారు. మొదటివిడతలోని ఈ పరిధిలో 80ఇందిరమ్మ ఇండ్లు అందిచామన్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే 200యూనిట్లు ఉచిత విద్యుత్తు, ఉచిత బస్సు, రేషన్‌కార్డులు, సన్న బియ్యం వంటి గొప్ప కార్యక్రమాలను చేశామన్నారు. రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ అయ్యిందన్నారు. అనంతరం అక్కడే గతంలో చేపట్టి, నిర్మాణంపూర్తి కానీ ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. కావాల్సిన నిర్మాణ పనులు పూర్తి చేసి పేదలకు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్‌కమిటీ చైర్మన్ బైరు హరినాథ్‌బాబు, ఆర్డీఓ నర్సింహారావు, పాలేరునియోజకవర్గ ప్రత్యేకధికారి రమేష్, ఇఎంసి కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర టిపిసిసి ప్రచారకమిటీ కన్వీనర్ ధరావత్ రామ్మూర్తి నాయక్, జిల్లా నాయకులు మద్ది మల్లారెడ్డి, అంబటి సుబ్బారావు, తమ్మినేని నవీన్, మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, నాయకులు కందుకూరి వెంకటనారాయణ పాల్గొన్నారు.

## నూతన జాతీయ విద్యా విధానం రదుకు ఉద్యమిద్దాం

### ఏఐఎస్ఎఫ్ మాజీ రాష్ట్ర నాయకుడు దండి సురేష్




**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** నూతన జాతీయ విద్యా విధానం రద్దుకై విద్యార్థులు ఉద్యమించాలని, ఏఐఎస్ఎఫ్ మాజీ రాష్ట్ర నాయకులు, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ పిలుపునిచ్చారు. ఆదివారం ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని ఏదులాపురంలో ఏఐఎస్ఎఫ్ శాఖ మహాసభను నిర్వహించారు. ఏఐఎస్ఎఫ్ శ్వేత అరుణ పతాకాన్ని దండి సురేష్ ఆవిష్కరించారు.ఓరుగంటి మృదుల అధ్యక్షతన జరిగిన సభలో నూతన విద్యావిధానం పేరుతో యూనివర్శిటీల స్వ యం ప్రతిపత్తి దెబ్బతీసే ప్రయత్నం జరుగుతుందన్నారు. ఇలా చేయడం ద్వారా యూనివర్శిటీలను 3,4 రకాలుగా విభజన చేసి విద్యను కార్పొరేటికరణ, ప్రైవేటికరణ, కమర్షలైజేషన్, కాషాయికరణ చేయబోతున్నట్లు తెలిపారు. ఈ విధానాలు ప్రభుత్వ విద్య వ్యవస్థను ధ్వంసం చేయడానికి తీసుకుంటున్న చర్యలని ధ్వజమెత్తారు. ప్రధానంగా బీజేపీ ప్రభుత్వం ఆర్ఎస్ఎస్ ఎజెండాను అమలు కోసం ఈ కుట్రలన్ని పన్నుతుందని ఆరోపించారు. ప్రధానంగా ప్రధాని మోడీ దేశానికి అత్యంత ప్రమాదకరంగా పరిగనిస్తున్నారన్నారు. ఏఐఎస్ఎఫ్‌గా వీటిని ఖండించి, విద్యార్థులను చైతన్య పరచాలని సూచించారు.23 మంది నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏఐఎస్ఎఫ్ మాజీ జిల్లా నాయకులు మిడకంటి వెంకట్ రెడ్డి, వెంపటి సురేందర్, ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఇటికల రామకృష్ణ, స భ్యులు షేక్ నాగుల్ మీరా, మధు, వంశీ, మనోజ్, దండి శ్రీజ, మిడకంటి అభిరామ్, వెన్నబోయిన అజయ్, సాగర్, పటాన్ రఫీ, మురళి, అకిల్, ప్రదీప్, సిపిఐ నాయకులు దొంతగాని వెంకన్న, ఉపేందర్, మేళ్లచెర్వు రవి, మామిడాల కిరణ్ పాల్గొన్నారు.

## ఆలయ నిర్మాణంతో ‘ఖమ్మం’కు ఆధ్యాత్మిక

### కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



**ప్రజాపక్షం/ ఖమ్మం :** తిరుమల వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణంతో ఖమ్మంకు ఆధ్యాత్మిక శోభ రానుందని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. ఖమ్మం జిల్లా ఆలయ నిర్మాణం తర్వాత ఆధ్యాత్మికంగా, పర్యాటకంగా మరింత అభివృద్ధి చెందుతుందని ఆయన తెలిపారు. ఆదివారం తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా నిర్మించే వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి సంబంధించి క్షేత్ర స్థాయిలో పర్యటించారు. 15వ డివిజన్‌లోని కొత్తగూడెం, అల్లిపురం గ్రామాలకు సంబంధించి అత్యంత ప్రాధాన్యత కలిగిన స్థలాల సేకరణకు సాధ్యాసాధ్యాలపై రెవెన్యూ మ్యాపులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ టిటిడి ప్రమాణాలకు అనుగుణంగా రహదారి సమీప్యాత, వసతి గృహాలు తదితర విషయాలను దృష్టిలో ఉంచుకుని రెండు, మూడు స్థలాలకు ప్రాధాన్యతనిచ్చామన్నారు. టిటిడి అధికారులు, వేద పండితులు ఖమ్మం నగరానికి వచ్చి ప్రతిపాదిత స్థలాలను పరిశీలించిన తర్వాత అనువైన భూమిని ఖరారు చేస్తారని కలెక్టర్ తెలిపారు. ఈ పర్యటనలో ఆర్డివో నర్సింహారావు, అర్బన్ తహసీల్దార్ సైదులు పాల్గొన్నారు.

## రౌడీ చర్యలను పోలీసులు పట్టించుకోరా?

### సిపిఐ(ఎంఎల్)మాస్‌లైన్



**ప్రజాపక్షం/ ఖమ్మం :** ప్రశాంతమైన ఖమ్మం నగరంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ కొంత మంది రౌడీ చర్యలకు పాల్పడుతుంటే పోలీసులు ఎందుకు పట్టించుకోవడం లేదని సిపిఐ (ఎంఎల్)మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆవుల అశోక్, జి. రామయ్య, పుల్లయ్య లు ప్రశ్నించారు. ఖమ్మం నగరంలో డోర్నకల్ ఎంఎల్‌ఏ అనుచరుడైన లిక్కర్ డాన్ తన గ్యాంగులను వెంటేసుకుని బెదిరింపులు, అరాచకాలు సృష్టిస్తూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నారని వారు ఆరోపించారు. అన్నదమ్ముల మధ్య ఆస్తి తగాదాలను పరిష్కరించే నేపంలో గంజాయి బ్యాచ్, తాగుబోతులు, రౌడీ షీటర్లు ఇండ్లలో జొరబడి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఏసిపి ఆఫీసుకు అతి సమీపంలో ఇలాంటి బెదిరింపులు జరుగుతుంటే ఎందుకు మౌనంగా పోలీసులు ఉంటున్నారని వారు ప్రశ్నించారు. ఖమ్మం పౌర సమాజం ఇటువంటి అరాచకాలను సహించదని పోలీస్ ఉన్నతాధికారులు వెంటనే జోక్యం చేసుకుని రౌడీ చర్యలను అరికట్టాలని వారు డిమాండ్ చేశారు.

## గైనకాలజిస్టు లేక శిశువు మృతి

**ప్రజాపక్షం/ మణుగూరు :** సింగరేణి ఆసుపత్రిలో గైనకాలజిస్టు లేక శిశువు మృతి చెందిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. సింగరేణి సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగి తన భార్యను మణుగూరులోని సింగరేణి ఆసుపత్రికి తీసుకెళ్లాడు. తొమ్మిది నెలల గర్భిణీ కావడం, డయాబెటిస్‌తో బాధపడుతుండడంతో పది రోజులకొకసారి కొత్తగూడెం తీసుకెళ్లే వాడు. కొత్తగూడెం సింగరేణి ఆసుపత్రిలో గైనకాలజిస్టు లేకపోవడంతో ఉద్యోగానికి సెలవు పెట్టి తీసుకెళ్లే వాడు. ఆదివారం ఇబ్బంది పడుతుండడంతో ఆమెను తీసుకుని సింగరేణి ఆసుపత్రికి వెళ్లగా గైనకాలజిస్టు లేక కొత్తగూడెం ఏరియా ఆసుపత్రికి రిఫర్ చేశారు. అక్కడ పరీక్షించి బేబీకి హార్ట్ బీట్ లేదని బయట పరీక్షలు చేయించుకుని రావాలని తెలిపారు. పరీక్షలు చేయించగా అప్పటికే గర్భస్థ శిశువు చనిపోయిందని సింగరేణి ఉద్యోగి వినయ్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశాడు. సింగరేణి ఏరియా ఆసుపత్రులో గైనకాలజిస్టు లేకపోవడం వల్లే శిశువు మృతిచెందినట్లు వినయ్‌కుమార్ తెలిపారు. ఇప్పటికైనా మణుగూరులో గైనకాలజిస్టు ను నియమించాలని వినయ్‌కుమార్ కోరారు.

## ప్రాణలు పోతున్నా పట్టించుకోరా!

### సిపిఐ రాష్ట్ర సమతి సభ్యుడు రావుల పల్లి రవికుమార్



**ప్రజాపక్షం/ దుమ్ముగూడెం:** మితి మీరిన ఇసుక లారీల వల్ల ఈ ప్రాంత ప్రజల ప్రాణాలు పోతున్న పాలకులకు,అధికారులకు ఏమి పట్టనట్టు ఒదని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు రావుల పల్లి రవికుమార్ , మండల కార్యదర్శి బొల్లోజు వేణు విమర్శించారు. ఆదివారం మండల పరిధిలోని నర్సా పురం గ్రామ ప్రధాన రహదారిపై ధర్నా , రాస్తారోకో నిర్వహించారు. మండలంలోని అన్ని రాజకీయ పార్టీలు రోడ్లపై ధర్నాలు, పాదయాత్రలు చేసిన ఫలితం లేకుండా ఉందని ఆవేదన వ్యక్తం చేసారు. అత్యవసర సమయంలో ప్రజలు ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయని రోడ్డు గుండా ప్రయాణం అంటే ప్రాణ భయంతో భీకరిల్లుతున్నారని తెలిపారు. చిన్న పాటి వర్షానికే నిత్యం వందలాదిగా వస్తున్న ఇసుక లారీలతో చిన్నపాటి వర్షానికే రోడ్లపై ఉన్న గుంతలపై నీరు చేరి లారీలు గోతుల్లో ఇ రుక్కుపోవడంతో కిలో మిటర్ల మేర వాహనాలు స్థంబిస్తున్నాయని తెలిపారు. దీంతో ప్రజలు చేరవలసిన గమ్యానికి సకాలంలో చేరలేక పోతున్నారని తెలిపారు. ఇసుక లారీల అతివేగానకి ద్విచక్ర వాహన దారులు ప్రాణాలు పోగొట్టుకున్న సందర్భాలు ఎన్నో ఉన్నాయని తెలిపారు. ఇప్పడికైన జిల్లా అధికార యం త్రాంగం దీనిపై ప్రత్యేక దృష్టి సారించి ఇసుక లారీల రద్దీని నియంత్రించి ప్రజల ప్రాణాలను కాపాడాల్సి భాద్యత ఉందని తెలిపారు. మారక పోతే మరిన్ని ప్రమాదాలు అధికంగా ఉన్నాయన్నారు.

#### లారీలను నియంత్రిస్తాం - సిఐ

నర్సాపురం గ్రామ ప్రధాన రహదారిపై జరుగుతున్న దర్నావద్దకు సిఐ వెంకటప్పయ్య చేరుకుని దర్నానుద్యేశిచి జండల సహాయకార్య దర్శులు తాటిపూడి రమేష్ కాక వెంకటేశ్వరరావు, సోసైటి డైరెక్టర్ కిలిమి ఎల్లా రెడ్డి , అమరి వాది శంఖర్ , చెంచల కృష్ణ, మ డకం ముత్తయ్య, దేగల బజారు, పొడియం మణి, ఐనబోయిన శేఖర్ , తాము చిన ముత్తయ్య, బొ మ్మిడి దుర్గా ప్రసాద్ పాల్గోన్నారు.

## డిసిసి పీఠం దక్కేదెవరికో..?

### తనకు ఇవ్వాలంటూ ‘నూతి’ దరఖాస్తు

### నూతి వెంట రాందాస్ నాయక్, కొండబాల, పువ్వాళ్ల, జావిద్



**ప్రజాపక్షం/ ఖమ్మం :** కాంగ్రెస్ పార్టీ ఖమ్మంజిల్లా అధ్యక్ష పీఠం ఎవరికి దక్కనుందనే దానిపై చర్చోప చర్చలు సాగుతున్నాయి. ఎవరి ప్రయత్నాల్లో వారు ఉన్నారు. జిల్లా అధ్యక్ష పదవిని ప్రజాస్వామిక పద్ధతుల్లో ఎంపిక చేయబడుతుందని ఇందుకు సంబంధించి ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చునని కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. అధ్యక్ష పీఠం కోసం ఎవరి ప్రయత్నాల్లో వారు ఉండగా ఖమ్మం జిల్లాలోని ఉప ముఖ్య మంత్రి మల్లు భట్టివిక్రమార్క వర్గానికి చెందిన నూతి సత్యనారాయణకు దక్కే అవకాశం ఉందన్న ప్రచారం జరుగుతుంది. ఏఐసిసి పరిశీలకుడు మహేందర్‌కు జిల్లా అధ్యక్ష పదవికి సంబంధించిన నామినేషన్ పత్రాలను నూతి సత్యనారాయణ అందిస్తున్న సమయంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన భట్టి వర్గీయులంతా హాజరు కావడం విశేషం. వైరా శాసన సభ్యుడు మాలోత్ రాందాస్ నాయక్, మాజీ శాసన సభ్యులు కొండబాల కోటేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఖమ్మం నగర అధ్యక్షులు మహ్మద్ జావిద్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్యతో పాటు కాంగ్రెస్ ప్రముఖులంతా హాజరయ్యారు.

## వర్కర్స్ యూనియన్ నూతన కమిటీ ఎన్నిక




**ప్రజాపక్షం/ఖమ్మం :** తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) ఖమ్మం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. తల్లాడలో జరిగిన సంఘం జిల్లా మహాసభలో ఈ ఎన్నిక జరిగింది. మొత్తం 45 మందితో జిల్లా కౌన్సిల్‌ను ఎన్నుకున్నారు. జిల్లా గౌరవాధ్యక్షులుగా నిమ్మటూరి రామకృష్ణ, కార్యనిర్వహక అధ్యక్షులుగా మహదేవ ల క్ష్మి, జిల్లా అధ్యక్షులుగా తుళ్లూరి లక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా గుండెపొంగు మల్లేష్ లు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా కృష్ణకుమారి, లక్ష్మి, సత్యావతి, కుమారి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా రం జాన్‌బీ, సహాయ కార్యదర్శులుగా రహీమున్నీసా, కరుణ, సూరమ్మ, అన్నమ్మ, వెంకటమ్మ లు ఎన్నికయ్యారు. అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మి, మల్లేష్ లు మాట్లాడుతూ మధ్యాహ్న భోజన వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఏఐటియుసి నేతృత్వంలో కృషి చేస్తామన్నారు. ప్రభుత్వం పెండింగ్ బిల్లులను విడుదల చేయడంతో పాటు కార్మికులకు నెలకు రూ. 10వేల గౌరవ వేతనం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.

## వీడియోస్ కాలనీలో ఉద్రిక్తత

### కాంగ్రెస్ నేత నరేందర్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు



**ప్రజాపక్షం/ ఖమ్మం :** రెండు రోజులుగా ఖమ్మం 54వ డివిజన్ పరిధిలోని వీడియోస్ కాలనీలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. శని, ఆదివారాల్లో ఈ ఆందోళనలు జరిగాయి. ఆదివారం కాంగ్రెస్ నాయకుడు, 54వ డివిజన్ కార్పొరేటర్ మిక్కిలినేని మంజుల భర్త నరేందర్‌ను, మంజులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాల్లోకి వెళితే మిక్కిలినేని నరేందర్‌పై చెరుకూరి చంద్రశేఖర్, సుజాత దంపతులు దాడి చేయించేందుకు ప్రయత్నించారని మిక్కిలినేని మంజుల ఆరోపించారు. శనివారం సా యంత్రం కొంత మంది రౌడీలు నరేందర్‌ను అడ్డగించి దాడి చేసేందుకు ప్రయత్నించారని ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆమె ఆరోపించారు. చెరుకూరి సుజాత అవహేళన చేసి తమను ఇష్టానుసారంగా మాట్లాడిందని మంజుల తెలిపారు. తాము ఇదేమిటని ప్రశ్నిస్తే పోలీస్ స్టేషన్‌కు తరలించారని ఆమె తెలిపారు. కాంగ్రెస్ ఎస్సి సెల్ అధ్యక్షులు రాకేష్ పై డోర్నకల్‌కు చెందిన రౌడీలు దాడి చేశారని ఆమె మీడియా సమావేశంలో తెలిపారు. ఖమ్మం పోలీసులు పట్టించుకోవడం లేదని ఖమ్మంలో ఎప్పుడు లేనివిధంగా రౌడీ ముఖలు తిరుగుతూ ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నాయని ఆమె ఆరోపించారు. ఇదిలా ఉండగా చెరుకూరి సుజాత, చంద్రశేఖర్‌లు కూడా మీడియా సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించి ఆతర్వాత రద్దు చేశారు. మొత్తంగా ఒక కుటుంబ పంచాయతీ వ్యవహారమే ఈ పరిస్థితికి కారణమని తెలుస్తుంది.

## త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



**ప్రజాపక్షం/ ఖమ్మం :** దీపావళి జ్ఞాన జ్యోతి వెలుగులు ప్రతి ఇంట ప్రసరించాలని కోరుతూ త్రైత సిద్ధాంత భగవద్గీతను ఖమ్మంలో ప్రబోధ సేవా సమితి హిందు జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. ఖమ్మంలోని బుర్హాన్‌పురం నుంచి ప్రచారం ప్రారంభమైంది. దీపావళి రోజున ఇంట్లో దీపాలు వెలిగించాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రబోధ సేవా సమితి బాధ్యులు సత్యం, అరుణ, విజయ, సుజాత, ఉమేష్, జయశ్రీ, మమత పాల్గొన్నారు.

## గీత కార్మికుల కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు చేపట్టాలి

### భూపాలపల్లి కలెక్టర్ కు వినతి పత్రం

ప్రజాపక్షం/భూపాలపల్లి :జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో కృష్ణ కాలనీ గౌడ కులస్తుల కమ్యూనిటీ హాలు పనులను వెంటనే ప్రారంభించాలని మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ బుర్ర రమేష్ గౌడ్ డిమాండ్ చేశారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మను కలిసి నిర్మాణ పనులు చేపట్టాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ, భూపాలపల్లి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి జిల్లా కేంద్రంలో కమ్యూనిటీ హాల్ స్థలాలను నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. వాటికి సంబంధించిన ప్రొసీడింగ్ ఇచ్చినారని అందులో భాగంగా గౌడ కులస్తులకు 1 ఎకరం భూమిని, భవన నిర్మాణానికి కోటి రూపాయలు మంజూరు చేశారని, గతంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా ఇచ్చిన ప్రొసీడింగ్ ప్రకారం వెంటనే గౌడ కుల కమ్యూనిటీ హాలు పనులు ప్రారంభించాలని ప్రస్తుత కలెక్టర్ రాహుల్ శర్మకు వినతి పత్రం అందజేసి విజ్ఞప్తి చేశారు.

## రోడ్డును కప్పేస్తున్న పిచ్చి మొక్కలు



ప్రజాపక్షం/కన్నాయిగూడెం: ఏటూరునాగారం, కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం నుండి వరకు వచ్చిపోయే వాహనదారులకు కన్నాయిగూడెం మండలం ఏటూరు గ్రామం నుండి కంతనపల్లి గ్రామ అటవీ ప్రాంత మూల మలుపుల వద్ద రోడ్డును కమ్మేస్తున్న పిచ్చి మొక్కలతో ప్రయాణం చేయాలంటే భయంగా మారుతుంది. సింగిల్ రోడ్డు కావడంతో రోడ్డుకు ఇరువైపుల పిచ్చిమొక్కలు ఏపుగా పెరగడంతో వాహనదారులకు ఇబ్బందిగా మారుతుంది. కాస్త అదమరిస్తే రోడ్డు ప్రమాద బారిన పడే అవకాశాలు ఉన్నాయని వాహనదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా మూల మలుపుల వద్ద సూచిక బోర్డులతో పాటు, పిచ్చిమొక్కలను తొలగించాలని ప్రయాణికులు సంబంధిత అధికారులను కోరుతున్నారు.

## రిజర్వేషన్ల చట్టాన్ని మోదీ ప్రభుత్వం ఆమోదించాలి



ప్రజాపక్షం/నల్లబెల్లి:స్థానిక సంస్థల ఎన్నికలలో విద్యా ఉద్యోగ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు చట్టాన్ని ఆమోదించకుండా బిసి వ్యతిరేక వైఖరితో మోడీ ప్రభుత్వం వ్యవహరించడం సరైంది కాదని బిసి హక్కుల సాధన సమితి మండల కన్వీనర్ జక్కుల భగత్ అన్నారు. ఆదివారం వరంగల్ జిల్లా నల్లబెల్లి మండల కేంద్రంలో హైకోర్టు కేసు పత్రాలను బస్టాండ్ ఆవరణలో బిసి హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో దగ్ధం చేశారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్లు జక్కుల భగత్ మాట్లాడుతూ రాష్ట్రంలో బిసి రిజర్వేషన్ల ప్రక్రియలో అనేక ఆటంకాలు కలుగుతున్నాయని బిసి హక్కుల సాధన సమితి మండల నాయకులు అన్నారు. నల్లబెల్లి బస్టాండ్ ఆవరణలో ప్లకార్డులు ప్రదర్శిస్తూ బుట్టంగారి మాధవరెడ్డి హైకోర్టులో వేసిన కేసు ప్రతులను దగ్ధం చేసి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం అసెంబ్లీలో చేసిన చట్టాన్ని గవర్నర్ ద్వారా కేంద్ర ప్రభుత్వానికి పంపినప్పటికి బిసి చట్టాన్ని 9వ షెడ్యూల్‌లో చేర్చి ఆమోదించకుండా బిసి ప్రధానమంత్రిని అంటున్న మోడీ ఎందుకు ఆమోదించడం లేదని ప్రశ్నించారు. మోడీ ప్రభుత్వం కారణంగానే తెలంగాణలో బిసిలకు రిజర్వేషన్లు దక్కకుండా పోతున్నాయని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇప్పటికైనా బిసి రిజర్వేషన్లు సాధించడానికి అన్ని రాజకీయ పార్టీలనను బిసి సంఘాలను కలుపుకొని పోవాలన్నారు. ఐక్య కార్యాచరణతో బలమైన ఉద్యమాన్ని నిర్మించి మోడీ ప్రభుత్వం బిసి చట్టాన్ని 9వ షెడ్యూల్‌లో చేర్చే విధంగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి వైనాల వీరస్వామి, పండుగ తరుణ్, బొడిగే చంద్రకాంత్, ఎలబోయిన హిమవంత్, అల్లె రాంచరణ్, సంగెం సిద్ధూ, గడ్డం రితీష్, జక్కుల భార్గవ్, బన్నీ కళ్యాణ్, బిసి హక్కుల సాధన సమితి మండల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఏ పార్టీకైనా కార్యకర్తలే పునాది

### ఎఐసిసి అబ్జర్వర్



ప్రజాపక్షం /జనగామ: ఏ పార్టీకైనా కార్యకర్తలే పునాధి. కార్యకర్తల ద్వారానే పార్టీ అభివృద్ధి చెందుతుందని ఎఐసిసి అబ్జర్వర్ అన్నారు. జిల్లా అధ్యక్షుల ఎంపికలో భాగంగా అభిప్రాయ సేకరణ కార్యక్రమం జరిగింది. ఆదివారం స్టేషన్‌ఘనపూర్, పాలకుర్తి నియోజకవర్గాల్లో అభిప్రాయ సేకరణ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎఐసిసి అబ్జర్వర్ దేబాసిస్ పట్నాయక్, టిపిసిసి పరిశీలకులు షాద్ నగర్ ఎమ్మెల్యే శంకరయ్య, ఎండి ఆవేజ్ , శ్రీకాంత్ యాదవ్ అన్నారు. స్టేషన్‌ఘనపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం ఆదివారం స్టేషన్‌ఘనపూర్ మండల కేంద్రంలో జరిగింది. డిసిసి అధ్యక్షులు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, ఎమ్మెల్యే కడియం శ్రీహరితో పాటు పలువురు పలువురు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎఐసిసి అబ్జర్వర్ దేబాసిస్ పట్నాయక్ మాట్లాడుతూ పార్టీ పదవుల ఎంపిక పారదర్శకంగా జరగాలనే మంచి అభిప్రాయంతో కాంగ్రెస్ పార్టీ పెద్దలు తీసుకున్న నిర్ణయాన్ని అమలు చేయడం జరుగుతుందన్నారు. పార్టీ సంస్థాగత నిర్మాణం బలంగా ఉన్నప్పుడే పార్టీ ఎన్నిక ఒడిదుడుకులు ఎదురైనా నిలబడగలుతుందన్నారు. బిసిలపైన బిజెపి, బిఆర్‌ఎస్ పార్టీలు కపట ప్రేమను ప్రదర్శిస్తున్నాయని ఆరోపించారు. తెలంగాణ బిజెపి మంత్రులు, ఎంపిలు, బిసి రిజర్వేషన్లకు కట్టుబడి ఉన్నామని ఎందుకు ప్రకటించడం లేదని ప్రశ్నించారు. బిసి రిజర్వేషన్లకు వ్యతిరేకం అని ప్రకటించే దైర్యం ఏ పార్టీకి అయినా ఉందా, బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు ప్రటించే రోజు వస్తుందన్నారు. విప్లవాత్మక నిర్ణయాలు, విప్లవ ఉద్యమాలు విజయం సాధించడంలో ఆలస్యం అయినా చివరికి తప్పక విజయం సాధిస్తాయని, విప్లవ ఉద్యమాలకు పేటెంట్‌గా వచ్చిన బిసి రిజర్వేష్ల పేటెండ్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికే దక్కుతుందన్నారు. రాష్ట్రంలోనూ ప్రతిపక్ష పార్టీలు సహకరించడం లేదని, అభివృద్ధిలో అడుగడుగునా అడ్డుకుంటున్నాయని విమర్శించారు. తెలంగాణ ఏర్పడినప్పటి నుండి తెలంగాణ అభివృద్ధికి మోదీ ప్రభుత్వం ఒక్క రూపాయి కేటాయించలేదని, అసలు తెలంగాణ ఏర్పడడం బిజెపికే ఇష్టం లేదన్నారు. తల్లిని చంపి బిడ్డను వేరు చేశారని నిండు పార్లమెంట్‌లో మోదీ చేసిన వాఖ్యలే దీనికి నిదర్శణమన్నారు. 10 ఏళ్ల అధికారంలో ఉన్న బిఆర్‌ఎస్ తెలంగాణ వనరులకు దోచుకుందని, విచ్చలవిడిగా భూ కబ్జాలకు పాల్పడి అవినీతి సొమ్ము వేల కోట్ల రూపాయలు కూడబెట్టుకున్నారన్నారు. కెసిఆర్ కుంగిపోయే కాళేశ్వరం కట్టారని, పిసి ఘోష్ కెసిఆర్, హరీష్‌లను దోషులుగా నిలబెట్టిందన్నారు. కవిత మద్యం కుంభకోణంలో జైలుకు వెళ్లి వచ్చారని, వాల వాళ్లు చేసిన పాపాలకు కోర్టుల చుట్టు తిరుగుతున్నారని మండిపడ్డారు. దేశానికే ఆదర్శంగా తెలంగాణ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని, సన్న బియ్యం పంపిణీ, రేషన్ కార్డులు, ఉచిత బస్సు ప్రయాణం, 21వేల కోట్ల రుణ మాఫీ, 9వేల కోట్లు పెట్టుబడి సహాయం ఇలా చెప్పుకుంటు పోతే అనేక సంక్షేమ పథకాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్లు లావణ్య శిరీశరెడ్డి, శివరాజ్ యాదవ్, మండ పార్టీ అధ్యక్షులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, పిఎసిఎస్ చైర్మన్లు, సమన్వయ కమిటీ సభ్యులు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## డిసిసి అధ్యక్ష పదవికి 12 దరఖాస్తుల స్వీకరణ



ప్రజాపక్షం/భూపాలపల్లి : టిపిసిసి, ఎఐసిసి ఆదేశాలమేరకు కాంగ్రెస్ పార్టీలో జయశంకర్ భూపాలపల్లి డిసిసి అధ్యక్ష పదవికి 12దరఖాస్తులు వచ్చినట్లు ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్, జిల్లా పార్టీ అధ్యక్షుడు ఐత ప్ర కాష్ రెడ్డి తెలిపారు. అందులో భాగంగా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధిగా జర్ల అశోక్, పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ పిప్పాల రాజేందర్, టిపిసిసి సభ్యుడు చల్లూరి మధు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఇస్లావత్ దేవన్, జిల్లా నాయకులు క్యాతరాజ్ సాంబమూర్తి, అప్పం కిషన్ ఐత ప్రకాష్ రెడ్డి, మండల తిరుపతి గౌడ్, మొక్కిరాల మధు వంశీకృష్ణ, దబ్బేట రమేష్, గద్దె సమ్మయ్య, గూట్ల తిరుపతి ఆదివారం దరఖాస్తులు చేసుకున్నారు. నేడు ఎఐసిసి టిపిసిసి నుండి అబ్జర్వర్లు నేడు జిల్లాకు రానున్నారు. అధ్యక్ష పదవికి దరఖాస్తులు చేసుకున్న దరఖాస్తులను పరిశీలించనున్నారు. పార్టీ కోసం నిరంతరంగా పనిచేసే వారికి అధిష్టానం పరిశీలించి పారదర్శకంగా అధ్యక్ష పదవి ఇచ్చే అవకాశాలు ఉన్నట్లు ప్రకాష్ రెడ్డి తెలిపారు.

జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పీఠం రేసులో కాంగ్రెస్ పార్టీ అధికార గాజర్ల గాజర్ల అశోక్ బీసీ సామాజిక వర్గానికి చెందిన నేతగా కాంగ్రెస్ పార్టీకి విధేయుడుగా పనిచేస్తున్నాడు. గతంలో పరకాల ఎమ్మెల్యే టికెట్ రేసులో ఉండి అధిష్టానం నిర్ణయం మేరకు విరమిచ్చుకున్నారు. గాజర్ల అశోక్ అందరిని కలుపుకుపోయారు మనస్తత్వం చిన్న పెద్ద తేడా లేకుండా కలుపుకపోతే గుణం కలిగిన వ్యక్తిగా కార్యకర్తల్లో మంచి పేరు ఉంది. ఈ అధ్యక్ష పదవి ఈసారి అధ్యక్షుడు గా అవకాశం దక్కనున్నట్లు తెలుస్తుంది.

## యథేచ్ఛగా ట్రాక్టర్లతో ఇసుక రవాణా

### చోద్యం చూస్తున్న అధికారులు




ప్రజాపక్షం/కన్నాయిగూడెం: మండలంలోని బుట్టాయిగూడెం హనుమంతుడి వాగులో నుండి కొందరు వ్యక్తులు ఆదివారం ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక వ్యాపారులు ట్రాక్టర్లల ద్వారా ఇసుకను రవాణా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్న అవేమి పట్టనట్లు యథేచ్ఛగా ఇసుక రవాణా చేస్తు సొమ్ము చేసుకుంటున్నారు ముప్పనపల్లి, గుర్రేవుల, కన్నాయిగూడెం, గంగుగూడెం, తదితర గ్రామాల్లో ఇసుకను వ్యాపారులు అమ్ముతున్నారని స్థానికులు అంటునానరు. ఇంత జరుగుతున్న మైనింగ్, రెవెన్యూ, ప్రభుత్వ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తనట్లు వ్యవహరిస్తున్నారు. అక్రమంగా ఇసుక తవ్వకాలు జరగకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

## కొత్తూరులో మొసలి కలకలం



ప్రజాపక్షం/ఖానాపూర్: ఖానాపురం మండలంలోని కొత్తూరు గ్రామంలోని దుంపలగడ్డ శివారు గద్దె కుమారస్వామికి చెందిన పొలంలో ఆదివారం మొసలి ప్రత్యక్షమైయింది. పొలానికి వెళ్ళిన సమయంలో మొసలి కనిపించడంతో రైతులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. వెంటనే ఫారెస్ట్ అధికారులు సమాచారం అందించారు. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్స్ వెంకన్న, నాగరాజులు అక్కడికి చేరుకొని స్థానిక రైతుల సహకారంతో మొసలిని పట్టుకొని తీసుకెళ్ళారు.

## అబ్దుల్ కలాం వాకర్స్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక



ప్రజాపక్షం/గూడూరు: గూడూరు మండల కేంద్రంలోని అబ్దుల్ కలాం వాకర్స్ అసోసియేషన్ నూతన కమిటీ ఆదివారం ఎన్నుకున్నారు.అధ్యక్షలు ముయ్యబోయిన వెంకన్న ప్రధాన కార్యదర్శిగా ముక్తవరం సత్యనారాయణ కోశాధికారిగా బత్తుల శ్రీనువాస్ ఉపాధ్యక్షులుగా మండల వెంకటేశ్వర్లు లక్ష్మ య్య సహాయ కార్యదర్శి పెనుక ప్రభాకర్ ప్రచార కార్యదర్శిగా వాంకుడోత్ గోపినాథ్ గౌరవ సలహాదారులుగా కన్న వెంకటేశ్వర్లు సంగెపు స్వామి బీరం వెంకట్‌రెడ్డి అయిలబోయిన వీరయ్య మంజుల పూర్ణచందర్ పే రాల రాము కార్యవర్గ సభ్యులు గజ్జి మల్లయ్య వడ్డూరి రాజలింగాచారి స య్యద్ కరీం సిహెచ్ దేవేందర్రావు మడిపెద్ది భాస్కర్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## మాదన్నపేట చెరువు పరిసరాలలో ప్లాస్టిక్ లేకుండా చూడాలి :రవికుమార్

ప్రజాపక్షం / నర్సంపేట : ఒకవైపు చెరువు మరొకవైపు పచ్చటి పొలాలతో ప్రశాంతమైన వాతావరణంలో ఎంతో ఆహ్లాదంగా ఉన్న మాదన్నపేట చెరువు కట్ట ప్రాంతాన్ని ప్లాస్టిక్ లేకుండా పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై



ఉందని లీడ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, పర్యావరణ కార్యకర్త కాసుల రవి కుమార్ అన్నారు. కట్టపొడుగుతా ఎక్కడ చూసినా ప్లాస్టిక్, మద్యం బాటిల్స్ ఉంటున్నాయని అన్నారు. ఉదయం నడకకు వెళ్లిన వారు కూడా పర్యావరణ కాలుష్యం పట్ల ఎంతో ఆవేదనను వ్యక్తం చేస్తున్నారన్నారు. నర్సంపేట చుట్టుపక్కల ప్రాంతాల్లో చక్కటి పర్యావరణానికి అనవాళ్లుగా ఉన్న పాకాల, మాదన్నపేట ప్రాంతాలను కాలుష్యం కాకుండా ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని ఆయన కోరారు.

## కొత్తకోట రచనలు సామాజిక మార్పు కలిగిస్తాయి

### కేంద్ర సాహితీ అకాడమీ అవార్డు గ్రహీత అంపశయ్య నవీన్



ప్రజాపక్షం/హనుమకొండ : కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి రచనలు సామాజికంగా మార్పు కలిగించే విధంగా వున్నాయని కేంద్ర సాహితీ అవార్డు గ్రహీత అంపశయ్య నవీన్ తెలిపారు. మిత్ర మండలి అధ్వర్యంలో విశ్రాంత ఐపిఎస్ అధికారి కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి రచించిన ''పుంజు తోక'' సంపుటి అవిష్కరణ సభను ఆదివారం హన్మకొండలోని వాగ్దేవి కళాశాలలో సమావేశ ప్రాంగణంలో ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమానికి కేంద్ర సాహితీ అవార్డు గ్రహీత అంపశయ్య నవీన్ ముఖ్య అతిధిగా పాల్గోన్న ఈ కార్యక్రమంలో ముందుగా జ్యోతి ప్రజ్వల చేసారు. అనంతరం అంపశ్య నవీన్ చేతుల మీదుగా కొత్త కోండ శ్రీనివాస్ రెడ్డి రచించిన ''పుంజు తోక'' సంపుటిని అవిష్కరించారు. ఈ సందర్బంగా అచార్య బన్న అయిలయ్య, నాగిళ్ళ రామశాస్త్రి, వి.ఆర్ విద్యార్థి పుంజు తోక సంపుటిలోని కవితలపై వారి వారి అభిప్రాయాలను వ్యక్తం చేస్తూ విశ్లేషణాత్మకంగా వివరించడం జరిగింది. అనంతరం ముఖ్య అతిధి అంపశయ్య నవీన్ మాట్లాడుతూ కొత్తకోండ శ్రీనివాస్ రెడ్డి రచించిన ''పుంజు తోక'' సంపుటిలోని సామాజిక స్ఫూర్తి కలిగించే రీతిలో కవితలు వున్నాయని. కొత్తకోట కవితలు అభ్యుదయ రచనలుగా వున్నాయి కావున శ్రీనివాస్ రెడ్డి గారిని అభ్యుద కవిగా భావిస్తున్నానని. సుధీర్ఘ కాలం పోలీస్ శాఖలో తాను పనిచేసిన తన గురించి ఈ సంపుటిలో ప్రస్తావించకపోవడం గమనార్హమని. ముఖ్యంగా ఈ సంపుటి పూర్తిగా నవరసాలతో కూడిన వుందని, పోలీసులను కూడా చులకనగా చూడవద్దని, వారుసైతం ప్రాణత్యాగాలు చేస్తూ దేశ సేవ చేస్తున్నవారే అంటూ సంపుటిలో కొత్తకోట గారు చక్కగా వివరించడం జరిగిందని. సమాజాన్ని పరిశీలించి,సమాజంలో జరుగుతున్నటువంటి మానవనీయమైన సంఘటనలపై చలించి,స్పందించే మనస్సు వున్నవారు, తన భావాలను అక్షర రూపంలో రూపంలోకి మార్చగలిగిన వారే కవితలు, నవలలు వ్రాయగలరని, రాబోవు రోజుల్లో కొత్తకోండ శ్రీనివాస్ రెడ్డి ద్వారా మరిన్ని అభ్యుదయ రచనలు రావాలని అంపశయ్య కోరారు. విశ్రాంత ఐపిఎస్ అధికారి కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ వరంగల్ నాకు ప్రత్యేక అనుభూతులను మిగిల్చింది, నేను ఇక్కడ ట్రెనింగ్ ఏఎస్పీగాపనిచేయడంతో పాటు, ఇదే జిల్లా ఏస్పీగా పనిచేసే భాగ్యం తెనకు కలిగిందని. విద్యార్థి దశ నుండి కవితలు రాయడం అలవాటని, నేను వ్రాసిన కొన్ని అనాడే ప్రచురితం అయ్యాయని, పోలీస్ అధికారి అయ్యాక నా అనుభవాలను కేవలం నావరకు మాత్రమే పుస్తకంలో వ్రాసుకునేవాడినని ఈ పుస్తకం రాయడంలో ఎంతో మంది శ్రీ శ్రీ,చలం, కాళోజీ లాంటి కవులతో పాటు సినీ దర్శకులు సత్యజిత్‌రే, నర్సింగరావు లాంటి నాకు స్ఫూర్తి నిచ్చారాని, ముఖ్యంగా సాహిత్యమనేది సంస్కరం అందించడం మానవ విలువలను కాపాడుతుందని కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.చివరగా ఈ కార్యక్రమములో వరంగల్ సాహిత్యవేత్త మల్యాల మనోహర్ రావు కొత్తకోండ శ్రీనివాస్ రెడ్డితో వున్న పరిచయాన్ని తెలియజేస్తూ ముగింపు ప్రసంగాన్ని చేసారు. ఈ కార్యక్రమములో ట్రై సిటికి చెందిన సాహిత్యవేత్తలతో పాటు, పోలీస్ అధికారులు, ఉద్యోగులు, పాల్గోన్నారు.

## బిసి రిజర్వేషన్ పౌరహక్కు, సామాజిక జన్మహక్కు

### హనుమకొండ బిసి భవన్‌లో గొంతెత్తిన బిసి ఉద్యమకారులు




ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ : ఉద్యమాల పురిటి గడ్డ, ఉత్తర తెలంగాణ కేంద్రంగా బిసి ఉద్యమం రగులుకుంటోంది....42 శాతం రిజర్వేషన్ పట్ల ప్రధాన రాజకీయ పార్టీలు, రెడ్డి జాగృతి లాంటి అగ్రవర్ణ సంస్థలు అనుసరిస్తున్న విధానాలపై బిసి సంఘాలు, మేథావుల, విద్యార్థులు సంఘటితంగా గొంతెత్తారు. ఓబిసి చైర్మన్, కుడా మాజీ చైర్మన్ ఎస్. సుందర్ రాజ్ యాదవ్ నేత్రుత్వంలో, ఆయన అధ్యక్షతన హనుమకొండ రాంనగర్‌లోని బిసి భవన్ లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో బిసిసామాజిక సంస్థలు, కుల సంఘాలు, మేథావి వర్గం పలు కీలక తీర్మానాలు చేశారు. తెలంగాణ సాధన కోసం సబ్బండ వర్గాలు ఏ రకంగా కదిలాయో అదే తీరులో బిసి రాజ్యాధికారం కోసం మరో ఉద్యమం సామాజిక తెలంగాణ కోసం ఆవిర్భవించాలని సమావేశం ఏక కంఠంతో ప్రకటించింది... తెలంగాణ సాధన కోసం సమరం సాగించిన బలహీన వర్గాల ప్రజలు ప్రస్తుతం తమ కోసం తాము ఉద్యమం చేయాల్సిన చారిత్రక అవసరం ఉత్పన్నమైందని మేథావులు అభిప్రాయ పడ్డారు. 42% రిజర్వేషన్ సాధన కోసం, చట్ట సభల్లో ప్రాతినిథ్యం కోసం బిసిలు, ఎంబిసిలు రాజకీయ పార్టీలను, అగ్రవర్ణ సంస్థలను యాచించడం కాదని, ఉద్యమ పంథాతో శాసించే స్థాయికి చేరాలని కోరారు. బిసి రిజర్వేషన్ వ్యవహారంలో ప్రధాన రాజకీయ పార్టీలైన కాంగ్రెస్, బిజెపి, బిఆర్‌ఎస్ వ్యవహరిస్తున్న దోబుచులాటపై, మభ్యపెట్టే ధోరణిపై బిసి ఉద్యమకారులు, కుల సంఘాల ప్రతినిధులు మండి పడ్డారు. అట్టడుగు స్థాయి నుంచి చట్ట సభల్లో అడుగుపెట్టే పరిణామం వరకు అన్ని స్థాయిల్లో బిసి ఉద్యమాన్ని నిర్మాణాత్మకంగా రూపుదిద్దాలని, దాని కోసం ప్రజల్లో సామూహిక చైతన్యం, సంఘటిత ఉద్యమానికి సకల జనులంతా శ్రీకారం చుట్టాలని పిలుపు నిచ్చారు. బిసి రిజర్వేషన్ సాధన పరిణామాలపై ఏర్పడుతున్న అవాంతరాలపై బిసి కులాలు, మేథావులు, విద్యార్థులు, సామాజిక సంస్థలను ఒకే తాటిపై తీసుకు వచ్చి అత్యవసర సమావేశం నిర్వహించి అధ్యక్షత వహించిన ఓబిసి చైర్మన్, కుడా మాజీ చైర్మన్ సంగంరెడ్డి సుందర్ రాజ్ యాదవ్ మాట్లాడుతూ తెలంగాణ సమాజంలోని బిసిలు బలహీనులు కాదని, బాహుబలులనే సంగతిని పాలక పార్టీలు, ప్రధాన రాజకీయ పార్టీలు గుర్తించుకోవాలని అన్నారు. రాష్ట్రంలోని బాహుబలుల బలమేంటే తెలంగాణ సాధన ఉద్యమంలో బిసిల పాత్ర రుజువు చేసిందని, సాయుధ పోరాటంలోనూ నైజాంను తరిమిన గతం గమనంలో ఉందని సుందర్ రాజ్ యాదవ్ అన్నారు. బిసి రిజర్వేషన్ అనేది సమాజంలో సగం కంటే ఎక్కువగా ఉన్న బిసిల పౌరహక్కు అని, రాష్ట్ర సాధన ఉద్యమంలో బిసి బిడ్డల బలిదానాలతో ఏర్పడిన ప్రత్యేక రాష్ట్రంలో రాజ్యాధికార పోరాటంలో 'సామాజిక తెలంగాణ' తమ జన్మహక్కు అని సుందర్ రాజ్ యాదవ్ అన్నారు. బిసిలకు 42 శాతం స్థానిక సంస్థల ఎన్నికల్లో అవకాశం ఇస్తామని ఆశ చూపి అధికార కాంగ్రెస్ పార్టీ మోసం చేయాలని చూస్తున్నా, దానిని తమాషా చూస్తున్న ప్రధాన పార్టీల భరతం బిసిలు పట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయని అన్నారు. హైకోర్టులో పిటిషన్ వేసి బిసి బిడ్డల 42 శాతం రిజర్వేషన్ నోటికాడి కూడును లాక్కోవాలని చూస్తున్న రెడ్డి జాగృతి సంస్థ తీరు నీచమైన ఆలోచన అని, దానిని సమర్థించే తీరులో తాత్సారం చేస్తున్న చర్చలు ప్రదాన పార్టీల దిగజారుడు తనానికి నిదర్శనమని అన్నారు. బిసి రిజర్వేషన్లపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రాజకీయ పార్టీలతో కూడిన అఖిలపక్ష బృందాన్ని ఢిల్లీకి తీసుకపోవాలని డి మాండ్ చేశారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో ఓబిసి ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ గడ్డం భాస్కర్, ఓబిసి ఉపాధ్యక్షురాలు డా. విజయ లక్ష్మీ , ఓబిసి కోశాధికారి రాజేష్ కుమార్, ఓబీసీ జాయింట్ సెక్రెటరీ వేణుమాధవ్ గౌడ్, తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బోనగాని యాదగిరి గౌడ్, బిసి సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్, బిసి మహాసేన రాష్ట్ర కన్వీనర్ తడిశెట్టి క్రాంతి కుమార్, ముదిరాజ్ నాయకులు పులి రజనీకాంత్ , ప్రొఫెసర్ సిఎచ్ రాములు, కమల్ కుమార్, బెనర్జీ, అఖిలభారత యాదవ మహాసభ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు రాజయ్య యాదవ్, కాపు సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కటకం పెంట య్య, రజక సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకయ్య,వైద్యం రాజగోపాల్, బిసి మహాసేన కో కన్వీనర్ గొల్లపల్లి వీరస్వామి, అడ్వకేట్ సర్జు మోహన్, ఓబిసి యూత్ నాయకులు మౌనిక గౌడ్,ఆరె క్షత్రియ నాయకులు మనోహర్ రావు, భిక్షపతి, శ్రీధర్ రాజు, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## అదివాసీల అస్తిత్వ పోరాట వీరుడు కుమ్రం భీమ్

ప్రజాపక్షం/గోవిందరావుపేట: తుడందెబ్బ గోవిందరావుపేట మండల అధ్యక్షులు గోంది కీరణ్ అధ్యక్షతలో ముఖ్య అతిధులుగా అదివాసి ప్రజా సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర వర్కింగ్ కమిటీ స్టేట్ చైర్మన్ రాష్ట్ర అధ్యక్షులు వట్టం ఉపేందర్ మాట్లాడుతూ భారత రాజ్యాంగ నవనిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఈనాడు రాజ్యాంగలో ఐదవ షెడ్యూల్ ఆరవ షెడ్యూల్ పోందుపరిచి హక్కుల కల్పించినారో అదే షెడ్యూల్డ్ భూభాగం రావడానికీ కావడానికీ అనాడే అదివాసీ సాయధ యుద్ధ గోండు వీరుడు కుమ్రం భీమ్ ప్రత్యేక్ష సైన్యాన్ని ఏర్పాటు చేసుకోని నిజాం రాజ్యం పై ఉద్యమించాడని అనాటి ఉద్యమాలే అదే వాదంతో నేడు మన తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం సాధించుకున్న నినాదాలు అయినటువంటి నీళ్లు నిదులు నియామకాలు అనే విషయాన్ని ప్రజలు ప్రజాస్వామిక వాదులు గుర్తుంచుకోవాలని పిలుపునిచ్చారు. ఈ రాజ్యం పీడిత వర్గాలలో చీలుకలు తేచ్చే విధంగా భుస్వామ్య వర్గాలు కుట్రాలు చేస్తునటువంటి సందర్బంలో అదివాసిలు అదివాసి తెగలు ఉప తెగలు చైతన్యంతో అప్రమత్తంగా వుండి మన జాతులకు అన్యాయం జరగకుండా ఉద్యమించాలని అవసరం మన తుడుందెబ్బ పై భాద్యత వుందని పెర్కోన్నారు ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ జాతీయ కన్వీనర్ రమణాల లక్ష్మ య్య పాల్గోన్నారు అదివాసి నాయక్‌పోడ్ దెబ్బ వ్యవస్థాపక అధ్యక్షులు దబ్బా సుధాకర్ నాయక్‌పోడ్ మాదిగ దండోరా జాతీయ నేత దళిత రత్న అవార్డు గ్రహీత నెమిలి నర్సయ్య మాదిగ తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి ఎస్టీ ఎస్సీ అట్రాసిటి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటి ములుగు జిల్లా కమిటి సభ్యులు చింత క్రిష్ణ అదివాసి నాయకపోడ్ దెబ్బ పోలిట్ బ్యూరో సభ్యులు బొల్లెం సారయ్య తెలంగాణ ఎరుకుల పోరాట సమాతి రాష్ట్ర నాయకులు కూరాకుల సమ్మయ్య ఎరుకుల తుడుం దెబ్బ ములుగు జిల్లా అధ్యక్ష అధికార ప్రతినిదులు దుగ్గారాపు విరభద్రం ,ఈక జగ్గారావు ,వట్టం సురేష్ ,ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు ఎనగండుల మెగిళి మాదిగ ,అదివాసి మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు మైపతి మీనాకుమారక్క, పాల్గోన్నారు.

## మల్యాల హెఆర్‌ఎస్ టైం స్కేల్ ఉద్యోగుల హక్కులకు పోరాడుతాం


### ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు అజయ్ సారధిరెడ్డి



ప్రజాపక్షం/మహబూబాబాద్: మల్యాల హెచ్‌ఆర్‌ఎస్‌ల టైం స్కేల్ ఉద్యోగస్తుల, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికుల సమావేశం ఆదివారం మల్యాల లో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు బి అజయ్ సారధి రెడ్డి మాట్లాడుతూ టైం స్కేల్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికై పోరాడుతామని ఆయన బరోసా ఇచ్చారు. రిటైర్డ్ బెనిఫిట్ ఏడు లక్షల 50 వేల రూపాయలు పెంచాలని, పదవీ విరమణ వయసు 61 ఏళ్ల వరకు పెంచాలని డిమాండ్ చేశారు. టైమ్స్ స్కేల్ కుటుంబాలకు రెగ్యులర్ చేయాలని, ఉద్యోగస్తుల గ్రాట్యువిటీ 3 లక్షల రూపాయలు చేయాలన్నారు. వీరి సమస్యల పరిష్కారానికి 16 17 తేదీలలో ఆందోళనతోపాటు అక్టోబర్ 24న చలో సిద్దిపేట కొండ బాపూజీ లక్ష్మణ్ యూనివర్సిటీకి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నూతన కమిటీలను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి రేషపల్లి నవీన్, వెలుగు శ్రావణ్, పెరుగు కుమార్, చింతకుంట్ల వెంకన్న, లింగ్యనాయక్, జలగం ప్రవీణ్, అమీర్, శ్రీరాములు, హుస్సేన్, ఇమామ్, చింతకాయల వెంకన్న, ఎల్లయ్య, సూరయ్య, షరీఫ్, ఉపేందర్ సుమన్, యాకమ్మ కతీజ, మల్లికాంబ, లచ్చమ్మ ,ఐలమ్మ, మహబూబి, కొమరమ్మ, మల్లికాంబ పాల్గొన్నారు.

## పల్స్ పోలియో మనందరి సామాజిక ఆరోగ్య బాధ్యత

### జిఎంఎచ్ హనుమకొండలో పల్స్ పోలియో ప్రారంభించిన ఎమ్మెల్యే, మేయర్, కలెక్టర్, కమిషనర్



ప్రజాపక్షం/హనుమకొండ : పోలియో భారిన పడకుండా ఉండేందుకు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేసుకునేలా చూడాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని నగర మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ స్నేహా శబరీష్, మునిసిపల్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ లతో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 05 ఏళ్ల లోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలవి, పల్స్ పోలియో కార్యక్రమం అనేది మన దేశ ఆరోగ్య రంగంలో ఒక ఎంతో ముఖ్యమైన కార్యక్రమమని అన్నారు. భారతదేశాన్ని పోలియో రహితంగా మార్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసికట్టుగా ఎన్నో ప్రయత్నాలు చేస్తూ వస్తున్నాయని, ప్రతి ఒక్కరూ దీనిని సామాజిక బాధ్యతగా గుర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా మనం చిన్నారులకు జీవితాంతం ఆరోగ్యాన్ని అందించగలగమని, ఈ రెండు చుక్కలు తప్పనిసరిగా వేయించాలని కోరారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో ఒక్కో కుటుంబం, ఒక్కో చిన్నారి కూడా ఈ కార్యక్రమం నుండి మిగలకుండా ఉండాలని,మన పిల్లల పట్ల ఇది మన బాధ్యత మాత్రమే కాదు ఒక సామాజిక బాధ్యత కూడా అన్నారు. ప్రభుత్వం, ఆరోగ్య శాఖ ఈ కార్యక్రమాన్ని ఎంతో విస్తృతంగా చేపడుతుందని, ప్రభుత్వ హాస్పిటల్స్, అంగన్‌వాడీ కేంద్రాలు, స్కూల్స్, బస్ స్టేషన్లు, కాలనీలు ఇలా ప్రతి చోట కూడా పోలియో బూత్‌లు ఏర్పాటు చేశారని అన్నారు. పోలియోని పూర్తిగా నిర్మూలించాలంటే మనం అందరం కలిసి పనిచేయాలన్నారు. అనంతరం హాస్పిటల్‌లో మెటర్నటి వార్డును సందర్శించారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర పాలక మండలి సభ్యుడు ఈవి. శ్రీనివాస్ రావు,జిల్లా వైద్యాధికారి అప్పయ్య,జీఎంహెచ్ సూపరెండెంట్ విజయ లక్ష్మి , సీనియర్ నాయకులు సేయింట్ పాల్ ఆనంద్ తదితరులు ఉన్నారు.

# క్రీడ






## దంచికొట్టిన మంధాన, ప్రతీక

మహిళల వన్డే వరల్డ్ కప్‌లో తొలి ఓటమి నుంచి తేరుకున్న భారత జట్టు భారీ స్కోర్ చేసింది. ఓపెనర్లు స్మృతి మంధాన (80), ప్రతీకా రావల్ (75) దంచికొట్టడంతో ఆస్ట్రేలియాకు సవాల్ విసిరే లక్ష్యాన్ని నిర్దేశించింది. తొలి వికెట్‌కు వీరిద్దరూ 155 రన్స్ జోడించి బలమైన పునాది వేశారు. ఆ తర్వాత జెమీమా రోడ్రిగ్స్ (33), రీచా ఘోష్ (32)లు హాఫ్ సెంచరీ భాగస్వామ్యంతో స్కోర్ 300 దాటించారు. అప్పటికి చేతిలో ఆరు వికెట్లు ఉండడంతో స్కోర్ 350 దాటడం ఖాయమనిపించింది. కానీ, రీచా, జెమీమాతో పాటు టెయిలెండర్లు అనవసర షాట్లకు యత్నించి చకచకా పెవిలియన్ చేరారు. 49వ ఓవర్లో క్రాంతి గౌడ వికెట్ తీసిన సథర్‌లాండ ఆ తర్వాతి బంతికే శ్రీచరణిని క్లీన్ బౌల్డ్ చేయడంతో 330 వద్ద టీమిండియా ఇన్నింగ్స్ ముగిసింది. ప్రపంచ కప్‌లో భారత్‌కు ఇదే అత్యధిక స్కోర్ కావడం విశేషం.

### పవర్ ప్లేలో '58 రన్స్'

వరల్డ్ కప్‌లో వరుసగా రెండు విజయాల తర్వాత దక్షిణాఫ్రికా చేతిలో ఓటమితో కంగుతిన్న టీమిండియా వైజాగ్‌లో భారీ స్కోర్ చేసింది. టైటిల్ ఫేవరెట్ ఆస్ట్రేలియాపై ఓపెనర్లు స్మృతి మంధాన(80 : 66 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్సర్లు), ప్రతీకా రావల్(75 : 96 బంతుల్లో 10 ఫోర్లు, 1 సిక్సర్)లు అర్ధ శతకాలతో చెలరేగి కంగారూలను హడలెత్తించారు. పవర్ ప్లేలో 58 రన్స్ పిండుకున్న ఈద్వయం ఆ తర్వాత టాప్‌గేర్‌లో ఆడి స్కోర్ బోర్డును ఉరికించింది. హాఫ్ సెంచరీ తర్వాత జోరు పెంచిన మంధాన పేసర్ తహ్లియా మెక్‌గ్రాత్ బౌలింగ్‌లో సిక్సర్ బాదింది. ఆ తర్వాత మొలినెక్స్ ఓవర్లో భారీ షాట్‌కు ప్రయత్నించి టైమింగ్ కుదరక బౌండరీ వద్ద లిచ్‌ఫీల్డ్ చేతికి చిక్కింది. దాంతో, 155 పరుగుల వద్ద టీమిండియ తొలి వికెట్ పడింది. ఆ తర్వాత అనాబెల్ సథర్‌లాండ్ ఓవర్లో ప్రతీకా సైతం వెనుదిరింది. అనంతరం కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్(22), హర్లీన్ డియోల్(38) దూకుడుగా ఆడారు. కానీ, 6 పరుగుల వ్యవధిలోఇద్దరూ ఔటయ్యారు. ఆ దశలో40వ నుంచి జెమీమా రోడ్రిగ్స్ (33), రీచా ఘోష్(32)లు ధనాధన్ ఆడారు. స్ట్రయిట్ రొటేట్ చేస్తూ.. సిక్సర్లు, ఫోర్లతో హోరెత్తిస్తూ హాఫ్ సెంచరీ భాగస్వామ్యం నెలకొల్పారు. అయితే.. సథర్‌లాండ వేసిన 43వ ఓవర్ చివరి బంతికి సిక్సర్ కొట్టబోయిన రీచా వరేహంకు దొరికింది. అక్కడి నుంచి భారత జట్టు వికెట్ల పతనం మొదలైంది. బౌండరీలతో అలరించిన జెమీమాను సథర్‌లాండ్ బోల్తా కొట్టించగా.. దీప్తి శర్మ, స్నేహ్ రానాలు స్వల్ప స్కోర్‌కే వెనుదిరిగారు. దాంతో.. 350 ప్లస్ కొట్టేలా కనిపించిన టీమిండియా అనూహ్యంగా 330కే కుప్పకూలింది.



## ఐసిసి కోడ్ ఉల్లంఘన

### వెస్టిండీస్ పేసర్ మ్యాచ్ ఫీజులో కోత

వెస్టిండీస్ పేసర్ జైడెన్ సీల్స్‌కు అంతర్జాతీయ క్రికెట్ మండలి షాకిచ్చింది. భారత్‌తో జరుగుతున్న ఢిల్లీ టెస్టులో ఐసీసీ నియమావళిని ఉల్లంఘించనందుకు మ్యాచ్ ఫీజులో కోత విధించింది. తొలి ఇన్నింగ్స్‌లో టీమిండియా ఓపెనర్ యశస్వీ జైస్వాల్ వైపు అతడు బంతిని వేగంగా విసరడమే అందుకు కారణం. సీల్స్ చర్యను తప్పుపట్టిన రిఫరీ ఆండీ పైక్రాఫ్ట్ ఐసిసికి ఫిర్యాదు చేశాడు.

భారత ఇన్నింగ్స్ 29వ ఓవర్లో రన్ తీస్తున్న యశస్వీ వైపు సీల్స్ బంతిని వేగంగా విసిరాడు. అది యశస్వీ ప్యాడ్లను తాకింది. దాంతో.. సీల్స్ ఆర్టికల్ 2.9 నిబంధనను ఉల్లంఘించాడని రిఫరీ క్రాఫ్ట్ ఐసీసీకి నివేదించాడు. మ్యాచ్ ముగిశాక విచారణలో విండీస్ పేసర్ తాను రనౌట్‌కు మాత్రమే ప్రయత్నించానని సంజాయిషీ ఇచ్చాడు. కానీ, అందుకు ఆస్కారమే లేదని, ఉద్దేశపూర్వకంగానే అతడు యశస్వీ లక్ష్యంగా బంతిని విసిరాడని రిఫరీ క్రాఫ్ట్ తెలిపాడు. ఐసీసీ నియమావళి ప్రకారం ఆటగాళ్లకు హాని కలిగేలా ప్రవర్తించడం, క్రీడా వస్తువులను విరగ్గొట్టడం, దెబ్బతినేలా చేయడం వంటి వాటిని నేరంగా పరిగణిస్తారు. అందుకే.. తప్పిదానికి పాల్పడినందున సీల్స్‌కు మ్యాచ్ ఫీజులో 24 శాతం కోత విధించారు. అంతేకాదు నిరుడు డిసెంబర్‌లో బంగ్లాదేశ్‌పై కూడా కోడ్ అతిక్రమించినందును.. ఈసారి పొరపాటుతో కలిపి స్పీడ్‌స్టర్‌కు రెండు డీమెరిట్ పాయింట్లు కేటాయించారు.

### రాణించిన హోప్, క్యాంప్‌బెల్

ఢిల్లీ టెస్టులో ఓటమి తప్పించుకునేందుకు వెస్టిండీస్ పోరాడుతోంది. తొలి ఇన్నింగ్స్‌లో కుల్దీప్ యాదవ్ విజృంభణకు చేతులెత్తేసిన విండీస్ బ్యాటర్లు రెండో ఇన్నింగ్స్‌లో జట్టును గట్టెక్కించే ప్రయత్నం చేస్తున్నారు. ఓపెనర్ తగ్‌నరైన్ చందర్‌పాల్ (10) మరోసారి నిరాశపరచగా.. జాన్ క్యాంప్‌బెల్ (87 నాటౌట్) అర్ధ శతకంతో రాణించాడు. అతడికి షాయ్ హోప్ (66 నాటౌట్)తోడవ్వగా వీరిద్దరూ అజేయంగా 138 రన్స్ జోడించారు. దాంతో.. ఆట ముగిసే సిరికి విండీస్ 2 వికెట్ల నష్టానికి 173 పరుగులు చేసింది. అయినా ఇంకా 97 పరుగులు వెనుకంజలోనే ఉంది పర్యాటక జట్టు.


# ఫోకస్ ఆరోగ్యం

## కీళ్ల నొప్పులకు మెరుగైన వైద్యం



ఒకసారి మొదలైతే, జీవితాంతం వేధించే కీళ్ల నొప్పులకు మెరుగైన చికిత్స సమీప భవిష్యత్తులో అందుబాటులోకి రానుంది. వైద్య రంగంలోనే విప్లవాత్మక ఆవిష్కరణగా చెప్పుకోదగిన పరిశోధనలో, 'టైనీ డాన్సింగ్ మాలిక్యూల్స్' (నాట్యం చేసే సూక్ష్మ అణువులు)ను శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. ఇవి మన శరీరంలో కదులుతూ, దెబ్బతిన్న భుజాల, మణికట్టుల, మోకాళ్ల వంటి 'కార్టిలాజ్' ప్రాంతాల్లో ఉండే మృదువైన కండర కవచాన్ని సహజంగా పునరుద్ధరిస్తాయి. సాధారణంగా సంధి నొప్పులు, మోకాళ్ల దెబ్బలు లేదా సంధుల పాడవడం వంటి పరిస్థితులకు శస్త్రచికిత్సలు, ఇంజెక్షన్లు లేదా దీర్ఘకాలిక పునరావాస చికిత్స అవసరమవుతుంది. కానీ, ఈ కొత్తగా తయారైన 'నర్తించే అణువులు' శరీరంలో దెబ్బతిన్న 'కార్టిలాజ్' ప్రాంతాలను స్వయంగా గుర్తించి, చుట్టూ ఉన్న కణజాలాలను కొత్త కణాల పెరుగుదలకు ప్రేరేపిస్తాయి. దీని వల్ల వృద్ధాప్యం, గాయాలు లేదా వాతం కారణంగా వచ్చే నొప్పులు, చాలా తక్కువ సమయంలోనే, ఎలాంటి అదనపు ఔషధాల అవసరం లేకుండా సహజంగానే తగ్గుతాయి. ఈ డాన్సింగ్ మాలిక్యూల్స్ చాలా సూక్ష్మమైనవి అయినప్పటికీ అత్యంత ఖచ్చితత్వంతో పనిచేస్తాయి. ఇవి శరీరంలోని రక్తప్రవాహంలో సజావుగా సంచరిస్తూ, కణాలతో మమేకమై వాటిని పునరుద్ధరణ స్థితిలోకి నడిపిస్తాయి. ముఖ్యంగా, ఇవి శస్త్రచికిత్సలు, కృత్రిమ ఇంప్లాంట్లు లేదా మందుల అవసరం లేకుండా కణజాలం సహజంగా నూతనంగా పునర్నిర్మించుకునేందుకు సహాయపడతాయి. ప్రారంభ పరిశోధనల్లో వీటి వినియోగం వల్ల త్వరితగతిన మానిక ప్రక్రియ జరిగి, జాయింట్ల పనితీరు కూడా మెరుగుపడినట్లు గమనించారు. ఇది ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మందికి, ముఖ్యంగా వృద్ధాప్యంతో సంధి నొప్పులు ఎదుర్కొంటున్న వారికి, విశేషంగా ఉపశమనం అందించే అవకాశముంది. ఈ నూతన వైద్య సాంకేతికత వారి జీవితాలకు తిరిగి చురుకుదనం తెచ్చే శక్తి కలిగి ఉంది.

## వెన్నునొప్పికి 'స్టెమ్' చికిత్స



ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మందిని వేధిస్తున్న వెన్నునొప్పికి జపాన్ పరిశోధకుడు హిదెయుకి ఒకానో నేతృత్వంలో, టోక్యో కియో యూనివర్సిటీలో నిర్వహించిన ఒక క్లినికల్ ట్రయల్ పరిష్కారాన్ని కనుగొంది. మూల కణాలు (స్టెమ్ సెల్స్) ద్వారా చేసిన ప్రయోగం విజవంతమైందని అంటున్నారు. ఒక ప్రమాదంలో వెన్నుపూసకు తీవ్రంగా గాయమై, నడవలేని స్థితిలో ఉన్న ఒక వ్యక్తిపై ఈ కొత్త చికిత్సా పద్ధతిని ప్రయోగాత్మకంగా పరీక్షించారు. వైద్య బృందం ప్రత్యేక మూలకణాలను తీసుకొని, వాటిని బాధితుని వెన్నుపూస గాయపడి ఉన్న ప్రాంతంలో జాగ్రత్తగా ఇన్‌జెక్ట్ చేసింది. ఈ మూలకణాలు ఆ పరిసర నాడీకణాలుగా అభివృద్ధి చెందుతూ గాయాన్ని నివృత్తి చేసే మార్గాన్ని ప్రారంభించాయి. కొన్ని వారాల వ్యవధిలోపే రోగిలో కొన్ని కొంత కదలికలు మొదలయ్యాయి. నెలలు గడిచే కొద్దీ అతను ఎవరైనా సాయం చేస్తే నిలబడగలిగే స్థాయికి చేరుకున్నాడు. దీనిని విప్లవాత్మక పరిణామంగా పేర్కోవాలి. ఎందుకంటే, ఇప్పటి వరకు వెన్నుపూస గాయాల వైద్యానికి శాస్త్రీయంగా, ఎటువంటి శాశ్వతమైన పరిష్కారం లేదు. కానీ స్టెమ్ సెల్ చికిత్స ద్వారా మానవ శరీరంలో మూలకణాలను వివిధ నాడీ కణాలుగా ఆకర్షించి, మరణించిన నాడీ మార్గాలను తిరిగి కుదిర్చే ప్రయత్నంగా ఇది నిలిచింది. థెరపీ ప్రారంభమైన తర్వాత అల్పస్థాయిలోనైనా కదలికలు రావడం, కొన్ని నెలల్లో ఒంటి మీద నిలబడగలడమన్నది వైద్యరంగంలో అత్యంత శక్తివంతమైన జీవిత గమనాన్ని సూచిస్తుంది. ప్రస్తుతానికి ఈ చికిత్స ఇప్పటికీ ప్రయోగాత్మక దశలో ఉన్నప్పటికీ, ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది అంగవైకల్యం గలవారికి నూతన ఆశను, స్వీయావలంబనను నింపే మెరుగైన మార్గాన్ని చూపిస్తోంది. మరిన్ని భారీ క్లినికల్ ట్రయల్స్, పరిశోధనలు అవసరమని నిపుణులు చెబుతున్నారు. మొత్తానికి జపాన్ శాస్త్రవేత్తల పరిశోధన, ఖచ్చితత, నూతనతపై అద్భుత నమ్మకం ప్రతిఫలించింది. ఈ చికిత్సా విధానం పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే, పక్షవాతానికి కూడా చికిత్స సాధ్యమవుతుంది.

## మైక్రోప్లాస్టిక్ 'చింత' తీర్చింది..



అత్యంత ప్రమాదకరమైన మైక్రోప్లాస్టిక్ వివిధ రకాలుగా మన శరీరంలోకి వెళుతున్నదనేది వాస్తవం. దీని వల్ల ఎన్నో ప్రణాంతక వ్యాధులు ప్రబలుతున్నాయి. శరీరంలో విస్తారంగా కలిసిపోతున్న ఈ మైక్రోప్లాస్టిక్‌ను సమర్థవంతంగా అరికట్టగల సామర్థ్యం చింతపండుకు ఉందని పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. తాజా నివేదికనలను అనుసరించి, చింతపండులో సహజంగా ఉండే కొన్ని రసాయనాల వల్ల మైక్రో ప్లాస్టిక్ కణాలు పిండిగా మారుతాయి. వాటిని జీర్ణక్రియ ద్వారా బయటకు పంపించగల సామర్థ్యం చింతపండుకు ఉంది. మైక్రో ప్లాస్టిక్‌లు మన ముఖ్యమైన అవయవాలు, కణాలు, రక్తంలో కనిపిస్తున్నాయి. శరీరంలో వాటిని ఎంత తగ్గించుకుంటే ఆరోగ్యానికి అంత మంచిది. దాదాపుగా ప్రతి ఇంట్లోనూ అందుబాటులో ఉండే చింతపండు లేదా చింతకాయతో ఈ సమస్యకు నివారణ సాధ్యమని పరిశోధకులు అంటున్నారు. అయితే, చింతపండును ఎంత మోతాదులో తీసుకోవాలి, సురక్షితంగా ఎలా వాడాలి అనే కోణంలో పరిశోధనలు జరుగుతున్నాయి. ప్రస్తుతానికి ఈ పరిశోధన వల్ల మైక్రో ప్లాస్టిక్ సమస్యకు చింతపండుతో విముక్తి సాధ్యమనే ప్రాథమిక అంశం రుజువైంది. తదుపరి పరిశోధనలు జరగాల్సి ఉంది.

ఈ శీర్షికన ఇచ్చిన సమాచారం కేవలం పాఠకుల అవగాహన కోసం మాత్రమే. ఆరోగ్య సమస్యలకు వైద్యులను సంప్రదించడం తప్పనిసరి

# భగవాన్‌దాస్ స్ఫూర్తితో ముందుకు

**సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు**

**ఘనంగా సిపిఐ నేత బిఆర్ వర్ధంతి**

**నివాళులర్పించిన ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని, మేయర్ సుధారాణి**



**ప్రజాపక్షం/హనుమకొండ :** బిఆర్ భగవాన్‌దాస్ అందించిన స్ఫూర్తితో ముందుకు సాగుతామని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం ప్రముఖ కార్మిక నేత, సీనియర్ కమ్యూనిస్టు నాయకుడు బిఆర్ భగవాన్ దాస్ 22వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. హన్మకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల జంక్షన్‌లో గల భగవాన్ దాస్ విగ్రహానికి మాజీ ఉపముఖ్యమంత్రి, స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డితో కలిసి సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తక్కళ్లపల్లి మాట్లాడుతూ భగవాన్ దాస్ రాజకీయ వారసులుగా ఆయన చూపిన బాటలో ప్రజల హక్కుల సాధనకు పోరాటాలు నిర్మిస్తామన్నారు. నగరంలో అసంఘటిత రంగ కార్మికుల హక్కులతో పాటు పేదలకు ఇండ్ల స్థలాల కోసం భగవాన్ దాస్ పోరాడారన్నారు. నీతి, నిజాయితీ, నిబద్ధతకు నిలువెత్తు నిదర్శనం బిఆర్ అని కొనియాడారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లాకు ఎస్సారెస్పీ ప్రాజెక్టు రావడానికి పోరాడిన మహనీయుడు భగవాన్‌దాస్ అని గుర్తు చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లా కోసం పోచంపాడు ప్రాజెక్టు సాధన కోసం పోరాడారన్నారు. తాను 1987లో రాజకీయాలలోకి వచ్చిన కొత్తలో అండగా, అన్నగా నిలిచి తనకు అనేక సలహాలు, సూచనలు చేశారని గుర్తు చేసుకున్నారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ సాధన కోసం, ఆజంజాహీ పరిరక్షణకు పోరాడిన ఘనత బిఆర్‌దేనన్నారు. వరంగల్‌లో అసంఘటిత రంగంలో గల ఆటో, హమాలీ, బీడీ, సినిమా వర్కర్స్ కార్మికుల హక్కుల కోసం సంఘాలను ఏర్పాటు చేసిన నిస్వార్థ నాయకులు భగవాన్‌దాస్ అన్నారు. ఆయన స్ఫూర్తితోనే ప్రజల సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, రాష్ట్ర సమితి సభ్యులు సిరబోయిన కర్ణాకర్, ఆదరి శ్రీనివాస్, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, నాయకులు ఎన్.అశోక్ స్టాలిన్, ఏదునూరి వెంకట్రాజం,మునిగాల బిక్షపతి, కొట్టెపాక రవి కార్పొరేటర్ పోతుల శ్రీమాన్, మాజీ కార్పొరేటర్ స్వామి చరణ్,జోరిక రమేష్, డాక్టర్ బి.రాజ్ సిద్దార్థ, బిఆర్ లెనిన్, ఎస్‌టియూ నాయకులు నేదునూరి శ్రీహరి, సిపిఐ నాయకులు యేషబోయిన శ్రీనివాస్,మాలోతు శంకర్, జితేందర్, సంజయ్, సీనియర్ జర్నలిస్టు నాయకులు కె. అనిల్ గౌడ్, పొగాకుల అశోక్, గోకారపు శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాల్సిందే




**సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరుణ కుమారి డిమాండ్**

**ప్రజాపక్షం/మంచిర్యాల :** అంగన్‌వాడీల వేతనాలను 18 వేల రూపాయలకు పెంచుతామన్న ఎన్నికల హామీని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని అంగన్‌వాడీల టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ (ఎఐటియుసి) ప్రధాన కార్యదర్శి కరుణ కుమారి డిమాండ్ చేశారు. మంచిర్యాలలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో కరుణ కుమారి మాట్లాడుతూ రిటైర్మెంట్ బెనిఫిట్స్ టీచర్లకు రూ.10 లక్షలు, హెల్పర్లకు రూ.5లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, పని భారం తగ్గించి, ఖాళీగా ఉన్న సూపన్‌వైజర్ పోస్టులు భర్తీ చేయాలని, గుడ్డు నాణ్యతపై దృష్టి సారించాలని, సొంత భవనాలు నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్, సిపిఐ మంచిర్యాల జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు పాల్గొన్నారు.

**నూతన కమిటీ ఎన్నిక ...:** అంగన్‌వాడీల టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా కళిందర్ అలీఖాన్, అధ్యక్షురాలిగా భూపతిరావు రమాదేవి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పి.సురేఖ, ఉపాధ్యక్షులుగా ఇందిరా, అపర్ణ, శంకరమ్మ, పద్మావతి, సంధ్య, ప్రధాన కార్యదర్శిగా తోకల సరస్వతి, సహాయ కార్యదర్శులుగా రత్న రాజమణి, బి.శారద, ఐత అరుణ, శైలజ, నేరెళ్ల అరుణ, కోశాధికారిగా వై.కుసుమతో పాటు 15 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికలు జరగక కుంటుపడుతున్న అభివృద్ధి

**సిపిఐ భూపాలపల్లి జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్**

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగక గ్రామాల అభివృద్ధి కుంటుపడుతుందని, వెంటనే ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సిపిఐ రావి నారాయణరెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాజ్‌కుమార్ మాట్లాడుతూ ఇప్పటికైనా ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని, లేదంటే కాంగ్రెస్‌కు నష్టం జరిగే అవకాశం ఉందన్నారు. 42 శాతం రిజర్వేషన్ కోసం సుప్రీంకోర్టుకు వెళ్లడం అనేది కాలయాపన తప్ప మరేం లేదన్నారు. చట్టసవరణ చేసైన బిసి రిజర్వేషన్‌కు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపాలన్నారు. స్థానికసంస్థల ఎన్నికల్లో జిల్లాలో రేగొండ, చిట్యాల, మొగుళ్లపల్లి, భూపాలపల్లి మండలాల్లో సిపిఐ పోటీ చేస్తుందన్నారు. ఎంపిటిసి. జెడ్‌పిటిసి, సర్పంచులు అధికస్థానాలు గెలుచుకునే విధంగా ప్రయత్నం ఉంటుందన్నారు. ప్రజా సమస్యలపై నిత్యం పోరాడేది కమ్యూనిస్టులేనని పోరాటాలు నిర్వహించే పార్టీలను ప్రజలు ఆదరించాలని ఈ సందర్భంగా రాజ్ కుమార్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సిపిఐ పట్టణ కార్యదర్శి సోతుకు ప్రవీణ్ కుమార్, క్యాతరాజ్ సతీష్, కొరిమి సుగుణ, గంగసరపు శ్రీనివాస్, నేరెళ్ల జోసెఫ్, గోలి లావణ్య, మహేశ్, పీక రవికాంత్ పాల్గొన్నారు.



## 42 శాతం రిజర్వేషన్ల పేరుతో కాలయాపన

**బిసి బిల్లును కేంద్రంలో బిజెపి ఎందుకు తేల్చలేకపోతున్నారు**

**సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి**




**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** స్థానిక సంస్థల ఎన్నికలలో సిపిఐ పార్టీ జడ్పిటిసి, ఎంపిటిసి, సర్పంచులకు పోటీ చేసేందుకు నిర్ణయం తీసుకుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి తెలిపారు. ఆదివారం రాజన్న సిరిసిల్ల జిల్లా సిపిఐ కార్మిక భవన్‌లో సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. 73,74 రాజ్యాంగ సవరణ ప్రకారం ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి స్థానిక సంస్థల ఎన్నికలు జరగాలని తెలంగాణ ప్రభుత్వం బిసిలకు స్థానిక సంస్థల ఎన్నికలలో రిజర్వేషన్లు కల్పిస్తామని కాలయాపన చేస్తూ వస్తుందని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని, లేదంటే కాంగ్రెస్ కు నష్టం జరిగే అవకాశం ఉందన్నారు. 42 శాతం రిజర్వేషన్ కోసం సుప్రీంకోర్టుకు వెళ్లడం అనేది కాలయాపన తప్ప మరేం లేదన్నారు. స్థానిక సంస్థలకు కేంద్రం నుండి రూ.300 కోట్ల గ్రాంట్ రావాలని, అది ఇవ్వక కేంద్రంలో చట్ట సవరణకు పెట్టిన బిల్లును ఆమోదించక పెండింగ్‌లో పెడుతుందని ఆరోపించారు. బిసి లకు 42 శాతం రిజర్వేషన్ ఉండాల్సిందే అని చెబుతున్న కేంద్ర మంత్రి బండి సంజయ్ రిజర్వేషన్ బిల్లును కేంద్రంలో ఎందు కు తేల్చలేక పోతురన్నారన్నారు. బిజెపికి చిత్తశుద్ధి ఉంటే బిసి రిజర్వేషన్ బిల్లును వెంటనే తేల్చాలన్నారు. అసెంబ్లీలోతీర్మానం చేసి గవర్నర్‌కు బిల్లును పంపితే కేంద్రం ఎందుకు అమలు చేయక నాటకాలు ఆడుతుందని మండిపడ్డారు. నరేంద్ర మోదీ బిసి అని చెబుతూ బిసిలకు ఏమి చేశాడో చెప్పాలన్నారు. రాష్ట్రంలో బిజెపి నాయకులు 42 శాతం ఉండాలని అంటూ కేంద్రంలో అమలు చేయకపోవడం వెనుకాల ఉన్న నాటకం ఏమిటన్నారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించక సుమారు రెండు సంవత్సరాలు గడుస్తుందని, స్పెషల్ ఆఫీసర్ల పరిపాలన అరకొరగా సాగుతూ ఉంటే జరగాల్సిన అభివృద్ధి పనులు కుంటుపడుతున్నాయన్నారు. హైకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం రాజ్యాంగంలో 50 శాతం రిజర్వేషన్ మించకూడదని ఉందని హైకోర్టు చెబితే, రేవంత్‌రెడ్డి తమిళనాడులో అమలులో ఉందని అంటున్నారని, రిజర్వేషన్లు ఖరారై షెడ్యూలు విడుదల అయిన తరువాత అయోమయానికి గురి చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో అన్ని పార్టీలు కేంద్రంపై ఒత్తిడి తీసుకొస్తే బిసిలకు న్యాయం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో కుల జనగణన చేపడితే కేంద్రంలో చేపట్టలేక పోవడానికి ఆంత ర్యం ఏందన్నారు. చండీగర్‌లో జరిగిన సిపిఐ 25వ జాతీయ మహాసభలో కేంద్రంలో కులగనన చేపట్టాలని డిమాండ్ చేసిందన్నారు. కేంద్రం ఆర్థికంగా బలపడుతుందని పత్రిక కథనాలు వస్తూ ఉంటే దేశంలో పేదవాడు పేదవానిలాగానే ఉంటున్నాడని, ఆదాని, అంబానికి లక్షల కోట్లు ఏ విధంగా వచ్చాయన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులకు మూడు నెలల నుంచి జీతాలు రానీ దుస్థితి దేశంలో ఉన్నప్పుడు ధనిక దేశం ఏ విధంగా అవుతుందన్నారు. కొద్ది మంది చేతుల్లోకి సంపద వెళుతుందని సంపదను గుప్పి ట్లో పెట్టుకుని పేదరికం పెంచి పోషిస్తున్నారన్నా రు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి మంద సుదర్శన్, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కదారి రాములు, అనసూయ తదితరులు పాల్గొన్నారు.

## కమలాపూర్ పేపర్ మిల్లు పునరుద్ధరణ ఎప్పుడు..?

**ఎఐటియుసి ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్**

**ప్రజాపక్షం/ములుగు/మంగపేట :** కమలాపూర్ పేపర్ మిల్లును ఎప్పుడు పునరుద్ధరిస్తారని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఆదివారం ఎఐటియుసి మంగపేట మండల మహాసభ గడ్డం భారతి అధ్యక్షతన కమలా జంపాల రవీందర్ ఎఐటియుసి జెండా ఎగుర వేశారు. అనంతరం మాట్లాడుతూ వరంగల్ ఉమ్మడి జిల్లాలోని మంగపేట మండలంలో గల ఏకైక పరిశ్రమ మూతపడి పదమూడు సంవత్సరాలు దాటినా పునరుద్ధరిస్తామని హామీలు ఇచ్చిన మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన జిల్లా, మండల నాయకులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. పాత కంపెనీని టేకోవర్ చేసిన విఎస్‌టి యాజమాన్యం ఎక్కడా అని నిలదీశారు. ఈ పాంతం ప్రజలు, ప్రజాప్రతినిధులు కమలాపూర్ పేపర్ మిల్లును పోరాడి సాధించుకోవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో యూనియన్ నాయకులు బండి జయమ్మ, మద్దిబోయిన భారతి, ఎస్కే షఫియా, గడ్డం భారతి, ఆలం హేమ, ఈసాల రమాదేవి, బల్లెం రాములు, కొడాలి తులసి, కె శ్రీదేవి, వాసం నాగేంద్ర, తాలూక వెంకటనర్సమ్మ, విజయ లక్ష్మి , కోరం పద్మ, అమీన, పాగ పద్మ, ఖైరున్, బుచ్చమ్మ, అఖిల, శ్రీలత, రేష నానమ్మ, తదితరులు పాల్గొన్నారు.





# స్థానికం
REGIONAL NEWS
కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## నేడు ప్రజావాణి కార్యక్రమం పునఃప్రారంభం: కలెక్టర్



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్:** 2వ సాధారణ జెడ్.పి.టి.సి,ఎం.పి.టి.సి ఎన్నికల నిర్వహణ కారణంగా తాత్కాలికంగా నిలిపివేయడం తో నేటి నుంచి ప్రజావా ణి కార్యక్రమం సోమవారం నుండి యధావిధిగా కొ నసాగించబడుతుందని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఒక ప్రకటనలో తెలిపారు.ప్రతి సోమవారం స మీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమం యథాతథంగా నిర్వహించబడుతుందని తెలిపారు.ప్రజలు,అర్జీదారులు తమ సమస్యలు,ఫిర్యాదులు,విజ్ఞప్తులను నేరుగా అ ధికారుల సమక్షంలో సమర్పించుకోవచ్చని చెప్పా రు.ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రజావాణి ము ఖ్య వేదికగా నిలుస్తోందని,ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు.

## మధుకర్ ఆత్మహత్యపై సమగ్ర విచారణ జరిపించాలి

బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్



**ప్రజాపక్షం / బెల్లంపల్లి :** వేమనపల్లి మండల బిజెపి అధ్యక్షుడు ఏటా మ ధుకర్ ఆత్మహత్య ఘటనపై పోలీసులు సమగ్ర విచారణ జరిపించి, దీనికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బెల్లంపల్లి శాసనసభ్యుడు గడ్డం వినోద్ వెంకట స్వామి అన్నారు. మండల బిజెపి అధ్యక్షుడు ఏటా మధుకర్ ఆత్మహత్య ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గడ్డం వినోద్ మాట్లాడుతూ ఈ సంఘటన వెనుక ఉన్న నిజాలను వెలికితీసి మధుకర్ ఆత్మహత్యకు ప్రేరేపించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, పోలీసులు నిష్పక్షపాతంగా, వేగవంతమైన విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి అని అన్నారు. ఇలాంటి సంఘటనలు మళ్లీ జరగకుండా పోలీసులు కఠినంగా వ్యవహరించాలని ఆయన కోరారు. అలాగే ఆయన మృతుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ప్రభుత్వ స్థాయిలో అన్ని విధాలా సహాయం అందించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

## 'ఆయా' ఉద్యోగాలకు మహిళల నుంచి దరఖాస్తులు ఆహ్వానం

**ప్రజాపక్షం / కాగజ్ నగర్ :** కాగజ్ నగర్ మండలంలోని మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాల, ఎఫ్ క్వార్టర్స్, కోయవాగు (ఉర్దూ మీడియం) పాఠశాలల్లో ప్రీప్రైమరీ తరగతుల నిర్వహణ కోసం ఆయాగా పనిచేయడానికి మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్ తెలిపారు. 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఖాళీలలో నియామకాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. దరఖాస్తు చేసుకునే మహిళా అభ్యర్థులు 18 నుంచి 44 సం॥ మధ్య వయస్సు కలిగి ఉండాలని, కనీస విద్యార్హతగా ఏడవ తరగతి ఉత్తీర్ణత తప్పనిసరి అని పేర్కొన్నారు. అభ్యర్థులు అదే గ్రామపంచాయతీ లేదా సమీప గ్రామపంచాయతీకి చెందినవారై ఉండాలని, స్థానికత, మెరిట్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారని అన్నారు. ఎస్సీ, ఎస్టి మహిళా అభ్యర్థులకు 5 సంవత్సరాలు, ఎక్స్ సర్వీస్ ఉమెన్‌కు 3 సంవత్సరాలు, దివ్యాంగ మహిళలకు 10 సం॥ వయస్సు సడలింపు ఉంటుందని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 16వ తేదీ లోగా ఎంపిపిఎస్ కోయవాగు పాఠశాల యందు నిర్ణీత ప్రొఫార్మాలో రెండు సెట్ల జిరాక్స్ ప్రతులకు గెజిటెడ్ అధికారి సంతకం చేయించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## బాసర నుండి శబరిమలకు అయ్యప్ప పాదయాత్ర ప్రారంభం



**ప్రజాపక్షం/బైంసా :** సునీల్ దత్ గురుస్వామి ఆధ్వర్యంలో బాసర పుణ్యక్షేత్రం నుండి శబరిమల అయ్యప్ప సన్నిధానానికి పాదయాత్ర ప్రారంభమైంది.ఈ యాత్రలో 40 మంది అయ్యప్ప మాలధారులు పాల్గొంటున్నారు.పాదయాత్రను ప్రారంభించినా సందర్భంగా ఎమ్మెల్యే రామారావు మాట్లాడుతూ పాదయాత్ర విజయవంతంగా పూర్తి కావాలని సరస్వతీ అమ్మవారిని మొక్కుకున్నట్లు తెలిపారు.హిందువులంతా సుఖసంతోషాలతో ఉండాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు.రాష్ట్రాల సరిహద్దుల వద్ద అఖిల భారతీయ ధర్మ ప్రచార సభ స్వాగతం పలికి భక్తుల కోసం ఏర్పాటు చేస్తుందని గురుస్వామి సునీల్‌దత్ తెలిపారు.

## ఎమ్మెల్యేను పరామర్శించిన మంత్రి



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** నగరంలోని కంఠేశ్వర్ బైపాస్‌లోని రూరల్ క్యాంప్ కార్యాలయంలో రూరల నియోజకవర్గ ఎమ్మెల్యే ఆర్.భూపతిరెడ్డిని తెలంగాణ రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి వర్ధన్నపేట్ ఎమ్మెల్యే నాగరాజు ఆదివారం పరామర్శించారు. రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి మాతృమూర్తి రేకులపల్లి లక్ష్మీ నర్సమ్మ గత నెల 29న మృతి చెందిన సందర్భంగా రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి, వర్ధన్నపేట్, ఎమ్మెల్యే నాగరాజు భూపతిరెడ్డిని ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. భూపతిరెడ్డి మాతృమూర్తికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తెలంగాణ కోఆపరేటివ్ యూనియన్ చైర్మన్, డిసిసిఅధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి,పిసిసి డెలిగేట్ శేఖర్‌గౌడ్,పిసిసి అధికార ప్రతినిధి వేణుయాదవ్, డిసిసి ప్రధాన కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, సీనియర్ నాయకులు , ఎఎంసి బాగారెడ్డి, మాజీ సర్పంచ్ మోహన్, రూరల్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సొసైటీ చైర్మన్లు, డైరెక్టర్లు, సీనియర్ నాయకులు కార్యకర్తలు అధికారులు పాల్గొన్నారు.

## రోడ్లపై మక్కలు ఆరబోస్తుంటే పట్టించుకోని అధికారులు

పరేషాన్‌లో వాహనదారులు

**ప్రజాపక్షం/మోర్తాడ్:** నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలంలోని పాలెం, తిమ్మాపూర్, దొన్కల్, ధర్మోరా, శెట్పల్లి, సుంకేట్, మోర్తాడ్ మండల కేంద్రంతో పాటు మండలంలోని వివిధ గ్రామాలలో రైతులు పండించి నూర్పిడి చేసిన మొక్కజొన్న మక్కలను, సోయాలను రోడ్లపై ఆరబెట్టడం వల్ల ఆ రోడ్ల వెంబడి వెళ్లే వాహనదారులకు ఇబ్బంది కలగడమే కాకుండా ప్రమాదాలు వాటిల్లుతాయని వాహనదారులు ఆరోపిస్తున్నారు. సంబంధితఅధికారులు నిత్యం చూస్తున్నప్పటికీ కూడా రోడ్లపై మక్కలు, సోయాలు, ఆరబెట్టే వారిపై అన్ని గ్రామాలలో కూడా రోడ్లపై మక్కలు, సోయాలు అరబెడతున్నారని ప్రభుత్వ అధికారులు మాదేం పోతుందిలే అని చూస్తూ చూడనట్లుగా వెళ్లిపోతున్నారని వాహనదారులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు తక్షణమే చర్యలు చేపట్టి రోడ్లపై మక్కలు కానీ ఇతర పంటలను కానీ ఆరబెట్టకుండా చూస్తూ వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని సంబంధిత అధికారులను కోరుతున్నారు.

# ముంపు బాధితులందరికీ పరిహారం అందిస్తాం

రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్





**ప్రజాపక్షం /చెన్నూరు :** కాళేశ్వరం ప్రాజెక్టులో భూములు కోల్పోయిన అర్హులైన ముంపు బాధితులు అందరికీ పరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటామని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. చట్టం ప్రకారం అర్హులైన బాధితులకు న్యాయం చేస్తామని తెలిపారు. చెన్నూరు పట్టణంలోని శాసనసభ్యుల క్యాంపు కార్యాలయంలో కోటపల్లి మండలం బబ్బెర చెలక, దేవులవాడ గ్రామాల రైతులతో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టు కంటే ముందు 36 వేల కోట్ల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టిన ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు నిర్మాణాన్ని గత ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్ల ఈ ప్రాంతంలో 55 వేల ఎకరాల ఆయకట్టు భూమిలో రైతులు పంట సాగు చేసే అవకాశం కోల్పోయారని, భూములు కోల్పోయే పరిస్థితి ఉండేది కాదని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వం చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు కారణంగా బ్యాక్ వాటర్‌తో పంట పొలాలు, నివాస ప్రాంతాలు ముంపుకు గురై ప్రజలు నష్టపోయారని, వారికి పూర్తి స్థాయిలో నష్టపరిహారం చెల్లించలేదని విమర్శించారు. ముంపు బాధితుల సంక్షేమంలో భాగంగా ఇప్పటి వరకు 10 కోట్ల రూపాయలు కేటాయించి అర్హులైన వారికి అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ముందుగా అసలైన పట్టేదారు రైతులకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని, అర్హులైన మిగతా వారికి సైతం పరిహారం అందిస్తామని అన్నారు. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఉచిత బస్సు ప్రయాణం, 500 రూపాయలకే రాయితీ గ్యాస్ సిలిండర్, రైతు భరోసా, రైతు బీమా వంటి అనేక ప్రజా ప్రయోజనకర పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ అర్హులైన ముంపు బాధితులందరికీ పరిహారం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, ఎలాంటి వివాదాలు లేని భూములకు అవార్డు జారీ చేయడం జరుగుతుందని, డిసెంబర్ 18, 19 తేదీలలో అర్హులైన వారికి అందించడం జరుగుతుందని తెలిపారు. వివాదాలలో రాజీ అయిన వారికి నిబంధనల ప్రకారం చెల్లింపులు జరుగుతాయని, లేని పక్షంలో అవార్డు మొత్తమును సంబంధిత కోర్టులో జమ చేయడం జరుగుతుందని తెలిపారు. 33 కోట్ల రూపాయలలో 5 కోట్ల రూపాయలు మంజూరు చేయడం జరిగిందని, మరో 5 కోట్ల రూపాయలు పిడి ఖాతాలో ఉన్నాయని తెలిపారు. బాధితులు ఆందోళన చెందవలసిన అవసరం లేదని అన్నారు. ఈ కార్యక్రమానికి మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు, కోటపల్లి మండల తహసిల్దార్ రాఘవేంద్ర, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, ముంపు బాధిత ప్రజలు తదితరులు హాజరయ్యారు.

## ఇందిరమ్మ ఇల్లు నిర్మాణ పనులకు శంకుస్థాపన



**ప్రజా పక్షం/కాగజ్ నగర్:** కాగజ్ నగర్ పట్టణంలోని ద్వారకా నగర్‌కు చెందిన కీర్తి సరస్వతమ్మకు మంజూరైన ఇందిరమ్మ ఇల్లు నిర్మాణ పనులలో భాగంగా స్లాబ్ నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. సిర్పూర్ శాసనసభ్యులు డా. పాల్వాయి హరీష్‌బాబు ముఖ్య అతిథిగా పాల్గొని భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు త్వరగా ఇంటి నిర్మాణం పూర్తి చేసుకోవాలని, అర్హులైన వారందరికీ ప్రభుత్వ ఇల్లు మంజూరు చేసే విధంగా కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. పట్టణ ప్రధాన కార్యదర్శి కొండ తిరుపతి, చేరాల శ్రీనివాస్, పెద్ది హరీష్, అనిల్‌పాల్గొన్నారు.

**పాముకాటుకు గురైన విద్యార్థిని పరామర్శించిన శాసనసభ్యుడు**

కాగజ్‌నగర్ పట్టణంలోని మహాత్మా జ్యోతిబా పూలే బాలుర వసతి గృహంలో పాము కాటుకు గురైన విద్యార్థి ఆదే విజయ్‌ను సిర్పూర్ శాసనసభ్యులు డా. పాల్వాయి హరీష్ బాబు ఆదివారం ఆసుపత్రిలో పరామర్శించారు. 7వ తరగతి చదువుతున్న అంకుసాపూర్ గ్రామానికి చెందిన విద్యార్థి శనివారం సాయంకాలం పాము కాటుకు గురయ్యాడు. ఎమ్మెల్యే వైద్యులతో మాట్లాడి మెరుగైన చికిత్స అందించాలని సూచించారు. విద్యార్థి త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

## గంజాయి నిర్మూలనకు డ్రోన్ పర్యవేక్షణ

ఆసిఫాబాద్ ఎఎస్‌పి చిత్తరంజన్



**ప్రజాపక్షం / కేరిమేరి :** గంజాయి సాగు జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి, వాటిని పూర్తిగా ని ర్మూలించేందుకు పోలీస్ శాఖ కఠిన చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా ఆదివారం ఆసిఫాబాద్ ఎఎస్‌పి చిత్తరంజన్ డ్రోన్ సహాయంతో పంటభూములపై పర్యవేక్షణ నిర్వహించారు.కెరమెరి మం డలం నారాయణగూడ గ్రా మం, అంతపూర్ గ్రా మ పంచాయతీ పరిధిలోని రాథోడ్ బాలాజీ అనే వ్యక్తి వ్యవసాయ పొలంలో డ్రోన్ సర్వే ద్వారా 51 గంజాయి మొక్కలను గుర్తించారు. పోలీసులు ఆ మొక్కలను స్వాధీనం చేసుకుని, సంబంధిత వ్యక్తి పై చట్టపరమైన చర్యలు ప్రారంభించారు. ఈ స ందర్భంగా ఎఎస్‌పి మాట్లాడుతూ గంజాయి సా గు, అమ్మకం, వినియోగం, రవాణా చట్టపరంగా నేరమని, అక్రమ కార్యకలాపాల్లో పాల్గొన్న వా రిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ ంజాయి, మాదక ద్రవ్యాలు యువత భవిష్యత్తును నాశనం చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. డ్రోన్ సర్వే ద్వారా గంజాయి మొక్కలు సాగు జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి, సంబంధిత మండల పోలీస్ అధికారులు, ఎక్సైజ్, రెవెన్యూ శాఖలతో సమన్వయం చేసుకుని వెంటనే నిర్మూలన చర్యలు తీసుకుంటామని తెలిపారు. జూన్ 2025 నుంచి ఇప్పటివరకు ఆసిఫాబాద్ సబ్ డివిజన్‌లో 51 కేసులు నమోదు చేసి, 560 మొక్కలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గంజాయి సాగు జరుగుతున్న సమాచారాన్ని వెంటనే డయల్ 100 లేదా 8712670551 నంబర్‌కు కాల్ చేసి పోలీసులకు తెలియజేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచి తగిన పారితోషికం అందిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వాంకిడి సర్కిల్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ, కేరిమేరి ఎస్ఐ మధుకర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## రంగంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ


నిర్దేశిత వైద్య సేవలు సకాలంలో ప్రజలకు అందించాలని కలెక్టర్ రాహుల్ రాజ్

వైద్యాధికారులకు ఆదేశం




**ప్రజాపక్షం/కొల్చారం:** కొల్చారం మండలం రంగంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆదివారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఓపి రిజిస్టర్, సిబ్బంది హాజర పట్టిక , మందుల స్టాక్ రిజిస్టర్ ఆసుపత్రి పరిసరాలు పరిశీలించి వైద్యాధికారులు సిబ్బందికి పలు సూచనలు చేశారు. సీజనల్ వ్యాధుల కేసులు, వాటికి సంబంధించిన మందులు అన్ని అందుబాటులో ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. దవాఖానలో ఇబ్బందులు ఏమైనా ఉన్నాయా, సీజనల్ వ్యాధుల నియంత్రణ, పరిసరాల పరిశుభ్రత పై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సబ్ సెంటర్ లో అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలి సాధారణ ప్రసవాలను ప్రోత్సహించేలా అవసరమైన చర్యలు చేపట్టారన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎల్లవేళలా వైద్యులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజారోగ్య పరిరక్షణకు విశేష కృషి చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నిజాంసాగర్‌లోకి 13,562 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



**ప్రజాపక్షం/నిజాంసాగర్:** నిజాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుండి 13,562 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుందని ప్రాజెక్టు అధికారులు వెల్లడించారు. వస్తున్న నీటిని ప్రాజెక్టు పూర్తిస్థాయి కెపాసిటీ 1405.00 అడుగులు, పూర్తి నీటి సామర్థ్యం 17.802 టీఎంసీలమేరకు నిల్వ ఉంచుతూ ప్రధాన వరద గేట్లు రెండు ఎత్తివేసి 13,562 క్యూసెక్కుల నీటిని మాంజీరాలోకి వదులుతున్నామని, అదేవిధంగా పంట కాలువకు 1200 క్యూసెక్కుల నీరు వదులుతున్నట్లు తెలిపారు.

## కౌలు రైతుల కష్టాలు పట్టించుకునేదెవరు?



**ప్రజాపక్షం / నందిపేట్ ;** కౌలు రైతులకు పెట్టుబడి సహాయం కింద రైతు భరోసా ఇస్తామని ఎన్నికల ముందు కాంగ్రెస హామీ ఇచ్చింది. ఇప్పుడు ఆ హామీ హామీగానే మిగిలిపోయింది. రైతు భరోసా భరోసాగానే మిగిలిపోయింది. ప్రభుత్వం ఖరీఫ్‌లో సన్నవరి రకాలకు క్వింటాలుకు రూ. 500 రైతులకు బోనస్‌గా ఇచ్చింది. దీంతో కౌలు ధరలు అమాంతంగా పెరగడంతో ప్రభుత్వం పెట్టుబడి సహాయం ఇవ్వకపోవడంతో వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి అప్పుల పాలవుతున్నారు.

ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సుమారు 14 నెలలు కావస్తున్నా కౌలు రైతుల రైతు భరోసా గురించి మాటెత్తడం లేదు. కానీ ఉపాధి హామీలో పని చేస్తున్నభూమి లేని రైతు కూలీలకు సంవత్సరానికి 12 వేలు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం పేరుతో జనవరి నెల 26న (రిపబ్లిక్ దినోత్సవం) సిఎం ఈ పథకాన్ని ప్రారంభించారు. కానీ కౌలు రైతుల గురించి కనీసం మాట ఎత్తలేదు. ప్రభుత్వం రైతులకు ఇస్తున్న ప్రాధాన్యత కౌలు రైతులకు ఇవ్వడం లేదని, వ్యవసాయ భూమి ఉన్న వారినే రైతులుగా గుర్తిస్తు కౌలు రైతులను పట్టించుకునే వారు కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో కౌలు రైతులే సగానికి పైగా ఉన్నారు. పెద్ద రైతులు అన్న రేటుకే కౌలు చెల్లించాలి. ప్రస్తుతం రెండు పంటలకు ఎకరానికి ఇరవై వేల నుండి ముప్పై వేల రూపాయలు ముందుగానే చెల్లించి పంటలు పండించుకొంటున్నారు. ఈ యాసంగిలో కౌలు రేట్లు రైతులు అమాంతంగా పెంచారు. పంట పండినా, పండకపోయినా కౌలు చెల్లించాల్సిందే. భూ యజమానులకు ప్రభుత్వం ఇచ్చే రైతు భరోసా, బ్యాంకులో పంట రుణాలు, రైతు బీమా వంటి ప్రభుత్వ పథకాలు వారికే దక్కుతాయి. కౌలు రైతులకు ఇవేమి వర్తించవు. వీరు వడ్డీ వ్యాపారుల వద్ద అప్పు తీసుకొని పంటలు వేసుకుంటారు. పంట చీడ పీడల వల్ల దిగుబడి తగ్గినా భూ యజమానులకు సంబంధం లేదు. అందుకే ప్రభుత్వం కౌలు రైతులకు ప్రభుత్వ రుణాలు, పథకాలు ఇస్తు రుణ మాఫీ, రైతు బీమా వర్తింపజేయాలి. సన్నకారు చిన్నకారు రైతుల మాదిరిగా అన్ని సౌకర్యాలు కల్పించాలి. అప్పుడే వారికి మేలు జరుగుతుంది. ఇచ్చిన హామీని నెరవేర్చవలసిన బాధ్యత ప్రభుత్వం మీద ఉంది. ఏమి చేస్తారో వేచి చూడాలి..

## వర్షానికి ప్రమాదంగా మారిన రోడ్లు



**ప్రజాపక్షం/రేగోడ్:** ఇటీవల కురిసిన వర్షానికి రోడ్డులు ప్రమాదకరంగా మారాయి రోడ్ల పై గుంతలుగా మారయి రోడ్లుతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొటున్నారు రేగోడ్ అల్లాదుర్గం రోడ్లుతోపై ఇటీవల కురిసిన వర్షానికి గుంతలు పడ్డాయి అసలే సింగిల్ రోడ్డు ఆపై గుంతలతో ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారు రేగోడ్ మర్పల్లి మధ్య బ్రిడ్జి నిర్మాణం కోసం వదిలేసిన రోడ్డు అద్వానంగా మారింది ఇటీవల కురిన వర్షానికి గోతులు ఏతులు ఏర్పడ్డాయి పోచారం రయపల్లి రోడ్డు అద్వానంగా మారింది అప్పట్లోనే గుంతలు ఉండగా ఇటీవల కురిన వర్షానికి భారీ గుంతలు ఏర్పడ్డాయి అధికారులు ప్రమాదాలు జరగక ముందే జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## 'సంఘటన్ సృజన్ అభియాన్'లో పాల్గొన్న ఎమ్మెల్యే




**ప్రజాపక్షం/నిజాంసాగర్/పిట్లం:** సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుని ఎంపికకు సంబంధించి జిల్లాలో నిర్వహించిన సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమానికి జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు హజరయ్యారు. ఏ పార్టీలో లేని విధంగా రాహుల్‌గాంధీ ఆదేశానుసారం దేశంలోనే మొట్ట మొదటగా అత్యంత పారదర్శకంగా కార్యకర్తల అభిప్రాయం సేకరించి జిల్లా అధ్యక్షున్ని ఎంపిక చేయడం కాంగ్రెస్‌లోనే జరుగుతుందన్నారు. పార్టీ కొరకు కష్టపడ్డ కార్యకర్త స్థాయి నుండి పెద్ద స్థాయి నుండి పెద్ద స్థాయి నాయకుల వరకు అందరూ జిల్లా అధ్యక్ష పదవికి పోటీ పడవచ్చునని తెలిపారు. అన్ని జిల్లాలకు అధ్యక్షులను నియమించడం కొరకు ప్రతీ జిల్లాకు ఒక అబ్జర్వర్‌ను ఇంచార్జిని నియమించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి ఏఐసీసీ కార్యదర్శిని సంగారెడ్డి జిల్లా అబ్జర్వర్‌గా నియమించినట్లు తెలిపారు.

## బాణాసంచా విక్రయాలకు అనుమతి తప్పనిసరి: ఎస్‌పి



**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** రాబోయే దీపావళి పండుగను దృష్టిలో ఉంచుకుని ప్రజలందరూ ఆనందంగా,సురక్షితంగా జరుపుకోవాలని ఎస్‌పి జానకి షర్మిల సూచించారు.ప్రజల భద్రత, క్షేమం కోసం బాణాసంచా విక్రయాల కోసం తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని ఆమె స్పష్టం చేశారు.

**అనుమతి లేకుంటే కఠిన చర్యలు...**

ఎలాంటి అనుమతులు లేకుండా బాణాసంచా దుకాణాలను ఏర్పాటు చేసినా,సరైన భద్రతా ప్రమాణాలు పాటించకుండా విక్రయాలు జరిపినా,ప్రేలుడు పదార్థాల చట్టం(Explosives Act) ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.దీపావళి నేపథ్యంలో బాణాసంచా తయారీదారులు సరఫరాదారులు,విక్రయదారులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు జరిపే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని ఆమె స్పష్టం చేశారు.

**పాటించవలసిన భద్రత..**

విక్రయదారులు తప్పనిసరిగా దుకాణాల మధ్య కనీ స దూరం పాటించాలని,అగ్ని మాపక పరికరాలను సిద్ధంగా ఉంచాలని,విద్యుత్ లైన్ల దగ్గర బాణాసంచాను నిల్వ చేయకూడదని ఎస్పీ సూచించారు.అంతేకాకుండా,మైనర్లు (చిన్న పిల్లలు) విక్రయాలలో పాల్గొనరాదని ఆమె ఆదేశించారు.

# స్థానికం REGIONAL NEWS

## కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్



## రాజన్నను దర్శించుకున్న రాష్ట్ర సిఎం ఓఎస్‌డి



**ప్రజాపక్షం/ వేములవాడ :** వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి ఓఎస్‌డీ వేముల శ్రీనివాస్ ఆదివారం రాజన్నను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు ఆలయ అర్చకులు, వేద పండితులు స్వస్తి వాచనంతో స్వాగతం పలికారు. ప్రత్యేక దర్శనం అనంతరం మండపంలో అర్చకులు ఆశీర్వచనం అందజేశారు. ప్రధాన ఆలయ ఏఈఓ బి.శ్రీనివాస్, వేముల శ్రీనివాస్ కు శేష వస్త్రం కప్పి, లడ్డు ప్రసాదాన్ని అందజేశారు.

## నేడు యథావిధిగా ప్రజావాణి: కలెక్టర్



**ప్రజాపక్షం/కరీంనగర్:** ప్రజల సమస్యల సత్వర పరిష్కారం కోసం జిల్లా కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం నేడు యథావిధిగా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రజలు ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

## ప్రజలకు నాణ్యమైన వైద్యాన్ని అందించాలి: గంగుల



**ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ:** కరీంనగర్ పట్టణంలోని మాతా శిశు సంక్షేమ హాస్పిటల్ చౌరస్తాలో నూతనంగా ఏర్పాటు చేసినటువంటి వెంకటాద్రి హాస్పిటల్‌ను ఆదివారం నగర బిఆర్ఎస్ అధ్యక్షుడు చల్ల హరిశంకర్‌తో కలిసి హాస్పిటల్‌ను మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ప్రారంభించారు. ఆస్పత్రి ప్రారంభోత్సవానికి విచ్చేసిన ఎమ్మెల్యే కమలాకర్‌కు నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛాన్ని అందించి శాలువాతో సత్కరించారు. అనంతరం ఆసుపత్రిలో ప్రత్యేక పూజలు చేసి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా హాస్పిటల్‌లో ఉన్న వసతులను, వైద్య సేవల గురించి డాక్టర్ల నుంచి అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్యాన్ని అందించాలని వైద్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌తో పాటు వారి సోదరుడు ప్రముఖ వ్యాపారవేత్త గంగుల సుధాకర్, బిఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, ఆస్పత్రి యాజమాన్యం, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ బిల్లులు చెల్లించాకే 'స్థానిక' ఎన్నికలకు వెళ్లాలి

**ప్రజాపక్షం/గంగాధర:** మాజీ ఎంపిటిసిలు, మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లులు తక్షణమే విడుదల చేయాలని గంగాధర మండలం వెంకటాయపల్లి గ్రామ మాజీ సర్పంచ్ శ్రీమల్ల మేఘరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శ్రీమల్ల మేఘరాజు మాట్లాడుతూ ప్రజాసేవ చేసే అవకాశం వచ్చిందని మురిసిపోయి ఎన్నుకున్న ప్రజల కోసం గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సర్పంచులు, ఎంపిటిసిలు అప్పులు తీసుకొచ్చి గ్రామాలు, తండాలలో అభివృద్ధి పనులు చేపట్టారన్నారు. రూ. లక్షలు వెచ్చించి అభివృద్ధి పనులు చేసినా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ప్రభుత్వం మారిపోవడం, పదవులు ముగిసిపోయి దాదాపు రెండు సంవత్సరాలు కావస్తున్నా బిల్లులు చెల్లింపు సమస్య పరిష్కారానికి నోచుకోలేదన్నారు. ఆర్థిక ఇబ్బందులతో, తెచ్చిన అప్పులు వడ్డీ కట్టలేక సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని విస్మరించి కాలయాపన చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని, లేని పక్షంలో ఓట్ల కోసం వచ్చే పాలకులను గ్రామాల్లో అడ్డుకుంటామని హెచ్చరించారు.

## రోడ్డు ప్రమాదంలో వైద్యుడి దుర్మరణం



**ప్రజాపక్షం/ధర్మపురి :** జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణానికి చెందిన పిల్లల వైద్యులు డా.జగదీష్ చంద్ర కస్తూరి (34) ఆదివారం తెల్లవారుజామున హైదరాబాద్ లో జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు. ధర్మపురి పట్టణానికి చెందిన ప్రముఖ కాంగ్రెస్ నాయకులు కస్తూరి రాం కిషన్ పెద్ద కుమారుడైన డా.జగదీష్ చంద్ర హైదరాబాద్ లోని కిమ్స్ ఆసుపత్రిలో పిల్లల వైద్యులుగా సేవలందిస్తున్నారు.ఆదివారం తెల్లవారుజామున తను పనిచేస్తున్న హాస్పిటల్ నుండి అత్యవసర ఫోన్ కాల్ రావడంతో రాపిడో బైక్ హైర్ చేసుకుని రోడ్డుపై వెళ్తుండగా వేగంగా వచ్చిన లారీ వీరి బైక్ ను ఢీకొట్టింది. ప్రమాదంలో జగదీష్ కు తీవ్రగాయాలుకాగా వెంటనే అక్కడి యశోదా హాస్పిటల్ తరలించినప్పటికీ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.డా.జగదీష్ మరణవార్త విషయం తెలిసిన మరుక్షణం ఆయన తల్లి దండ్రులు కుప్పకూలిపోయారు.చివరగా దసరా పండగ కి స్వగ్రాహం వచ్చి వెళ్లిన డా.జగదీష్ ఆకస్మిక మరణం కుటుంబసభ్యులు, స్థానికులను కలిచివేసింది.అశ్రునయనాల మధ్య సాయంత్రం జగదీష్ అంత్యక్రియలు పూర్తయ్యాయి.

## మద్యానికి బానిసై వ్యక్తి బలవన్మరణం



**ప్రజాపక్షం/మల్యాల :** మద్యానికి బానిసైన వ్యక్తి ఉరేసుకొని ఆత్మ హత్య చేసుకున్న సంఘటన జగిత్యాల జిల్లా మల్యాల మండలం మద్దుట్లగ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది.ఎస్సై నరేష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మద్దుట్ల గ్రామానికీ చెందిన ఉప్పు శంకర్(43) అనే వ్యక్తికి ఆరేళ్ల క్రితం శిరీష అనే మహిళ తో వివాహము జరగగ వ్యవసాయం చేసుకుంటు కుటుంబాన్ని పోసిషించే వాడని,ఆరే ల్లైన తమకు సంతానం కలగడం లేదని తరచు బాధ పడేవాడని ఈ క్రమం లో మద్యానికి బానిసైఆదివారం అర్ధ రాత్రిఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని మరణించినట్లు ఎస్సై వివరించారు. మృతుని బార్య పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## కారు ఆటో ఢీ: ఒకరికి తీవ్ర గాయాలు

**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని మేడిపల్లి క్రాసింగ్ వద్ద ఆదివారం ఆటోను కారు ఢీకొన్న ఘటనలో ఆటో డ్రైవర్ తీవ్ర గాయాల పాలైనట్లు ఎస్ ఐ అనిల్ కుమార్ తెలిపారు. ఎస్ ఐ అనిల్ కుమార్ తెలిపిన వివరాల మేరకు జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం వర్షకొండ గ్రామానికి చెందిన షేక్ సద్దాం హుస్సేన్ వర్ష కోండ గ్రామము నుండి తన ఆటోలో ప్యాసింజర్ ని తీసుకొని మెట్పల్లి వెళ్లి తిరిగి వర్షకొండ గ్రామానికి ఆటోలో వస్తున్నాడు. ఈ క్రమంలో నిజామాబాద్ కు చెందిన చైతన్యేష్ హుండాయ్ ఐ 20 కారులో మెట్పల్లి వైపు వెళుతున్న క్రమంలో ఇబ్రహీంపట్నం క్రాసింగ్ వద్ద కారును అజాగ్రత్తగా నడుపుతూ ఆటోను ఢీకొట్టాడు. ఆటోలో ఉన్న సద్దాం హుస్సేన్ కాలు కు తీవ్ర గాయాలు కావడంతో అతన్ని మెట్పల్లిలోని ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించినట్లు ఎస్సై తెలిపారు. షేక్ సద్దాం హుస్సేన్ తండ్రి కాసిం ఫిర్యాదు మేరకు చైతన్యేష్ పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అనిల్ కుమార్ పేర్కొన్నారు.

# రాజన్న ఆలయ అభివృద్ధి పట్ల సిఎం ప్రత్యేక శ్రద్ధ

### మీడియాతో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**ప్రజా పక్షం/ వేములవాడ :** వేములవాడ దక్షిణ కాశీగా పేరుగాంచిన శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అభివృద్ధి విస్తరణ పనులు వేగంగా సాగుతున్నాయి. ఈ సందర్భంగా వేములవాడ రాజన్న ఆలయ గెస్ట్ హౌస్‌లో రాష్ట్ర ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆదివారం మీడియాతో మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకత్వంలో 150 కోట్ల రూపాయలతో రాజన్న ఆలయ అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ఇప్పటికే 47 కోట్లతో రోడ్డు వెడల్పు పనులు ప్రారంభమయ్యాయని ఆయన చెప్పారు. శృంగేరి పీఠాధిపతుల సూచనలతో శాస్త్రప్రకారం ఆలయ విస్తరణ పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఆలయ విస్తరణ సమయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యామ్నాయంగా భీమేశ్వర స్వామి ఆలయంలో ఆర్జిత సేవలు దర్శనాల ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. భీమేశ్వర ఆలయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా 3.40 కోట్లతో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశామని వివరించారు. పట్టణ ప్రజలు ఆలయ పరిరక్షణ సమితి సభ్యులు ప్రముఖుల సూచనలను ఇప్పటి వరకు పరిగణలోకి తీసుకున్నామని ఇవాళ వచ్చిన సూచనలను కూడా గౌరవంగా పరిశీలిస్తామని ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. రాజన్న ఆలయంలో 64 నుండి 70 పిల్లర్లతో కొత్త మండపాల నిర్మాణం జరుగుతోందని పెద్ద మిషన్లను ఉపయోగించాల్సి వస్తుందని అందువల్ల భక్తుల భద్రత దృష్ట్యా భీమేశ్వర ఆలయంలో దర్శనాలు ఏర్పాటు చేశామని తెలిపారు. రాజన్న ఆలయం మూసివేయబడిందన్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని నిత్య పూజలు సేవలు యథావిధిగా కొనసాగుతున్నాయని ఆయన స్పష్టం చేశారు. రాజన్న ఆలయ అభివృద్ధి ఒక్కరి ఎజెండా కాదు ఇది రాజన్న భక్తుల ఎజెండా అని పేర్కొంటూ శతాబ్దం పాటు వచ్చే భక్తులందరికీ సౌకర్యాలు వసతులు కల్పించడానికి ఈ పనులు జరుగుతున్నాయని భక్తులు సహకరించాలని ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కోరారు.

## కోడ్ ఎత్తివేసినా... ముసుగు తీయలేదు



**ప్రజాపక్షం /ఇబ్రహీంపట్నం:** ప్రభుత్వం ఇటీవలే బిసి రిజర్వేషన్లు 42%తో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసుకుంది. ఈలోగా హైకోర్టు నాలుగు వారాలు స్టే విధిస్తూ తీర్పునిచ్చింది. దీంతో ఎలక్షన్ అధికారులు కోడ్ ఎత్తివేశారు. జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని చౌరస్తా వద్ద ఇందిరా గాంధీ విగ్రహానికి ఎన్నికల కోడ్ లో భాగంగా ముసుగు వేశారు. కోడ్ ఎత్తివేసిన ముసుగు తొలగించకపోవడంతో పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు ఇందిరాగాంధీ విగ్రహం పై నుండి ముసుగు తొలగించాలని ఆమె అభిమానులు కోరుతున్నారు.

## ఓటు చోరీపై జమ్మికుంట ప్రజలకు అవగాహన



**ప్రజాపక్షం/జమ్మికుంట:** ఆల్ ఇండియా కాంగ్రెస్ ఆదేశాల మేరకు హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి ఒడితల ప్రణవ్ సూచన మేరకు బ్లాక్ కాంగ్రెస్ పట్టణ, మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆదివారం జమ్మికుంటలో ఓటు చోరీపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బిజెపి పరిపాలనలో ప్రజల ఓటును చోరీ చేస్తూ అధికారంలోకి రావడం జరుగుతోందన్నారు. రాహుల్‌గాంధీ ఆధారాలతో భారత ఎన్నికల కమిషన్‌కు పలుమార్లు సమర్పించడం జరిగిందన్నారు. భారత రాజ్యాంగం ఇచ్చిన ఓటు హక్కును చోరీ చేయకుండా కాపాడాలని భారత ఎన్నికల కమిషన్‌కు ప్రజల ద్వారా సంతకాల సేకరణ చేసి పంపించే కార్యక్రమంలో భాగంగా కాంగ్రెస్ కార్యకర్తలు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మొలుగూరి సదయ్య, జమ్మికుంట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సుంకరి రమేష్, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గూడెపు సారంగపాణి, జమ్మికుంట మాజీ సర్పంచ్ పొనగంటి మల్లయ్య, మార్కెట్ మాజీ డైరెక్టర్ సలీం, రాష్ట్ర ఫిషర్‌మెన్ కార్యదర్శి పింగిలి రాకేష్, పింగిలి రమేష్, మాజీ పట్టణ ఉపాధ్యక్షుడు బుర్ర కుమార్ గౌడ్ తదితరులున్నారు.

## ప్రతి ఆదివారం అంబేద్కర్ స్మరణం

**ప్రజాపక్షం/గొల్లపల్లి :** డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ ,భారత రాజ్యాంగంలో కల్పించిన హక్కులను అవగాహన చేసుకొని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని మాజీ వైస్ ఎంపీపీ ఆవుల సత్యం అన్నారు .ఆదివారం జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల కేంద్రంలో ప్రబుద్ధ భారత్ ఇంటర్నేషనల్, హైదరాబాద్ కార్యవర్గసభ్యుడు, డిక్కి జిల్లా కోఆర్డినేటర్ నల్ల శ్యామ్ ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం అంబేద్కర్ స్మరణ కార్యక్రమాన్ని మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు .ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ వైస్ ఎంపీపీ ఆవుల సత్యం పాల్గొని డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి ,పూలమాలతో ఘన నివాళ్లు అర్పించి మహానుభావుని సేవలను స్మరించారు. ఈ సందర్భంగా డిక్కీ కోఆర్డినేటర్ నల్ల శ్యామ్ మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ దేశానికి అందించిన అమూల్యమైన సేవలు, సమానత్వం, న్యాయం సామాజిక సంస్కరణలో వారి ఆలోచనలు, ఆశయాలను, ఆదర్శల ద్వారా భవిష్యత్ తరాలు స్ఫూర్తి పొందటంతో పాటు స్మరించుకోవాలని ప్రతి ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్నామని నల్ల శ్యామ్ అన్నారు. అంబేద్కర్ కీర్తిని ప్రతి భారత పౌరుడు స్మరించుకోవాలని ఈరోజు మండల కేంద్రంలో ప్రబుద్ధ భారత్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం అంబేద్కర్ స్మరణం ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం అధ్యక్షులు చెవులమద్ది సంతోష్, బాబు జగ్జివన్ సంఘం అధ్యక్షులు జెరూపోతుల కొమురయ్య, న్యాయవాది చిర్ర దిలీప్, ధావుల రాకేష్, చెవులమద్ది గంగాధర్,నర్సయ్య, శ్రీనివాస్, నరేందర్, నవీన్, మధుసూదన్,తిరుపతి, రాజేష్, చంద్రయ్య, గొర్రె జాకబ్, కడమండ వెంకటి, అంబేద్కర్ వాదులు పాల్గొన్నారు.

## మీ క్రమశిక్షణ అందరికి ఆదర్శం



### దేశం కోసం మీ సేవ గొప్పది.. మాజీ మంత్రి హరీష్‌రావు


**ప్రజాపక్షం/సిద్ధిపేట :** దేశం కోసం మీరు సేవ గొప్పదని... మిలిటరీలో ఉండే క్రమశిక్షణ ఆదర్శమని మాజీ మంత్రి హరీష్‌రావు అన్నారు. దేశ ప్రజల కడుపునిండా తింటున్నారంటే ..కంటినిద్ర పోతున్నారంటే సైనికులే దేశ రక్షకులని అన్నారు. ఇతర ప్రాంతాల్లో మీరు ఉద్యోగం చేస్తే మీపిల్లలు నాన్ లోకల్ అవుతున్నారని.. ప్రభుత్వం ఈ విషయంపై దృష్టి పెట్టాలని హరీష్‌రావు అన్నారు. సిద్ధిపేట విపంచి ఆడిటోరియంలో జరుగుతున్న సిద్ధిపేట జిల్లా ఎక్స్ సర్వీస్ మెన్ వేలే ఆసోసియేషన్ ప్రథమ వార్షికోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే హరీష్‌రావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సైనికులు దేశం కోసం పనిచేస్తారని మీరంటే అందరికి ఆదర్శమన్నారు. తప్పక మా ప్రభుత్వం వస్తుందని. ఎక్స్ సర్వీస్‌మెన్ వేల్ఫేర్ అసోసియేషన్‌కు పరిష్కారం చూపిస్తాం అన్నారు. దేశ రక్షణలో అసువులుబాసిన సైనికుల కుటుంబానికి అండగా ఉంటామన్నారు.

వారికి ప్రభుత్వ పరంగా ప్రైవేటు ఉద్యోగాలు వచ్చే విధంగా సహకారం అందిస్తామన్నారు. అసోసియేషన్ సభ్యులకు ఎల్లప్పుడు నా సహకారం ఉంటుందన్నారు.

**మానవత కోణంలో అనేక కార్యక్రమాలు చేపట్టిన వాసవి క్లబ్: హరీష్‌రావు**

వాసవిక్లబ్ మానవత కోణంలో అనేక కార్యక్రమాలు చేపట్టి ప్రజల మన్ననలు పొందిందని మాజీ మంత్రి హరీష్‌రావు అన్నారు. ఆర్యవైశ్యుల ఆరాధ్యదైవంగా భావించే వాసవి అమ్మవారి ఆశీస్సులతో సేవ కార్యక్రమాలు చేస్తున్న వాసవి ఇంటర్నేషనల్ సంస్థకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఆదివారం సాయంత్రం వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ప్రాంతీయ సదస్సులో వివిధ సేవల్లో ఎంపికైన వారికి అవార్డుల ప్రధానోత్సవంలో మాజీ మంత్రి హరీష్‌రావు ముఖ్య అతిథిగా పాల్గొని అవార్డులు ప్రధానం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థలు ఏవైన సామాజిక సేవ లక్ష్యంగా సిద్ధిపేటలో ఏన్నో ఆర్గనైజేషన్లు పనిచేస్తున్నాయన్నారు. మూడు కోట్ల దేవతలను పూజిస్తే కలిగి ముక్తి పుణ్యం ఒక గోవును పూజిస్తే వస్తుందంటారు. ఈకార్యక్రమంలో శ్రీనివాస్, కృష్ణమూర్తి. పుల్లూరి శివకుమార్, శశాంక్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యతోపాటు అన్ని రంగాల్లో విద్యార్థులు ప్రతిభ కనబరచాలి



**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** చదువుతోపాటు అన్ని రంగాల్లో ఆల్ఫోర్స్ విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరుస్తూ ముందుకు పోతున్నారని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డి అన్నారు. పాఠశాలల క్రీడోత్సవాల్లో భాగంగా ఎలిగేడు మండల కేంద్రంలో జరిగిన పెద్దపెల్లి జిల్లా స్థాయి చదరంగం పోటీల్లో నలుగురు విద్యార్థులు తమ సత్తా చాటి ఉమ్మడి జిల్లా పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ఆదివారం నరేందర్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిష్ణాతులైన అధ్యాపకులచే నిత్య శిక్షణ ఇవ్వడంతో విద్యార్థులు రాటు దేలుతున్నారని వారిని మరింత ప్రోత్సహించినట్లయితే రాష్ట్ర జాతీయ స్థాయిలో రాణిస్తారని తెలిపారు. ఎంపికైన వారిలో అండర్ 14 బాలికల విభాగంలో శ్రీ వర్షిని యాదవ్, బాలుర విభాగంలో ఎం వాసుదేవ్, అండర్ 17 బాలుర విభాగంలో పి అనిరుద్, బాలికలు విభాగం లో అనన్యలు ఉన్నారు. వీరిని ప్రిన్సిపాల్ తో పాటు అధ్యాపక బృందం ప్రత్యేకంగా అభినందించారు.

## మద్యం షాపుల నిర్వహణకు దరఖాస్తుల ఆహ్వానం

### ఎక్సైజ్ సిఐ ఠాకూర్ మహేందర్ సింగ్



**ప్రజాపక్షం/ధర్మపురి :** 2025–27 సంవత్సరాల కాలానికి మద్యం దుకాణాల నిర్వహణకై ధరఖాస్తుల స్వీకరణకు మరో 6 రోజుల గడువు మాత్రమే వుందని ఆసక్తి కల అభ్యర్థులు త్వరపడాలని జగిత్యాల జిల్లా ధర్మపురి ప్రొహిబిషన్ & ఎక్సైజ్ సీఐ ఠాకూర్ మహేందర్ సింగ్ ఒక ప్రకటనలో కోరారు.జగిత్యాల జిల్లాలో మొత్తం 71 షాపులకు దరఖాస్తులను ఆహ్వానిస్తూ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయబడిందని ఇట్టి షాపులకు గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆసక్తిగల అభ్యర్థులు 3 పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలు,ఆధార్ కార్డు,పాన్ కార్డు,సామాజికవర్గం నాకు కేటాయించిన షాపులకు దరఖాస్తు చేసుకునే వారు కుల ధ్రువీకరణ పత్రం, దరఖాస్తు రుసుంగా రూ.3 లక్షల డీడీ లేదా చలాన్ (నాన్ రిఫండబుల్) దరఖాస్తుల స్వీకరణ కౌంటర్ ప్రొహిబిషన్ & ఎక్సైజ్ స్టేషన్ దరూర్ క్యాంప్ జగిత్యాల లో సమర్పించాలని సీఐ మహేందర్ సింగ్ పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 8712658826 నంబర్ కు కాల్ చేయాలని తెలిపారు.

## గ్రామాల్లో జోరుగా రేషన్ బియ్యం దందా



**ప్రజాపక్షం/మల్లాపూర్ :** ప్రభుత్వం నిరుపేదల కడుపు నింపేందుకు ఉచితంగా రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యాన్ని అందిస్తుంటే అదురుగా భావించిన కొందరు అక్రమార్కులు ప్రతి నెల మొదటి వారంలో గ్రామాలలో గద్దల్లాగా వాలిపోయి కంట్రోల్ బియ్యం దందాను జోరుగా కొనసాగిస్తున్నారు. ఉదయం నుండి రాత్రి వేల వరకు ప్రతి ఇంట తిరుగుతూ కంట్రోల్ బియ్యాన్ని కొనుగోలు చేసి డంపులు డంపులుగా ఏర్పాటు చేసుకుని రాత్రివేళ గుట్టు చప్పుడు కాకుండా తరలిస్తూ జేబుల్ నింపుకుంటున్నారు. ఇలా గ్రామాలలో జరిగే అక్రమ పిడిఎస్ బియ్యం దందాపై అధికారులు దృష్టిసారించకపోవడమో లేక మామూళ్ల మత్తులో ఉండి పట్టించుకోకపోవడం ఏమో తెలియదు గానీ వీరి దందాకు అడ్డు అదుపు లేకుండా పోయింది. ఇలా రాత్రికి రాత్రే లక్షలాది రూపాయల పిడిఎస్ బియ్యాన్ని సామాన్య ప్రజల నుండి కొనుగోలు చేసి సుదూర ప్రాంతాలకు తరలిస్తూ తమ వ్యాపారాన్ని మూడు పువ్వులు ఆరు కాయలు అన్న చందంగా నడిపిస్తున్నారు. సంబంధిత రెవెన్యూ, పోలీస్ అధికారులు దృష్టి సారిస్తారా లేక మాకెందుకులే అని చేతులు దులుపుకుంటారో వేచి చూడాలి మరి..

### యువతను ఉర్రూతలూగించిన

# మారథాన్ మూడో ఎడిషన్



**ప్రజాపక్షం/కరీంనగర్‌టౌన్:** కరీంనగర్ రన్నర్స్, సైక్లిస్టుల అసోసియేషన్ ఆధ్వర్యంలో మొదటి రెండు ఎడిషన్లు దిగ్విజయంగా పూర్తి కావడంతో మూడవ ఎడిషన్‌ను ఆదివారం ఉదయం అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించగా యువతలో క్రేజ్ పెరిగి కొత్త ఉత్సాహాన్ని రేకెత్తించింది. ఈ సంధర్భంగా కెఆర్‌సిఏ ప్రెసిడెంట్, ఐవిహై విద్యాసంస్థల అధినేత పసుల వెంకటేష్ మాట్లాడుతూ మనకోసం.. మన కరీంనగర్ ప్రజల కోసం నినాదంతో నగరవాసుల ఆరోగ్యం దృష్ట్యా డ్రగ్స్ రహిత సమాజం కోసం మూడవ ఎడిషన్‌ను నిర్వహించామని తెలిపారు. ఉరుకుల పరుగుల జీవితంలో శరీరానికి అలసట లేకుండా పోయి నగరవాసులు ఒత్తిడితో కూడిన జీవనం కొనసాగిస్తున్నారని, నగర వాసులకు అలాంటి అలవాట్లు మార్చే ఉద్దేశ్యంతో పలు స్వచ్ఛంద సేవా కార్యక్రమంలో ఒకటైన మారథాన్‌ను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. దీనిలో నాలుగు కేటగిరీలు ప్రవేశపెట్టామని, 3కె, 5కె, 10కె,21 కె రన్నింగ్ చేయలేని వారు జాగింగ్ చేయవచ్చని , జాగింగ్ చేయలేని వారు వాకింగ్ చేసి పూర్తి చేయవచ్చని పేర్కొన్నారు. తద్వారా నిత్యజీవితంలో మనకు ఎదురయ్యే అనారోగ్య సమస్యలను తగ్గించి మానసిక స్థితి మెరుగుపడుతుందన్నారు. బాడీ ఫిట్‌నెస్‌గా ఉండడానికి దోహదపడుతుందన్నారు. ప్రజల్లో ఐక్యత, ఉత్సాహం, స్నేహబావం పెరుగుతుందన్నారు. ఈ సారి ఊహించలేనంతగా ఎనిమిది వేలకు పైగా నగరవాసులు రిజిస్ట్రేషన్ చేసుకుని ఉత్సాహంగా పాల్గొనడంతో సంతోషంగా ఉందని వారు పేర్కొన్నారు.

## సిపిఆర్ పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి





**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** సిపిఆర్‌పై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని డాక్టర్ అనీష్ పబ్బా,వాకర్స్ అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అయిల రమేష్, మంద శ్రీనివాస్ గౌడ్ అన్నారు.సుల్తానాబాద్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మెడికవర్ హాస్పిటల్ కరీంనగర్ వారిచే సిపిఆర్ పై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ అనీష్ పబ్బ మాట్లాడుతూ, ఆకస్మికంగా గుండెపోటు వచ్చినప్పుడు సిపిఆర్ చేసి ప్రాణాలు కాపాడటం ఎలా అని చేసి చూపించి, శిక్షణ ఇవ్వడం జరిగింది. అలాగే గుండెపోటు నివారణ, ముందు జాగ్రత్తలు, ఆహార అల వాట్లు తదితర అంశాలపై అవగాహనకల్పించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఐల రమేష్, మంద శ్రీనివాస్ గౌడ్, గౌరవ అధ్యక్షులు అమీర్ శెట్టి రాజలింగం, సభ్యులు చొప్పరి సుమన్,కామని శ్రీకాంత్, ఎలిగేటి రమేష్, ఎలగందుల మల్లేశం, కందుకూరి కుమార్, కొలిపాక రవీందర్, ఉల్లంగుల శ్రీనివాస్, కొమురవెల్లి భాస్కర్, కందుకూరి ప్రకాశ్, రాజేంద్రప్రసాద్, జాన్వీ శ్రీనివాస్, నిట్టూరి శ్రీనివాస్,ఎల్లయ్య, దూడ లింగమూర్తి, సిరిపురం రమేష్,రామచంద్రం,కొమురయ్య, వెంకటేశం, విజయ్, ప్రశాంత్, సుధాకర్, పరుశురాం, అమీర్ శెట్టి తిరుపతి, రమణ,రామకృష్ణ, రాజు, రాకేష్, సంతోష్ , శ్రీనివాస్,వెంకటేష్ వాకర్ సభ్యులు, మెడికవర్ హాస్పిటల్ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

# రీల్



హైదరాబాద్ పోలీసు కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన సజ్జనార్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన చిరంజీవి, ఆయన కుమార్తె సుస్మిత

## రవితేజా@76



మాస్ మహారాజా రవి తేజ, కిషోర్ తిరుమల దర్శకత్వంలో వస్తున్న 76వ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. ఈసినిమా ప్రతుతం ఫారిన్ షెడ్యూల్ జరుపుకుంటోంది. గత కొన్ని రోజులుగా స్పెయిన్‌లోని వాలెన్సియా, సమీప దీవుల్లో లొకేషన్ రికీ పనులు పూర్తి చేశారు. శనివారం నుంచి జెనీవా, ఫ్రాన్స్‌లో కూడా కీలకమైన సన్నివేశాలు చిత్రీకరించనున్నారు. మొత్తం 25 రోజుల ఈ షెడ్యూల్‌లో కీలక టాకీ పార్ట్‌లతో పాటు శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీతో రెండు పాటలు చిత్రీకరించబోతున్నారు. ఈ సినిమాకి కంపోజర్ భీమ్స్ సెసిరోలియో మ్యూజిక్ అందిస్తున్నారు. రవితేజ మాస్ ఎలిమెంట్స్‌తో ఫుల్‌ఫ్లెడ్జ్ ఫ్యామిలీ డ్రామాగా తెరకెక్కుతోంది.ఎమోషనల్ కథలతో అలరించే దర్శకుడు కిశోర్ తిరుమల ఈ చిత్రాన్ని అన్ని వర్గాల ప్రేక్షకుల ఆకట్టుకునేలా రూపొందిస్తున్నారు. ఈ సినిమాకి సినిమాటోగ్రఫీని ప్రసాద్ మూరెళ్ళ. నేషనల్ అవార్డు గ్రహీత శ్రీకర్ ప్రసాద్ ఎడిటర్. ఏఎస్ ప్రకాష్ ఆర్ట్ డైరెక్టర్. టైటిల్, ఫస్ట్ లుక్, ఇతర నటీనటుల వివరాలు త్వరలోనే మేకర్స్ తెలియజేయనున్నారు.

## 'కే-ర్యాంప్' ట్రైలర్ విడుదల

సక్సెస్ ఫుల్ హీరో కిరణ్ అబ్బవరం నటిస్తున్న కొత్త సినిమా 'కే ర్యాంప్'. ఈ సినిమాను ప్రముఖ నిర్మాణ సంస్థ హాస్య మూవీస్, రుద్రాంశ్ సెల్యులాయిడ్ బ్యానర్‌ల మీద రైజింగ్ ప్రొడ్యూసర్ రాజేశ్ దండ, శివ బొమ్మకు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. 'కేర్యాంప్' సినిమాకు జైన్స్ నాని దర్శకత్వం వహిస్తున్నారు. ఈ మూవీ దీపావళి పండుగ సందర్భంగా ఈ నెల 18న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతోంది. ఈ సందర్భంగా ట్రైలర్ లాంఛ్ ఈవెంట్‌ను హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ జైన్స్ నాని మాట్లాడుతూ ట్రైలర్ మీ అందరికీ నచ్చిందని నమ్ముతున్నా. ట్రైలర్ లోని ఎనర్జీకి సినిమా ఏమాత్రం తగ్గదు. నటుడు వీకే నరేష్ మాట్లాడుతూ ఈ దీపావళి నైట్ కె ర్యాంప్ థియేటర్స్‌లో సెలబ్రేట్ చేసుకుందాం. సామజవరగమన సినిమాతో ఈ సంస్థ నన్ను కొత్తగా చూపించింది. ఈ చిత్రంతో మరింత వైవిధ్యమైన పాత్రతో మీ ముందుకు వచ్చే అవకాశం కల్పించింది. కిరణ్ తో కలిసి నటించడాన్ని ఎంజాయ్ చేశాను.



ఈ తరంలో టాలెంటెడ్ యంగ్ డైరెక్టర్ జైన్స్ నానితో కె ర్యాంప్ మూవీ చేయడం హ్యాపీగా ఉందన్నారు.
హీరో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ కొత్త స్క్రిప్ట్ చేద్దామనే ఉద్దేశంతో క అనే సినిమాను చేశాను. అయితే 'కేర్యాంప్' ర్యాంప్ మాత్రం మీకోసం నా ఫ్యాన్స్ కోసం చేశాను. అప్పటికి నేను ఒక్క సినిమానే చేసినా నా రెండో చిత్రం ఎస్ఆర్ కల్యాణమండపంను థియేటర్స్‌లో చూసి మీరంతా ఆదరించారు. నా పర్ ఫార్మెన్స్ ను ఎంజాయ్ చేశారు. 'కే ర్యాంప్' మూవీకి కర్త కర్మ క్రియ అన్నీ నానీనే. ఈ సినిమా చేస్తున్నంతసేపూ నా నవ్వు ఇలాగే ఉంది. అంత బాగా నన్ను మా ప్రొడ్యూసర్స్ చూసుకున్నారు అని చెప్పారు.

## 'ఫెయిల్యూర్ బాయ్స్' ఫస్ట్ లుక్ విడుదల



క్రాంతి, అవితేజ్, ప్రదీప్, సుపర్ణ, పవని ప్రధాన పాత్రల్లో నటించిన సినిమా ఫెయిల్యూర్ బాయ్స్. ఇతర కీలక పాత్రల్లో సుమన్, నాజర్, తనికెళ్ల భరణి నటించారు. ఈ చిత్రాన్ని శ్రీ గురుదక్షిణ మూర్తి ఫిలింస్ బ్యానర్ పై వీవీఎస్ కుమార్, ధన శ్రీనివాస్ జామి, లక్ష్మి వెంకట్ రెడ్డి నిర్మించారు. వెంకట్ రెడ్డి ఉసిరిక దర్శకత్వం వహించారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న 'ఫెయిల్యూర్ బాయ్స్' సినిమా త్వరలో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. హైదరాబాద్ ఫిలింఛాంబర్‌లో ఈ చిత్ర ఫస్ట్ లుక్ పోస్టర్ లాంఛ్ ఈవెంట్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్మాత ధన శ్రీనివాస్ జామి మాట్లాడుతూ యూత్ ఫుల్ ఎంటర్ టైనర్ గా వినోదంతో పాటు మంచి సందేశాన్ని ఇచ్చేలా ఈ చిత్రాన్ని నిర్మించాం. చిత్ర నిర్మాణంలో ఇబ్బందులు ఎదురయ్యాయి అన్నారు. నిర్మాత లక్ష్మి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ మంచి యూత్ ఫుల్ ఎంటర్ టైనర్‌గా 'ఫెయిల్యూర్ బాయ్స్' సినిమాను నిర్మించాం అన్నారు.

## నవంబర్ 14న సంతాన ప్రాప్తిరస్తు




టీజర్, లిరికల్ సాంగ్స్ వంటి ప్రమోషనల్ కంటెంట్‌తో ప్రేక్షకుల్లో కావాల్సినంత బజ్ క్రియేట్ చేస్తున్న యూత్ ఫుల్ ఫ్యామిలీ ఎంటర్ టైనర్ మూవీ 'సంతాన ప్రాప్తిరస్తు' రిలీజ్ డేట్ ఫిక్స్ అయింది. ఈ సినిమాను నవంబర్ 14న థియేటర్లలో విడుదల చేస్తున్నట్టు నిర్మాతలు ప్రకటించారు. సమాజంలో యూత్ కపుల్స్ ఎదుర్కొంటున్న ఓ సమస్య నేపథ్యంగా కంప్లీట్ ఎంటర్టైన్మెంట్ ప్రధానంగా 'సంతాన ప్రాప్తిరస్తు' తెరకెక్కుతోంది. 'సంతాన ప్రాప్తిరస్తు' చిత్రంలో విక్రాంత్, చాందినీ చౌదరి హీరో హీరోయిన్లుగా నటిస్తున్నారు. వెన్నెల కిషోర్ డాక్టర్ భ్రమరం క్యారెక్టర్ లో నవ్వించబోతున్నారు. మధుర ఎంటర్ టైన్ మెంట్, నిర్వి ఆరట్స్ బ్యానర్స్ పై మధుర శ్రీధర్ రెడ్డి, నిర్వి హరిప్రసాద్ రెడ్డి నిర్మిస్తున్న 'సంతాన ప్రాప్తిరస్తు' చిత్రాన్ని దర్శకుడు సంజీవ్ రెడ్డి రూపొందిస్తున్నారు. రచయిత షేక్ దావూద్ జి ఈ సినిమాకు స్క్రీన్ ప్లే అందించారు. విక్రాంత్, చాందినీ చౌదరి, వెన్నెల కిషోర్, తరుణ్ భాస్కర్, అభినవ్ గోమటం, మురళీధర్ గౌడ్ హర్షవర్ధన్, బిందు చంద్రమౌళి, జీవన్ కుమార్, సత్య కృష్ణ, తాగుబోతు రమేష్, అభయ్ బేతిగంటి, కిరీటి, అనీల్ గీల, సద్దాం తదితరులు నటిస్తున్నారు.

## 'మిత్ర మండలి' సెన్సార్ పూర్తి.. యు/ఎ సర్టిఫికెట్



ప్రియదర్శి, నిహారిక ఎన్ఎం హీరో హీరోయిన్లుగా విజయేందర్ దర్శకత్వంలో బీవీ వర్క్స్ బ్యానర్ మీద బన్నీ వాస్ సమర్పణలో సప్తాస్వ మీడియా వర్క్స్ మీద కళ్యాణ్ మంతెన, భాను ప్రతాప, డా.విజేందర్ రెడ్డి తీగల నిర్మించిన చిత్రం 'మిత్ర మండలి'. ఈ మూవీ అక్టోబర్ 16న రిలీజ్ కాబోతోంది. ఇప్పటికే రిలీజ్ చేసిన సాంగ్స్, టీజర్, ట్రైలర్ ఇలా అన్నీ కూడా వైరల్ అయిన సంగతి తెలిసిందే. ఇక రిలీజ్ డేట్ దగ్గర పడుతున్న క్రమంలో సెన్సార్ కార్యక్రమాల్ని కూడా చిత్రయూనిట్ పూర్తి చేసుకుంది. 'మిత్ర మండలి' ఆద్యంతం వినోదభరితంగా ఉందని, సమాజంలోని వ్యవస్థల మీద సున్నితంగా విమర్శనాస్త్రాల్ని సంధించారని కొనియాడారు. 'మిత్ర మండలి'ని బడ్డీ కామెడీ యాంగిల్‌లో చూపిస్తూనే మంచి సెటైరికల్ మూవీగా తెరకెక్కించారని అభినందించారు. అన్ని వర్గాల ప్రేక్షకులు చూడాల్సిన చిత్రమని 'యు/ఎ' సర్టిఫికెట్‌ను జారీ చేశారు. ఆద్యంతం అందరినీ ఆకట్టుకునేలా 'మిత్ర మండలి'ని తెరకెక్కించారు. 'మిత్ర మండలి' చిత్రంలో ప్రియదర్శి, నిహారిక ట్రాక్.. విష్ణు ఓయి, రాగ్ మయూర్, ప్రసాద్ బెహారా కామెడీ హైలెట్ కానుందని అర్థం అవుతోంది. ఇక స్పెషల్ అట్రాక్షన్‌గా వెన్నెల కిషోర్, సత్య, వీటీవీ గణేష్ పాత్రలు ఉండబోతోన్నాయి. అందరినీ సర్ ప్రైజ్ చేసేందుకు బ్రహ్మానందం కూడా కనిపించబోతోన్నారు. పాజిటివ్ బజ్ క్రియేట్ చేసిన ఈ మూవీని అక్టోబర్ 16న గ్రాండ్‌గా రిలీజ్ చేయబోతోన్నారు.

## సురేశ్ ప్రొడక్షన్స్‌లో ఆనందలహరి సిరీస్

సురేశ్ ప్రొడక్షన్స్ మినీ ప్రజెంట్ చేస్తున్న ఆనంద లహరి తూర్పు, పశ్చిమ గోదావరి నేపథ్యంలో సాగే హార్ట్ టచ్చింగ్ ఫ్యామిలీ రొమాంటిక్ కామెడీ. ప్రేమ, నవ్వులు కలిపిన ఈ సిరీస్ ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందించబోతోంది.ఈ సిరీస్‌ను 13వ దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత సాయి వనపల్లి రచన, దర్శకత్వం వహించగా, ప్రవీణ్ ధర్మపురి నిర్మించారు. ఈ సినిమాను ప్రముఖ నిర్మాత సురేశ్ దగ్గుబాటి ఎస్ పీ మినీ ప్రొడక్షన్స్ బ్యానర్ పై సమర్పిస్తున్నారు.యువ దర్శకులు, రచయితలు, టెక్నీషియన్లకు తమ కథలు, ఆలోచనలను అత్యుత్తమ నాణ్యతతో రూపొందించడానికి అవకాశం కల్పించడం సురేశ్ బాబు లక్ష్యం. రామానాయుడు స్టూడియోస్‌లో ఆధునిక సదుపాయాలతో ఈ కలను నిజం చేస్తోంది. ఆనందలహరిలో అభిషేక్ బొడ్డేపల్లి, భ్రమరాంబికా టుటిక ప్రధాన పాత్రల్లో నటించారు, జాయ్ సోలమన్ సంగీతాన్ని అందించారు. ఈ ట్రైలర్ ఇప్పటికే ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. రిఫ్రెషింగ్ టోన్, ప్లజెంట్ విజువల్స్ హ్యూమర్ తో సిరీస్ కోసం అంచనాలను పెంచింది.ఈ దీపావళికి అక్టోబర్ 17న, ఆహాలో విడుదల కానున్న ఆనందలహరితో గోదావరి కుటుంబాల ఆనందాలు, ఎమోషన్స్‌ని మనసారా ఆస్వాదించడానికి సిద్ధంగా ఉండండి.



## అంతరాలు పెరుగుతున్నాయ్

(మొదటి పేజీ తరువాయి)

వేశారు. హోం ఫర్ ఏజ్డ్ (వృద్ధాశ్రమం) డైరక్టర్ వి.చెన్నకేశవ రావు సి.ఆర్ ఫౌండేషన్ గురించి వివరించారు. కాగా వివిధ వైద్యసేవల నిమ్మితం ఇటీవల డాక్టర్ రజనీ అందుకున్న అవార్డును ఆమె సిఆర్ ఫౌండేషన్‌కు అంకితం చేశారు. అనంతరం జస్టిస్ నగేష్ భీమపాక మాట్లాడుతూ సమాజానికిఅనేక రకాలుగా సేవలందిచిన వారు వృద్ధాశ్రమంలో ఉన్నారని, వారంతా నడిచేదేవుళ్ల అని అభివర్ణించారు. చంద్ర రాజేశ్వర్ రావు లాంటి మహనీయులు మరణించారనే పదం చాలా చిన్నదన్నారు. సిఆర్ రాసుకున్న లేఖను ఆయన పార్థివదేహం వద్ద పెట్టారని, ఆ లేఖ ఇప్పటికీ తన కళ్ల ముందు కదలాడుతోందని గుర్తుచేసుకున్నారు. కొందరు వివిధ కారణాలతో తమ తల్లిదండ్రులను చుసుకోలేని పరిస్థితుల్లో ఉన్నారని, ప్రస్తుతం మరి కొందరు లగేజీ( తల్లిదండ్రులు) ఉన్నారా? అని అడుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కురుస్తున్న కాసుల వర్షంలో తడిచి నిరుపేదలుగా మారుతున్నారని చెప్పారు. మార్క్స్ చెప్పినట్టుగా మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలుగా మారాయన్నారు. ప్రజా సమస్యలపై పరిష్కారానికి చేపట్టే ఆందోళనలు, నిరసన కార్యక్రమాలు చేపట్టినందుకు గాను తన తండ్రి ప్రతి ఏటా కనీసం పది రోజుల పాటు జైలు జీవితాన్ని గడిపేవారని జస్టిస్ నగేష్ భీమపాక గుర్తు చేసుకున్నారు. పది ఎకరాల్లో వృద్ధాశ్రమాన్ని ఏర్పాటు చేసి,మరింత సేవలను అందించాలని, ఇందుకు తమ వంతు సహాకారం అందిస్తామని ఆయన హామీనిచ్చారు. సయ్యద్ అజీజ్ పాషా మాట్లాడుతూ చంద్ర రాజేశ్వర్ రావు జీవితం ఎంతో మందిని ప్రభావితం చేసిందన్నారు. ప్రతి సమస్యలను సి.ఆర్ లోతుగా ఆలోచించి, ఆ సమస్య పరిష్కారానికి కృషి చేశారన్నారు. హిందీపైన పట్టులేకపోయినప్పటికీ దక్షిణాధి రాష్ట్రాలవారితో ఆయన హిందీలో మాట్లాడేవారని గుర్తు చేశారు. ఆనాటి తెలంగాణ ఉద్యమ సమయంలో సిఆర్ విద్యార్థులతో మాట్లాడారని చెప్పారు. ఈ కార్యక్రమంలో వృద్ధాశ్రమంలో సలహా కమిటీ సభ్యులు టి.రాజేందర్‌రావు,తమ్మారెడ్డి తాన్యా కుమారి వేదికపై ఆసీనులయ్యారు. సమావేశనంతరం వృద్ధాశ్రమంలో ఉంటున్న వారిని హైకోర్ట్ న్యాయమూర్తి జస్టిస్ నగేష్ భీమపాక ఆప్యాయంగా పలుకరిస్తూ, వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.

### సి.ఆర్‌ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు : పల్లా

పల్లా వెంకట రెడ్డి మాట్లాడుతూ సిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు ఎంబ్రాయిడరీ,కంప్యూట్ లాంటి పలు వృత్తిపరమైన శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని వివరించారు. లైబ్రరీ సెంటర్‌కు ఇటీవల మరణించిన సురవరం సుధాకర్ రెడ్డి పేరు పెట్టామని, ఈ లైబ్రరీని డిజటల్ చేశామని తెలిపారు. దీనిని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. వైద్య సేవలను కూడా అందిస్తున్నామని పల్లా వెంకటరెడ్డి తెలిపారు.





సిపిఐ జాతీయ కార్యదర్శిగా ఎన్నికైన తర్వాత తొలిసారిగా సిఆర్ ఫౌండేషన్‌కు వచ్చిన మాజీ ఎమ్మెల్యే, ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి పల్లా వెంకటరెడ్డిని, జాతీయ కార్యదర్శి బాధ్యతలు నుండి తప్పుకున్న ఫౌండేషన్ ఉపాధ్యక్షులు, మాజీ ఎంపి సయ్యద్ అజీజ్ పాషాలను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే కె.రామకృష్ణ ఫౌండేషన్ డైరెక్టర్ చెన్నకేశవ రావు, హెల్త్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ రజిని తదితరులు



## ఆర్‌డిఆర్ పేరు

(మొదటి పేజీ తరువాయి)

నామకరణం చేస్తున్నామని ప్రకటించారు. 24 గంటల్లో దీనికి సంబంధించిన జిఓ జారీ చేస్తామని తెలిపారు. నేటి రోజుల్లో ఓ నాయకుడు ఒక్కసారి ప్రజాప్రతినిధి అయితేనే వేల కోట్ల రూపాయలు సంపాదించుకొని వెనకేసుకుంటున్నారని, కానీ పార్టీ కోసం దామోదర్ రెడ్డి తన తల్లిదండ్రులు, అత్తగారి నుండి వారసత్వంగా వచ్చిన తన స్థిర, చరాస్థులను పార్టీ కోసం తెగనమ్మి కార్యకర్తలను కంటికి రెప్పలాగా కాపాడుకున్న మహానాయకుడని కొనియాడారు. ఆదివారం తుంగతుర్తి నియోజక వర్గ కేంద్రంలో నిర్వహించిన రాంరెడ్డి దామోదర్ రెడ్డి సంతాప సభకు మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటి రెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితోపాటు ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన శాసనసభ్యులతో కలిసి హాజరయ్యారు. దీనికి ముందు రాష్ట్ర డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క, మాజీ మంత్రి, కాంగ్రెస్ నాయకులు కుందూరు జానారెడ్డిలు హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ తుంగతుర్తి ప్రాంతం నీరు లేక ఏడారిగా కొద్ది రోజులలో మారిపోతుందని ప్రపంచ ఆరోగ్య సంస్థ అధ్యాయనం చేసి వెల్లడించిందని చెప్పారు. భారతదేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రు దీనిని దృష్టిలో ఉంచుకొని సాగు, విద్యాభివృద్ధి కోసం అధిక ప్రాధాన్యత ఇచ్చారని దీనిలో భాగంగానే శ్రీరాం సాగర్ ప్రాజెక్టు నిర్మాణం జరిగిందని గుర్తు చేశారు. తాగు, సాగు నీరు లేక ఏడారిగా మారుతున్న తుంగతుర్తి ప్రాంతానికి గోదావరి జలాలు తీసుకవచ్చేందుకు శాసన సభ్యునిగా, రాష్ట్ర మంత్రిగా దామోదర్ రెడ్డి అనేక పోరాటాలు చేశారని చెప్పారు. చంద్రబాబు ప్రభుత్వంలో గోదావరి జలాల కోసం రక్తతర్పణం చేసి ఆనాటి ప్రభుత్వానికి కనువిప్పు కలిగేలా చేసి శ్రీరాంసాగర్ రెండవ దశ ప్రాజెక్టును సాధించిన ధీశాల అని కొనియాడారు. ప్రాజెక్టు నిర్మాణానికి అరకొర నిధులు కేటాయించి పనులు పూర్తి చేయకపోవడంతో రాష్ట్రంలో తిరిగి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అధిక నిధులు కేటాయించేలా కృషి చేసి ప్రాజెక్ట్‌ను పూర్తి చేసి గోదావరి జలాలను కాలువల్లో పారించారని చెప్పారు. ఆయన పుట్టిన ఖమ్మం జిల్లా, ప్రాతినిధ్యం వహించిన తుంగతుర్తి, సూర్యాపేట నియోజక వర్గాలలో రాంరెడ్డి కుటుంబం కడవరకు పార్టీ అభివృద్ధి కోసం పాటుపడిందన్నారు. తాను ప్రాతినిధ్యం వహించిన తుంగతుర్తిని వీడి సూర్యాపేట నియోజక వర్గానికి వెళ్ళినా ఏనాడు తుంగతుర్తి ప్రాంతాన్ని మరువలేదన్నారు. కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకోవడంతోనే గత అసెంబ్లీ ఎన్నికల్లో జేబులో రూ.50వేలు లేని మందుల సామేల్ 50వేల మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలిచారని అన్నారు. నాలుగు దశాబ్ధాలుగా గాంధీ కుటుంబానికి దామోదర్‌రెడ్డి కుటుంబానికి ఎంతో అనుబంధం ఉందన్నారు. అందుకే ఎఐసిసి సభ్యురాలు సోనియాగాంధీ, జాతీయ అధ్యక్షులు ఖర్గే, జాతీయ యువ నాయకులు రాహుల్‌గాంధీ దామన్న మరణవార్త విని ఆయన కుమారునికి సంతాపం తెలిపారని అన్నారు. దామోదర్ రెడ్డి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందన్న విషయాన్ని తనతో చెప్పడం జరిగిందని సిఎం సభలో వెల్లడించారు. రాజకీయపరంగా గాంధీ కుటుంబం దామోదర్ రెడ్డి కుమారుడు సర్వోత్తమ్ రెడ్డికి అవకాశం కల్పిస్తుందని తెలిపారు. చివరి శ్వాస ఉన్నంత వరకు కాంగ్రెస్ జెండాను వీడని దామోదర్ రెడ్డి కరుడుగట్టిన కాంగ్రెస్ వాదిగా ఉండడంతోనే ఈ ప్రాంత ప్రజలు ఆయనను ముద్దుగా టైగర్ దామన్న అని పిలుచుకుంటున్నారని చెప్పారు. డిప్యూటి సిఎం మల్లు భట్టివిక్రమార్క, రాష్ట్ర పౌరసరఫరాల, నీటిపారుదల శాఖల మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్‌రెడ్డి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రోడ్లు భవనాలు, సినిఫోటోగ్రఫి శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్, మాజీ మంత్రి, సీనియర్ నాయకులు కుందూరు జానారెడ్డి, ఎమ్మెల్సీలు శంకర్ నాయక్, అద్దంకి దయాకర్ తదితరులు తమ సంతాప సందేశాన్ని ఇచ్చారు. దామోదర్ రెడ్డితో వారికి ఉన్న అనుబంధాన్ని, పార్టీ కోసం చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు బాలు నాయక్, వేముల వీరేశం, మట్ట రాఘవమహీ, డిప్యూటి స్పీకర్ డాక్టర్ రాంచందర్ నాయక్, తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పోరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షులు చెవిటి వెంకన్న యాదవ్, సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, రాష్ట్ర నాయకులు పోతు భాస్కర్ పాల్గొన్నారు.

## దొరే అయినా... ఏనాడూ అలా వ్యవహరించలేదు

### పేదలతో రాంరెడ్డి కుటుంబానికి విడదీయరాని అనుబంధం

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు



**ప్రజాపక్షం/తుంగతుర్తి :** పుట్టుక దొరలే అయినా మాజీ మంత్రులు రాంరెడ్డి వెంకట్‌రెడ్డి, రాంరెడ్డి దామోదర్ రెడ్డిలు ఏనాడు దొరతనంతో వ్యవహరించలేదని పేదలతోనే వారి కుటుంబానికి మొదటి నుండి విడదీయరాని అనుబంధం ఉందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. తుంగతుర్తి నియోజక వర్గ కేంద్రంలో ఆదివారం నిర్వహించిన మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి సంతాప సభకు ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంతో కలిసి హాజరయ్యారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దామోదర్ రెడ్డి కుమారుడు సర్వోత్తమ్ రెడ్డిని ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దామోదర్ రెడ్డి తమ ఖమ్మం జిల్లా బిడ్డనేనని అన్నారు. వారిది కాంగ్రెస్ వాదులైనా మేము కమ్యూనిస్టులమైనా తమ మధ్య అనుబంధం విడధీయరానిదని గుర్తు చేసుకున్నారు. సుజాతనగర్‌లో తన అన్న రాంరెడ్డి వెంకట్‌రెడ్డి కమ్యూనిస్టులపైనే నాలుగు సార్లు ఎమ్మెల్యేగా పోటీచేసి ఒక్కసారి గెలుపొందారని చెప్పారు. ఉమ్మడి ఖమ్మం, నల్లగొండ జిల్లాల్లో వెంకట్‌రెడ్డి, దామోదర్ రెడ్డిలు ఢీకొన్నది కమ్యూనిస్టులతో నేనని అన్నారు. తనకు రాంరెడ్డి కుటుంబంతో వ్యక్తిగత సంబంధాలు ఉన్నాయని చెప్పిన ఆయన ప్రత్యక్ష ఎన్నికల్లో ఓడినా, గెలిచినా నిత్యం ప్రజల్లోనే ఉంటూ వారు జీవనం సాగించారని తెలిపారు. తన అన్న వెంకట్‌రెడ్డి మరణించగా పాతలింగాలకు తాను వెళ్ళగా ఆ ప్రాంత గిరిజనులతో వారికి ఉన్న సంబంధాలను చూసి ఆశ్చర్యపోయానన్నారు. పుట్టింది దొర పుట్టుక అయినా ఏనాడు వారు దొరల్లా వ్యవహరించకుండా పేదలకు అండగా నిలిచారని కొనియాడారు. దామోదర్ రెడ్డి కుమారుడు సర్వోత్తమ్ రెడ్డికి మంచి భవిష్యత్తు రాజకీయ భవిష్యత్తు ఉండాలని ఆకాంక్షించారు. వారి పెద్దల ఆశయాలను ముందుకు తీసుకపోవాలని కోరారు.

### గోదావరి జలాల సాధనకై పోరాడిన మహానాయకుడు: ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

కరువు ప్రాంతాలైన తుంగతుర్తి, సూర్యాపేట ప్రాంతాల్లో గోదావరి జలాలను తీసుకవచ్చేందుకు సుదీర్ఘకాలం పోరాడిన మహానాయకుడు మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి అని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. నిత్యం ప్రజల మధ్య ఉంటూ ప్రజాసమస్యల కోసం పోరాడిన దామోదర్ రెడ్డి మరణం బాధాకరమన్నారు. 1985లో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ నుండి తుంగతుర్తి నియోజక వర్గంలో శాసనసభ్యునిగా గెలుపొందిన ఆయన ప్రజా నాయకుడిగా అంచెలంచెలుగా ఎదిగారన్నారు. ఐదు పర్యాయాలు శాసనసభ్యుడిగా, రెండు సార్లు మంత్రిగా పనిచేసి ప్రజల అభిమానాన్ని చూరగొన్నారని అన్నారు. దామోదర్ రెడ్డి కుమారుడు సర్వోత్తమ్ రెడ్డి ఆయన ఆశయ సాధన కోసం ముందుకు సాగాలని కోరారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com